01-04-2024
సోమవారం
హైదరాబాద్
సంపుటి 26, సంచిక: 284
పేజీలు: 8 | ఖమ్మం : 8+8
కరీంనగర్ : 8+8 | మహబూబ్‌నగర్: 8
వెల రూ. 5.00
Published from:
Hyderabad, Khammam,
Karimnagar, Mahabubnagar

www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
PRAJAPAKSHAM ★

తర తరాల పిల్లల కథలు
రూ।। 70/-
పేజీలు:64

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

# బలాన్ని చూపిద్దాం... బిజెపిని ఓడిద్దాం





## 'సేవ్ డెమోక్రసీ' ర్యాలీలో 'ఇండియా' కూటమి సమర శంఖారావం

### కేజ్రీవాల్, హేమంత్ సోరేన్‌కు సంఘీభావం

### దేశం విపత్తును ఎదుర్కొంటున్నది: డి. రాజా

### కొత్త శక్తి ఉద్భవించింది: సీతారాం ఏచూరి

**న్యూఢిల్లీ:** ప్రజాస్వామిక, లౌకిక శక్తులన్నీ ఏకం కావాల్సిన అవసరం ఏర్పడిందని రాంలీలా మైదానంలో జరిగిన 'సేవ్ డెమోక్రసీ' ర్యాలీలో 'ఇండియా' కూటమి నాయకులు వ్యాఖ్యానించారు. బలాన్ని చూపించి, బిజెపిని ఓడిద్దామని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ బిజెపి నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా పోరాటం సాగిస్తామంటూ, ర్యాలీ వేదికగా సమర శంఖారావాన్ని మోగించారు. అవినీతి ఆరోపణలపై అరెస్టయిన ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు, జార్ఖండ్ మాజీ సిఎం హేమంత్ సోరెన్‌కు సంఘీభావం ప్రకటించారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన తర్వాత, ప్రతిపక్ష పార్టీల 'ఇండియా' కూటమి తొలి భారీ ర్యాలీ ఆదివారం జరిగింది. కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం, సమాజ్‌వాది పార్టీ తదితర పార్టీలకు చెందిన పలువురు కీలక నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు. దేశం విపత్తును ఎదుర్కొంటున్నదని, అందరూ సమష్టిగా ఈ సమస్యను ఎదుర్కోవాలని ర్యాలీని ఉద్దేశించి ప్రసంగిస్తూ, సిపిఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా అన్నారు. ప్రతిపక్ష పార్టీలను లక్ష్యంగా చేసుకొని, ఇడి, ఐటి వంటి కేంద్ర ఏజెన్సీలను నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రయోగిస్తున్నదని విమర్శించారు. ఒకే శక్తిగా నిలిచి, దేశాన్ని నాశనం చేస్తున్న శక్తులను ఓడిస్తామని ధీమా వ్యక్తం చేశారు. మన దేశాన్ని మనం రక్షించుకోవాలని అన్నారు. సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మాట్లాడుతూ భారత దేశంలో కొత్త శక్తి తరువాయి 2లో

## ప్రతిపక్ష నేతలు ఒక్కటైన వేళ..



ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో శనివారం 'సేవ్ డెమోక్రసీ' పేరుతో 'ఇండియా' కూటమి నిర్వహించిన భారీ ర్యాలీలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొని ప్రసంగించారు. మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ (కాంగ్రెస్), డి. రాజా (సిపిఐ), సీతారాం ఏచూరి (సిపిఎం), అఖిలేష్ యాదవ్‌తోపాటు శరద్ యాదవ్ (ఎన్‌సిపి), ఫరూక్ అబ్దుల్లా (నేషనల్ కాన్ఫరెన్స్), ఉద్ధవ్ థాకరే (శివసేన యుబిటి), తేజస్వీ యాదవ్ (ఆర్‌జెడి), డెరెక్ ఒబ్రియాన్ (టిఎంసి), దీపాంకర్ భట్టాచార్య (సిపిఐ ఎంఎల్/ లిబరేషన్), జి. దేవరాజన్ (ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్), తదితరులు పాల్గొన్నారు. అరవింద్ కేజ్రీవాల్ (ఆప్) సతీమణి సునీత, హేమంత్ సొరెన్ (జెఎంఎం) భార్య కమల కూడా ఈ ర్యాలీలో పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాల్లో ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను కూల్చడానికి తరువాయి 2లో



ఆర్‌ఎస్‌ఎస్ బిజెపి దేశాన్ని నాశనం చేసే విషం. దేశంలో ప్రజాస్వామ్యం నేడు ప్రమాదంలో పడింది. అందరం కలసికట్టుగా బిజెపిని ఓడించాలి.
– ఆప్ నాయకుడు, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్



'లోక్‌సభ ఎన్నికల్లో కనీసం 400 సీట్లు సంపాదిస్తామని బిజెపి అంటున్నది. కానీ, ఇవిఎంలు లేకుండా, మ్యాచ్ ఫిక్సింగ్ చేయకుండా, ప్రతిపక్ష నాయకులపై ఒత్తిళ్లు పెట్టకుండా, మీడియాను గుప్పిట్లో ఉంచుకోకుండా కనీసం 180 సీట్లు కూడా సంపాదించే అవకాశం ఆ పార్టీకి లేదు'
– రాహుల్‌గాంధీ





## రాష్ట్రంలో భానుడి భగభగలు

### మూడు డిగ్రీలు పెరగనున్న ఉష్ణోగ్రతలు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో ఎండలు మండుతున్నాయి. ఉదయం తొమ్మిది గంటల నుండే భానుడి ప్రతాపం మొదలు కావడంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు కీలక హెచ్చరికలు జారీ చేశారు. రాగల మూడురోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు రెండు నుంచి మూడు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని వెల్లడించారు. రాత్రి ఉష్ణోగ్రతలు సైతం పెరిగే అవకాశాలున్నాయన్నారు. ఈ మేరకు ఈఎల్లో అలెర్ట్‌ను జారీ చేశారు. ఆదివారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో అక్కడక్కడ రాత్రి సమయాల్లో సాధారణం కంటే వేడిగా ఉండే అవకాశాలున్నాయన్నారు. సోమవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, తరువాయి 2లో

## ప్రైవేటు కంపెనీల భాగస్వామ్యంతో కొత్త విద్యుత్ పాలసీ

### ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత శాసనసభలో ముసాయిదా బిల్లును ప్రవేశపెట్టే అవకాశం

### రాబోయే ఏడేళ్లలో అవసరమయ్యే విద్యుత్ అంచనాలను దృష్టిలో పెట్టుకుని కసరత్తు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం కొత్త విద్యుత్ పాలసీ రూపకల్పనకు కసరత్తు మొదలు పెట్టింది. ప్రభుత్వం ప్రైవేటు కంపెనీల భాగస్వామ్యంతో విద్యుత్ ఉత్పత్తి, సరఫరా వ్యవస్థలను ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా తీర్చిదిద్దే లక్ష్యాలతో కొత్త పాలసీకి శ్రీకారం చుట్టింది. లోక్‌సభ ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత శాసనసభలో కొత్త విద్యుత్ విధాన ముసాయిదా బిల్లును ప్రవేశపెట్టే అవకాశం ఉన్నది. రాబోయే ఏడేళ్లలో (2032 సంవత్సరం వరకు) అవసరమయ్యే విద్యుత్ అంచనాలను దృష్టిలో పెట్టుకుని కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో గరిష్ఠంగా 15,623 మెగా వాట్ల విద్యుత్ పీక్ లోడ్ డిమాండ్ ఉండగా, 203132 సంవత్సరం నాటికి 27,059 మెగా వాట్ల పీక్ డిమాండ్‌కు చేరుకుంటుందని విద్యుత్తు సంస్థలు అంచనా వేసింది. దీనికి అనుగుణంగా కొత్త విద్యుత్ పాలసీ ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటుంది. భవిష్యత్తులో కూడా ఖరీదైన థర్మల్ విద్యుత్ జోలికి వెళ్లకుండా, పునరుత్పాదక విద్యుత్‌ను (సౌర, జల , పవన విద్యుత్, పంప్డ్ స్టోరేజీ, బ్యాటరీ స్టోరేజ్ విద్యుత్ )దృష్టిలో పెట్టుకుని ప్రణాళికలను రూపొందిస్తున్నట్టు విద్యుత్ శాఖ తెలిపింది. ఏడాదికేడాది పెరుగుతున్న విద్యుత్తు అవసరాల దృష్ట్యా, అందుకు సరిపడే విద్యుత్తు ఉత్పత్తి, కొనుగోళ్లపై కొత్త పాలసీ తయారు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. కొత్త విద్యుత్తు విధాన ముసాయిదా బిల్లుపై విస్తృతంగా చర్చించాలని, వివిధ రంగాల నిపుణులు, ప్రజల అభిప్రాయాలు, అభ్యంతరాలు, సలహాలు సూచనలన్నీ స్వీకరించాలని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో బహిరంగ విచారణ కూడా నిర్వహించాలని నిర్ణయించింది.



**డిస్కంలపై విద్యుత్ కొనుగోళ్ల భారం**

పదేళ్ల గత ప్రభుత్వం చేసిన పాపాలు రాష్ట్రంలో విద్యుత్తు సంస్థలకు గుది బండగా మారాయి. పునర్విభజన చట్టం తరువాయి 2లో

## లౌకికవాద పరిరక్షణే కీలకం

### లోక్‌సభ ఎన్నికలపై కేరళ ముఖ్యమంత్రి విజయన్ వ్యాఖ్య



**తిరువనంతపురం:** దేశంలో లౌకికవాద పరిరక్షణ అత్యంత కీలకమని, ఈ కోణంలోనే, రాబోయే లోక్‌సభ ఎన్నికలు అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నాయని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ అన్నారు. కేరళలోని 20 లోక్‌సభ నియోజకవర్గాల్లో 24 రోజుల ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని చేపట్టిన ఆయన 'ది హిందూ' పత్రికకు మెయిల్ ద్వారా ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలను ప్రస్తావించారు. పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ)ను లెఫ్ట్ డెమోక్రాటిక్ ఫ్రంట్ (డిఎల్‌ఎఫ్) వ్యతిరేకిస్తున్నదని స్పష్టం చేశారు. 'ఇక్కడ మైనారిటీలు... మెజారిటీలు అనేది ప్రశ్న కాదు.. లౌకిక వాదమే కీలకం' అన్నారు. ఒక సిద్ధాంతాన్ని లేదా విధానాన్ని నమ్మిన వారితోపాటు, నమ్మనివారు కూడా స్వాతంత్ర్య పోరాటంలో పాలు పంచుకున్నారని, ఆ తర్వాత లౌకిక దేశంగా ఉండాలని నిర్ణయించారని విజయన్ గుర్తుచేశారు. మత ప్రాతిపదికపై పౌరసత్వం ఆధారపడి ఉండదని ఆయన తేల్చిచెప్పారు. కాంగ్రెస్‌లో చీలికలు సిపిఎం నేతృత్వంలోని ఎల్‌డిఎఫ్‌కు ప్రయోజనం చేకూర్చవని విజయన్ అన్నారు. అయితే, మృదు హిందుత్వ పంథాను అనుసరించడం వల్ల బిజెపిని నిరోధించలేమని చెప్పారు. మత తత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా రాజీలేని వైఖరితో మాత్రమే ఆ పార్టీని దెబ్బతీయవచ్చని అన్నారు. ప్రజాస్వామిక, లౌఇక పార్టీల నుంచి వలసలు, హిందూ మితవాద శక్తులకు బలాన్నిస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. వాయనాడ్ నుంచి కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ పోటీలో ఉండడం వల్ల కేరళకు ఎలాంటి నష్టం లేదని విజయన్ వ్యాఖ్యానించారు. పార్లమెంటు సభ్యుడిగా నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేసింది ఏమీ లేదని, ఈ విషయాన్ని వాయనాడ్ ప్రజలు విశ్లేషించుకుంటారని చెప్పారు. మానవులు వన్యప్రాణుల సంఘర్షణ, సిఎఎ, అయోధ్య వంటి అంశాలపై రాహుల్ వైఖరిలో స్పష్టత లేదని విజయన్ అన్నారు. 'బిజెపితో కాంగ్రెస్ నిజయంగానే పోరాడాలి అనుకుంటే, ఆ పార్టీ అభ్యర్థులతో నేరుగా ఎన్నికల బరిలోకి దిగాలి. పార్టీ అగ్రనేతలే తరువాయి 2లో



## రాజ్యాంగ మౌలిక విలువల పునాదులను ధ్వంసం చేస్తోన్న కేంద్ర ప్రభుత్వం

### ప్రజాస్వామ్యం, లౌకికవాదం, నీతి, నిజాయితీని రక్షించుకోవడమే మా ప్రధాన పోరాటం

### సిపిఐ(ఎం) రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు బివి రాఘవులు

ప్రజాపక్షం/హైదరాబాద్

లోక్‌సభ ఎన్నికల్లో ప్రజాస్వామ్యం, లౌకికవాదం, నీతి, నిజాయితీని రక్షించుకోవడమే తమ ప్రధాన పోరాటమని సిపిఐ(ఎం) రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు అన్నారు. మోడి నాయకత్వంలోని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ మౌలిక విలువల పునాదులను ధ్వంసం చేస్తోందని, దీనిని కాపాడుకోకపోతే ఈ ఎన్నికల్లో బిజెపిని ఓడించలేమన్నారు. టి. జ్యోతి అధ్యక్షతన సిపిఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గం, చెరుపల్లి సీతారాములు అధ్యక్షతన రాష్ట్ర కమిటీ సమావేశాలను శని,ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని ఎం.బి.భవన్ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బి.వి. రాఘవులు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం ప్రతిపక్షాలను కకావికలం చేస్తోందని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో బిజెపి తరువాయి 2లో

## వంద రోజుల పాలనలో 200మంది రైతుల ఆత్మహత్య

### బిఆర్‌ఎస్ అధినేత, మాజీ సిఎం కెసిఆర్



ప్రజాపక్షం/సూర్యాపేటప్రతినిధి

బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులు బ్రహ్మాండంగా పంటలను సాగు చేసుకున్నారని కానీ అనతికాలంలోనే ఇంతర దుర్భర పరిస్థితి వస్తదని అనుకోలేదని బిఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు.ఆదివారం జనగామ,సూర్యాపేట జిల్లాల్లోని వివిధ మండలాల్లో పర్యటించినంతరం సూర్యాపేటలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ రైతుల దుస్థితి చూస్తే చాలా బాధగా అనిపించిందన్నారు. 2014లో బిఆర్‌ఎస్ అధికారంలోకి రాకముందు రాష్ట్రంలో ఏటా 30,40 లక్షల టన్నుల ధాన్యం కూడా ఉత్పత్తి అయ్యేది కాదు. కానీ తాము అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో ధాన్యం ఉత్పత్తి ఏకంగా 3 కోట్ల టన్నులు దాటిందన్నారు.ప్రభుత్వం రైతు సంక్షేమ తరువాయి 2లో

**కెసిఆర్ ప్రెస్‌మీట్‌లో పవర్ కట్..!** 3లో



## కాంగ్రెస్‌లోకి ఎంఎల్‌ఎ కడియం

### శ్రీహరి కుమార్తె కావ్య, మాజీ ఎంఎల్‌సి మోహన్‌రెడ్డి కూడా చేరిక

ప్రజాపక్షం/హైదరాబాద్

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరికలు జోరందుకుంటున్నాయి. బిఆర్ఎస్‌కు చెందిన సీనియర్ నేత, ఎంఎల్‌ఎ కడియం శ్రీహరి, ఆయన కుమార్తె కడియం కావ్య కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ దీపాదాస్ మున్షీ, టిపిసిసి అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సమక్షంలో హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీలోఆదివారం చేరారు. దీపాదాస్ మున్షీ వారికి తరువాయి 2లో

## పోడు భూముల కోసం గిరిజనుల ఘర్షణ



### నిలువరించడానికి ప్రయత్నించిన పోలీసులు పలువురుకి గాయాలు

ప్రజాపక్షం/ఖమ్మం

పోడు భూమి వ్యవహారం చిలికి చిలికి గాలి వానలా మారింది. పోడు భూమి తమదంటే తమదని రెండు వర్గాల మధ్య గిరిజనులు గత కొంత కాలంగా వాదులాడుకుంటున్నారు. ఆదివారం ఇరు వర్గాలు తరువాయి 2లో

# ఏప్రిల్ 19 నుంచి జూన్ 1వరకు ఎగ్జిట్ పోల్స్‌పై నిషేధం..

**న్యూఢిల్లీ:** ఎగ్జిట్ పోల్స్‌పై ఏప్రిల్ 19వ తేదీ నుంచి జూన్ 1వ తేదీ వరకు భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ) నిషేధం విధించింది. కమిషన్ విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం, ఆ కాలంలో, లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన ఎగ్జిట్ పోల్స్‌పై ప్రింట్, ఎలక్ట్రానిక్‌తోపాటు అన్ని రకాల మీడియాలో నిషేధం అమల్లో ఉంటుంది. లోక్‌సభ ఎన్నికలతోపాటు ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, ఒడిశా, సిక్కిం అసెంబ్లీ ఎన్నికలకు కూడా ఈ నిబంధన వర్తిస్తుంది. ఎగ్జిట్‌పోల్స్ నిర్వహించడం, ప్రచురించడం, ప్రసారం చేయడం నేరం.ఈ నిషేధం ఏప్రిల్ 19 ఉదయం 7 గంటల నుంచి జూన్ 1వ తేదీ సాయంత్రం 6.30 గంటల వరకూ అమల్లో ఉంటుంది. మొత్తం 543 లోక్ సభ స్థానాలకు ఏప్రిల్ 19 నుంచి ఏడు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 10.5 లక్షల పోలింగ్ కేంద్రాల్లో 44 రోజుల పాటు జరిగిన పోలింగ్ ప్రక్రియలో 49.7 కోట్ల మంది పురుషులు, 47.1 కోట్ల మంది మహిళలు మొత్తం 97 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

# 200 సీట్ల కంటే ఎక్కువ గెలిచి చూపండి

### బిజెపికి పశ్చిమ బెంగాల్ సిఎం మమతా బెనర్జీ సవాల్



**కృష్ణానగర్ (పశ్చిమ బెంగాల్):** రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో 400లకు పైగా సీట్లు గెల్చుకుంటామని అంటున్న బిజెపి ఆశలు నెరవేరవని తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) అధినేత్రి, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మ మతా బెనర్జీ అన్నారు. 200 కంటే ఎక్కువ సీట్లు గెలిచి చూపాలని ఆమె బి జెపికి సవాలు విసిరారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపికి 200కు పైగా సీట్లు వస్తాయని చెప్పారని, కానీ 77 స్థానాలకే పరిమితం కావాల్సి వచ్చిందని ఆమె గుర్తుచేశారు. తమ పార్టీ లోక్‌సభ అభ్యర్థి మహువా మొయిత్రా కు మద్దతుగా కృష్ణానగర్‌లో జరిగిన న్నికల ర్యాలీలో ఆదివారం పాల్గొన్న ఆమె మాట్లాడుతూ, బిజెపి ఓటమి ఖాయమన్నారు. తమ రాష్ట్రంలో ఆ పా ర్టీకి సీట్లు దక్కవని అన్నారు. 'పశ్చిమ బెంగాల్ అంటే టిఎంసి మాత్రమే' అ ని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ) అమలు ను అనుమతించబోమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. 'సిఎఎ అనేది చట్టబద్ధమైన పౌరులను విదేశీయులుగా మార్చే ఉచ్చు. పశ్చిమ బెంగాల్లో సిఎ ఎ, ఎన్ఆర్‌సిలను అనుమతించబోం' అని తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లో ప్రతిపక్ష కూటమి 'ఇండియా' కూటమి భాగస్వామ్య పక్షాలైన సిపిఎం, కాంగ్రెస్‌లు బిజెపితో చేతులు కలిపాయని మమత ఆరోపించారు. బిజెపికి వ్యతిరేకంగా గళమెత్తినందుకే తమ ఎంపీ మహువా మొయిత్రాను లోక్ సభ నుంచి బహిష్కరించారని ధ్వజమెత్తారు. అందుకే ఆమెతో పాటు బెంగాల్‌లోని మొత్తం 42 స్థానాల్లోనూ టిఎంసిని గెలిపించాలని ఆమె పిలుపునిచ్చారు.

# అభ్యర్థులు వారే... పార్టీలే వేరు

### రసవత్తరంగా చేవేళ్ల లోక్‌సభ రాజకీయం

**ప్రజాపక్షం / వికారాబాద్ ప్రతినిధి :** సార్వత్రిక ఎన్నికల వేళ చేవేళ్ల రాజకీయం రసవత్తరంగా మారింది. గత పార్లమెంటు ఎన్నికల్లో, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ఆ పార్టీలో ఉన్న వాళ్లు ఈ పార్టీలోకి, ఈ పార్టీలో ఉన్న వాళ్లు ఆ పార్టీలోకి మారడం సర్వసాధారణమైంది. మొదటగా బిజెపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని ప్రకటించంది. బిఆర్ఎస్ పార్టీ తరపున కాసాని జ్ఞానేశ్వర్, కాంగ్రెస్ పార్టీ కండుక కప్పుకున్న సిట్టింగ్ ఎంపి రంజిత్‌రెడ్డి కాంగ్రెస్ తరపున పోటీ చేస్తున్నారు. చేవేళ్ల లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ మూడు పార్టీల ముగ్గురు నేతలు ఆర్థికంగా, సామాజికంగా బలమైన వారే కావడంతో పోటీ రసవత్తరంగా మారనుంది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపొందిన ఊపునే కొనసాగించాలని, చేవేళ్ల స్థానాన్ని దక్కించుకోవాలని గతంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జెడ్‌పి చైర్‌పర్సన్‌గా ఉన్న సునీతారెడ్డి బిఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరడం కలిసొచ్చే అంశమని అంటున్నారు. అయితే ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన వారికి టిక్కెట్ ఇచ్చినందున కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏ మేరకు సహకరిస్తారో చూడాలని, బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లో చేరిన రంజిత్‌రెడ్డి వెంట ఎవ్వరూ చేరకపోవడంతో కాంగ్రెస్‌కు ఏమేరకు కలిసోస్తుందో చూడాల్సి ఉందని పార్టీ నాయకులు అంటున్నారు. చేవేళ్ల లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ని ఏడు అసెంబ్లీ స్థానాలకుగాను చేవేళ్ల, రాజేంద్రనగర్, మహేశ్వరం శేరిలింగంపల్లి బిఆర్ఎస్ ఎంఎల్ఎలు ఉన్నందు వల్ల బిఆర్ఎస్‌కు కలిసొచ్చే అంశమని అంటున్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో అప్పటి బిఆర్ఎస్ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డికి 5,28,148 ఓట్లు (40 శాతం) రాగా, కాంగ్రెస్ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి 5,13,831 ఓట్లు (39.5 శాతం) రాగా, బిజెపి అభ్యర్థి జనార్ధన్‌రెడ్డికి 2,01,960 ఓట్లు (15.52 శాతం) వచ్చాయి. బిఆర్ఎస్ మాజీ ముఖ్యమంత్రితో ఉన్న మంచి సంబంధాలతో 2019లో చేవేళ్ల నుంచి స్వల్ప మెజార్టీతో గెలిచారు. కాగా ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు నియోజకవర్గ ప్రజలకు కొత్తవారు కాకపోయినప్పటికీ వారు పార్టీలు మారినందున ఓటర్లు ఎలా స్పందిస్తారో ఎన్నికల వరకు వేచి చూడాల్సిందే.

# కాంగ్రెస్‌లోకి ఎంఎల్ఎ కడియం

(మొదటి పేజీ తరువాయి)



పార్టీ కందువ కప్పి కాంగ్రెస్‌లోనికి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డితో పాటు పలువురు ఉన్నారు.

### మాజీ ఎంఎల్‌సి బి.మోహన్ రెడ్డి

మాజీ ఎంఎల్‌సి బి.మోహన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

# 200మంది రైతుల ఆత్మహత్య

(మొదటి పేజీ తరువాయి)

విధానాలతో ఉత్పత్తి అధికమై పంజాబ్‌కే పోటీగా నిలిచిందని,అంతేకాదు అనతికాలంలోనే దేశంలోనే అగ్రస్థానానికి దూసుకపోయిందని ఇట్టి కట్టుకథ కాదు పిట్ట కథ కాదు వాస్తవం.మరి ఇంత సుభిక్షంగా ఉన్న రాష్ట్రం పరిస్థితి ఇప్పుడు ఇంత అధ్వాన్నంగా మారడానికి కారణం ఎవరు? లోపం ఎక్కడున్నది? ఈ విషయంపై ప్రజలతో పాటు జర్నలిస్టు మిత్రులు కూడా ఆలోచన చేయాలని కెసిఆర్ సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత ఇంత తొందరగా కేవలం వందరోజులలోపే రైతులకు ఇంత దుర్భర పరిస్థితి వస్తదని అనుకోలే. కేవలం వందరోజుల పరిపాలనలో 200 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు.మేం రైతులకు అన్ని ఏర్పాట్లు చేసి పెట్టిన ఈ దుస్థితి ఎందుకొచ్చింది...? దేశంలో ఉత్పత్తిలో నెంబర్‌వన్ స్థాయికి ఎదిగిన రాష్ట్రం అనతికాలంలోనే ఈ స్థాయికి ఎందుకు దిగజారింది. మిషన్‌భగరీథ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఇంటికో నల్లా పెట్టి నీళ్లు ఇచ్చిన రాష్ట్రంలో తాగునీటికి కరువు ఎందుకొచ్చినట్లు...? మా టైమ్‌లో బ్రహ్మాండంగా తాగునీటి సరఫరా జరిగింది. ఎక్కడ నీళ్ల ట్యాంకర్లు కనపడలే. కానీ ఇప్పుడు హైదరాబాద్ నగరంలో కూడా ట్యాంకర్లతో నీళ్లు సరఫరా చేసే దుస్థితి ఎందుకొచ్చిందని..? అని కేసీఆర్ ప్రశ్నించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్యయాదవ్, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ పాల్గొన్నారు.



భారత మాజీ ఉప ప్రధాని ఎల్‌కె అద్వానీకి, ఢిల్లీలోని ఆయన నివాసంలో భారత రత్న అవార్డును ప్రదానం చేస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము. ప్రధాని నరేంద్ర మోడీ కూడా ఆమె వెంట అద్వానీ నివాసానికి వెళ్లి, అవార్డు ప్రదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అవినీతిపరులకు వ్యతిరేకంగా పోరాటం

### ప్రధాని నరేంద్ర మోడీ



**మీరట్:** అవినీతిపరులకు వ్యతిరేకంగా తాము పోరాడుతున్నామని, అయితే, వారిని కాపాడేందుకు ప్రతిపక్ష పార్టీలు ఆరటంపడుతున్నాయని ప్రధాని నరేంద్ర మోడీ వ్యాఖ్యానించారు. అవినీతికి వ్యతిరేకంగా తాము తీసుకుంటున్న చర్యలను చూసి కొందరు వణికిపోతున్నారని అన్నారు. గత పదేళ్లలో కేవలం అభివృద్ధి ట్రైలర్ మాత్రమేనని, తనపైదేశాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని, ఉత్తరప్రదేశ్ లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని ప్రధాని మోడీ ఆదివారం మీరట్ నుంచి ప్రారంభించారు. అనంతరం జరిగిన ర్యాలీలో ఆయన మాట్లాడుతూ, రాబోయే ఎన్నికలు ప్రభుత్వాన్ని ఎన్నుకోవడానికి మాత్రమే కాదని, 'విక్షిత్ భారత్' (అభివృద్ధి చెందిన భారత్)ను రూపొందించడానికి కూడా అని అన్నారు. 'దళారులు ఎవరూ పేదల నుంచి డబ్బులు దొంగిలించకుండా చూశాం. నేను అవినీతికి వ్యతిరేకంగా పోరాడుతున్నాను, అందుకే అవినీతిపరులు నేడు జైలులో ఉన్నారు. రాబోయే ఎన్నికలు అవినీతికి వ్యతిరేకంగా పోరాడుతున్న ఎన్‌డిఎకు, అవినీతిపరులను కాపాడేందుకు ప్రయత్నిస్తున్న ప్రతిపక్షాలకు మధ్య జరుగుతున్నాయని మోడీ వ్యాఖ్యానించారు. తాను అవినీతిపరులపై విచారణ జరపడమే కాకుండా, ప్రజలు దొంగిలించిన సంపదను వారికి తిరిగి ఇస్తున్నానని ప్రధాని మోడీ చెప్పారు. తమ ప్రభుత్వం ఇప్పటికే మూడోసారి ఎన్నికలకు సన్నాహాలు ప్రారంభించిందని ప్రధాని మోడీ అన్నారు. రాబోయే ఐదేళ్లకు రోడ్ మ్యాప్ రూపొందిస్తున్నామని, మొదటి 100 రోజుల్లో ఎలాంటి కీలక నిర్ణయాలు తీసుకోవాలనే దానిపై కసరత్తు వేగంగా జరుగుతోందని తెలిపారు.

# నేడు, రేపు పిఒ,ఎపిఒలకు శిక్షణ

### జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పార్లమెంట్ ఎన్నికలు సమర్ధవంతంగా జరిపేందుకు పిఒ, ఎపిఒలుగా నియమించిన వారందరికీ ఏప్రిల్ 1, 2 తేదీలలో ఉదయం, మధ్యాహ్నం సమయంలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందుకు 15 కళాశాలలో ఒక్కొక్క కాలేజీలో నాలుగు హాల్‌లలో మొత్తం 60 హాళ్లలో మొత్తం11,442 మందికి శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు, మధ్యాహ్నం 2గంటల నుండి సాయంత్రం5 గంటల వరకు, ఉదయం 50మంది సాయంత్రం 50 మందికి చొప్పున ఒక్కక్క హాల్‌లో ఉదయం సమయాల్లో ఈనెల 1తేదీన, మొత్తం 3000 మందికి శిక్షణ ఇవ్వనున్నారు. మధ్యాహ్నం సమయంలో మరో 3000 మందికి మొత్తం 6వేల మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్ఎంసి రోనాల్డ్ రోస్ తెలిపారు. ఈనెల 2వ తేదీన ఉదయం సమయంలో ఇవే హాల్‌లో మొత్తం 3042 మందికి, మధ్యాహ్నం నుండి సాయంత్రం వరకు జరిగే మరో 2400 మందికి మొత్తం 5442 మందికి శిక్షణ ఇవ్వనున్నారు. ఎన్నికల విధులు నిర్వహణలో బాగంగా పిఒ, ఎపిఒలకు ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసి శిక్షణ తరగతులకు హాజరుకావాలని కోరామన్నారు. వచ్చే వారు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఫారం12 ఇవ్వనున్న నేపథ్యంలో ఓటరు ఎపిక్ కార్డు నెంబర్, ఓటరుగా నమోదు అయిన నియోజక వర్గంలోని ఓటరు జాబితాలో గల పార్ట్ నెంబర్, సిరియల్ నెంబర్ కూడా తీసుకరావాల్సి ఉంటుందన్నారు. ఓటరు జాబితాలో పేరు ఉందో లేదా తెలుసుకోవాలంటే http:// voters.eci.gov.in వెబ్ సైట్‌లో పరిశీలించుకోవాలని సూచించారు. ఎన్నికల విధులకు సంబంధించిన ఉత్తర్వులతో పాటుగా ఫారం12 జత చేస్తూ పంపించారు. శిక్షణ తరగతులకు పిఒ, ఎపిఒలు అందరరూ హాజరు కావాలని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు.

### శిక్షణ తరగతులు నిర్వహించే కళాశాల వివరాలు

- అరోరా లీగల్ సైన్స్ అకాడమీ ఆల్ నెంబర్ 1,2, 3, 4
- ఏ.వి. ఆర్ట్స్, సైన్స్ కామర్స్ కళాశాల హాల్ నెంబర్ 1,2,3,4
- డ్రీమ్ ల్యాండ్ గార్డెన్ హాల్ 1,2,3,4
- జి. నారాయణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఫర్ ఉమెన్ 1,2,3,4
- ప్రభుత్వ డిగ్రీ కళాశాల చింతల బస్తీ ఖైరతాబాద్ హాల్ నెంబర్1,2,3,4
- జెఎన్ఎఫ్ఎయు హాల్ నంబర్ 1,2,3,4
- ముంతాజ్ కాలేజ్ హాల్ నెంబర్ 1,2,3,4
- నిజాం కాలేజీ మల్టీ ఫర్పస్ బ్లాక్ హాల్ నెంబర్ 1,2,3,4
- ప్రొఫెసర్ జి. రాం రెడ్డి హాల్ నంబర్ 1, 3
- ప్రొఫెసర్ జి. రాంరెడ్డి సెంట్రల్ హాల్ నెంబర్ 2, 4
- ఆర్.బి. వెంకటరామ్ రెడ్డి ఉమెన్స్ కాలేజీ హాల్ నెంబర్ 1,2,3,4
- సరోజీ నాయుడు వనిత విద్యాలయం హాల్ 1,2,3,4
- ఎస్‌విఐటి హాల్ 1,2,3,4
- ప్రోగ్రెస్ హై స్కూల్ హాల్ 1,2,3,4
- వాసవి కాలేజ్ 3, 4,1,2
- ఉమెన్స్ కాలేజీ 1,2,3,4.

# బిజెపిని ఓడిద్దాం

(మొదటి పేజీ తరువాయి)



ఉద్భవించిందని అన్నారు. ఈ శక్తి దేశంలో ప్రజస్వామ్యాన్ని గెలిపిస్తుందని అన్నారు. నిరంకుశ పాలనకు తెరపడుందని అన్నారు.
కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ బిజెపి దేశాన్ని నాశనం చేసే విషమని వ్యాఖ్యానించారు. దేశంలో ప్రజాస్వామ్యం నేడు ప్రమాదంలో పడిందని అన్నారు. అందరం కలసికట్టుగా బిజెపిని ఓడించాలని కోరారు. 'ప్రజస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి జరిగే పోరులో అందరం ఒకటిగా నిలవాలి' అన్నారు. ఎన్నికల గోదాను ఆయన క్రికెట్ మైదానంతో పోలుస్తూ, 'పిచ్‌పై గుంతలు తవ్వి.. మ్యాచ్ ఆడదామని ప్రతిపక్షాలను బిజెపి పిలుస్తోంది' అన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాహుల్ గాంధీ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడుతున్నారంటూ ప్రధాని నరేంద్ర మోడీపై విమర్శలు గుప్పించారు. ముగ్గురు నలుగురు కోటీశ్వరులతో కలిసి ఎన్నికల్లో అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. బిజెపి మరోసారి కేంద్రంలో అధికారంలోకి వస్తే, రాజ్యాంగాన్ని మార్చేస్తుందని, ప్రజల హక్కులను హరించేవేస్తుందని హెచ్చరించారు. 'లోక్‌సభ ఎన్నికల్లో కనీసం 400 సీట్లు సంపాదిస్తామని బిజెపి అంటున్నది. కానీ, ఇవిఎంలు లేకుండా, మ్యాచ్ ఫిక్సింగ్ చేయకుండా, ప్రతిపక్ష నాయకులపై ఒత్తిళ్లు పెట్టకుండా, మీడియాను గుప్పిట్లో ఉంచుకోకుండా కనీసం 180 సీట్లు కూడా సంపాదించే అవకాశం ఆ పార్టీకి లేదు' అని వ్యాఖ్యానించారు. అతిపెద్ద ప్రతిపక్ష పార్టీగా ఉన్న కాంగ్రెస్ ఖాతాలను నిలిపివేశారని రాహుల్ గుర్తుచేశారు. 'ఇద్దరు ముఖ్యమంత్రులు అరెస్టయ్యారు. ఇవేం ఎన్నికలు' అని నిలదీశారు.

### దర్యాప్తు సంస్థల దుర్వినియోగం..

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇసి), సిబిఐ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను మోడీ ప్రభుత్వం దుర్వినియోగం చేస్తున్నదని సమాజ్‌వాది పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ ధ్వజమెత్తారు. 400 సీట్లను దక్కించుకోవడానికి బిజెపి అన్ని రకాలుగా అక్రమాలకు పాల్పడుతున్నదని ఆరోపించారు. ఇడి, సిబిఐని ఏ విధంగా ప్రతిపక్ష పార్టీల నాయకులపైకి ఉసిగొల్పుతున్నదో యావత్ దేశం చూస్తునే ఉందని అన్నారు. 'లోక్‌సభ ఎన్నికల్లో మీరు జాగ్రత్తగా వ్యవహరించాలి. మీ ఓటు దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు ఉపయోగపడాలి. లేకపోతే, రాజ్యాంగ స్ఫూర్తి, లౌకికవాదం ధ్వంసమైపోతాయి' అన్నారు.

# ప్రతిపక్ష నేతలు ఒక్కటైన వేళ..

(మొదటి పేజీ తరువాయి)

ఎలక్టోరల్ బాండ్ల ద్వారా వచ్చిన డబ్బును బిజెపి ఉపయోగిస్తున్నదని ర్యాలీలో పాల్గొన్న పలువురు వక్తలు విమర్శించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ఎన్నికల్లో కాకుండా, ప్రజాస్వామ్యంపైన, ప్రతిపక్షాలపైనా యుద్ధం చేస్తున్నదని వ్యాఖ్యానించారు. అరవింద్ కేజ్రీవాల్, హేమంత్ సొరేన్‌తోపాటు మీహార్‌లో దళిత ఎమ్మెల్యే మనోజ్ మంజి, మరో 22 నకిలీ కేసుల్లో ఇరుక్కొని, జైళ్లలో ఉన్నారని గుర్తుచేశారు. దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో చిక్కుకుందని, కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని పేర్కొన్నారు. లౌకిక వాదాన్ని, సమాఖ్య స్ఫూర్తిని, రాజ్యాంగ గౌరవాన్ని, దేశ సార్వభౌమత్వాన్ని, ప్రజాస్వామ్య పునాదులను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రంలో బిజెపి మరోసారి అధికారంలోకి వస్తే, మత విద్వేషాలు పెరిగి, దేశం అన్ని విధాలా పతనమవుతుందని హెచ్చరించారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బిజెపిని ఓడించాలని కోరారు.

# పరిరక్షణే కీలకం (మొదటి పేజీ తరువాయి)

బిజెపి కీలక అభ్యర్థులతో పోటీకి దిగడం లేదంటే, ప్రజలకు కాంగ్రెస్ ఎలాంటి సందేశాన్ని ఇస్తున్నదని అనుకోవాలి' అని విజయన్ ప్రశ్నించారు. ప్రతిపక్ష 'ఇండియా' కూటమిలో అతిపెద్ద పార్టీ అయిన కాంగ్రెస్ ఇప్పటి వరకూ లౌకిక, ప్రాంతీయ పార్టీలను ఒకే తాటిపైకి తీసుకురాలేకపోతున్నద ని విజయన్ అన్నారు. ఆ పార్టీ పెద్దన్న పాత్ర పోషించడం ఒక్కోసారి మిగ తా పార్టీలకు అడ్డంకిగా మారుతున్నదని వ్యాఖ్యానించారు. రాబోయే ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు మైనారిటీ ప్రజల్లో ఎల్‌డిఎఫ్ భయాల బీజాలను నా టుతున్నదన్న బిజెపి విమర్శలను విజయన్ తోసిపుచ్చారు. నిజానికి ఆర్ఎస్ఎస్ బిజెపి ఇలాంటి వివక్షకు పాల్పడుతున్నాయని విమర్శించారు. హింస, విద్వేషాలను రెచ్చగొడుతున్నాయంటూ, దేశంలోని పలు వర్గాల్లో సిఎఎ ఆందోళనలను పెంచుతున్నదని చెప్పారు. బిజెపి, కాంగ్రెస్ ప్రచారం హద్దులుదాటి, వ్యక్తిగత విమర్శలు, నిందారోపణలకు దిగుతున్నట్టు విజయన్ ఆరోపించారు. అలాంటి ఆరోపణలను ఓటర్లు పట్టించుకోరని అన్నారు. కేరళపై కేంద్ర ప్రభుత్వం చూపుతున్న వివక్షపై కాంగ్రెస్ నే తృత్వంలోని యునైటెడ్ డెమోక్రాటిక్ ఫ్రంట్ (యుడిఎఫ్) మౌనం వహిస్తున్నదని చెప్పారు. అందుకే, 'నవ కేరళ సదస్సు'ల పేరుతో తమ ప్రభుత్వం ప్రజలను కలిసి, వారికి కేంద్ర వైఖరిని వివరిస్తున్నదని అన్నారు.

# గిరిజనుల ఘర్షణ

(మొదటి పేజీ తరువాయి)



పరస్పరం ఘర్షణకు దిగడం నివారించే యత్నంలో పోలీసుల పైనే దాడి చేశారు. వివరాల్లోకి వెళితే.... ఖమ్మంజిల్లా సత్తుపల్లి మండల పరిధిలోని రుద్రక్షపల్లి గ్రామ పంచాయితీ పరిధిలోని పోడు భూములకు సంబంధించి చంద్రాయపాలెం, బుగ్గపాడు గ్రామాల గిరిజనుల మధ్య చాలా కాలంగా పోడు భూమి వివాదం ఉంది. ఎప్పటి నుంచో ఉన్న పోడు భూమి తమదంటే తమదని ఇరు గ్రామాల గిరిజనులు తరచూ ఘర్షణ పడుతున్నారు. చంద్రాయపాలెం గిరిజనులు శనివారం నాడు సత్తుపల్లి పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన నిర్వహించి తమపై అక్రమంగా అటవీశాఖాధికారులు, పోలీసులు కేసులు పెడుతున్నారని ఆరోపించి నిరసన తెలియజేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం అటవీ శాఖాధికారులు పోడు భూమిని పరిశీలించేందుకు వెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న ఇరు గ్రామాల గిరిజనులు అక్కడకు చేరుకున్నారు. పోడు భూమిని పరిశీలించే నేపథ్యంలో గిరిజనుల మధ్య ఘర్షణ తలెత్తి ఒకరిపై ఒకరు దాడులకు దిగారు. విషయం తెలుసుకున్న సత్తుపల్లి సిఐ కిరణ్ నలుగురు పోలీసులతో కలిసి సంఘటన స్థలంకు చేరుకున్నారు. ఇరు వర్గాల మధ్య ఘర్షణను నివారించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఆకస్మాత్తుగా గిరిజనులు పోలీసులపై దాడికి దిగారు. విచక్షణారహితంగా పిడి గుద్దులు గుద్దడమే కాకుండా కర్రలతో కొట్టారు. సిఐ కిరణ్ తో పాటు పోలీసులకు గాయాలయ్యాయి. అదనపు సిబ్బంది అక్కడకు చేరుకుని పలువురిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులపై దాడికి పాల్పడడం సంచలనం సృష్టించింది. చంద్రాయపాలెం, బుగ్గపాడు గ్రామాలకు చెందిన 30 మంది గిరిజనులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ ఘటన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్వగ్రామానికి సమీపంలో జరగడంతో ఆయన ఈ ఘటనకు సంబంధించి ఆరా తీసినట్లు సమాచారం.

# భగభగలు

(మొదటి పేజీ తరువాయి)

మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో అక్కడక్కడ వడగాలులు వీచే అవకాశం ఉన్నదని చెప్పారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో రాత్రిళ్లు సాధారణం కంటే వేడిగా ఉండే అవకాశం ఉందన్నారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో అక్కడక్కడ వడగాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేశామని చెప్పారు. 14 జిల్లాల్లో ఎండలు 4044 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. 19 జిల్లాల్లో 36 నుంచి 40 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు రికార్డయినట్లు వివరించారు. నల్లగొండ జిల్లా శివన్నగూడెంలో అత్యధికంగా 43.1 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డు అయిందన్నారు. లక్కవరం రోడ్ (సూర్యాపేట)లో 43, భద్రాచలం (కొత్తగూడెం) 43, సుజాత నగర్ (కొత్తగూడెం) 42.9, తడకమల్ల (నల్లగొండ) 42.9, మునగాల (సూర్యాపేట) 42.9, కల్దుర్కి (నిజామాబాద్) 42.8, ఆదిలాబాద్ జిల్లా కేంద్రం 42.8, నేరేడెగొమ్ము 42.8 , తిమ్మాపూర్ (నల్లగొండ) 42.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు చెప్పారు.

# కేంద్ర బిజెపి ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

ప్రమాదం ముంచుకొస్తున్నదని, మతోన్మాద వాతావరణాన్ని సృష్టించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బిజెపిని నిలువరించేందుకు ఆ పార్టీకి రాష్ట్రంలో ఒక్క ఎంపి స్థానం కూడా గెలవకుండా చూడాలని రేవంత్‌రెడ్డిని రాఘవులు కోరారు. దేశ భవిష్యత్తు అంధకారంలోకి పడిపోతుందన్నారు. దేశాన్ని రక్షించుకునేందుకే ప్రతిపక్షాలు ఇండియా కూటమిలో ఉన్నాయన్నారు. ప్రతిపక్షాల ఎన్నికల ప్రచారాన్ని బలహీనపరిచేందుకు బిజెపి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని విమర్శించారు. ప్రతిపక్ష నాయకుల ఫిరాయింపులను ప్రోత్సహించి, వారికి బీజేపీ టికెట్లు ఇస్తున్నదన్నారు. బిజెపికి బలముంటే ఇవన్నీ ఎందుకు చేస్తున్నదని ప్రశ్నించారు. ప్రతిపక్షాలను ప్రలోభాలకు గురిచేసి లొంగదీసుకోవడం లేదంటే, ఇడీ, సిబిఐ,ఐటిని ఉపయోగించి భయభ్రాంతులకు గురిచేస్తోందని, అప్పటికీ వినకుంటే అరెస్టు చేసి జైలులో పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య మాట్లాడుతూ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం అప్రజాస్వామికమన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అనుమతి లేకుండా పోలీసులే ఫోన్ ట్యాపింగ్ చేశారా? , లేక గత ప్రభుత్వమే ట్యాపింగ్ చేయించిందా?అనేది విచారణలో తేలాలనీ, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై కేంద్రం స్పందించడం లేదన్నారు. మేడిగడ్డలో జరిగిన అవినీతి, డిజైన్‌లో లోపాలు, ఎల్అండ్‌టి సంస్థ వైఫల్యమా అనేది విచారణ చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవసరమైతే సిపిఐ, సిపిఐ(ఎం) సంప్రదించుకుంటాయని, తాజా పరిణామాలను చూసి, ఎవరికి మద్దతివ్వాలో తర్వాత తుది నిర్ణయం తీసుకుంటామని వీరయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, టి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# కొత్త విద్యుత్ పాలసీ

(మొదటి పేజీ తరువాయి)

ప్రకారం తెలంగాణకు రావాల్సిన ఎన్‌టిపిసి 4000 మెగావాట్ల విద్యుత్ పదేళ్లు పూర్తయినా అందుబాటులోనికి రాలేదు. దీంతో విద్యుత్తు కొనుగోళ్ల భారం డిస్కంలపై అంతకంతకు పెరిగిపోయిందని విద్యుత్ అధికారులు చెబుతున్నారు. గత ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలకు మించి కేంద్ర ప్రభుత్వంతో ఘర్షణ వాతావరణం అనుసరించిందని, భవిష్యత్తు అవసరాలు, పెరుగుతున్న గృహ విద్యుత్తు డిమాండ్, వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు అవసరాల దృష్ట్యా ఇప్పటికే సాధించుకోవాల్సిన ఈ పవర్ ప్లాంట్ల ఏర్పాటును విస్మరించిందని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. తెలంగాణ ఏర్పడిన కొత్తలోనే పట్టుబడితే అయిదేళ్ల కిందటే ఎన్‌టిపిసి విద్యుత్ అందుబాటులోకి వచ్చేదని, తద్వారా విద్యుత్తు కొనుగోళ్లపై పెడుతున్న ఖర్చుల భారం తగ్గిదని అధికార వర్గాలు చెబుతున్నాయి. గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో ఎన్‌టిపిసి విద్యుత్తు ప్లాంట్ల స్థాపనలో తీవ్ర జాప్యం జరిగిందని, విద్యుత్తు కొనుగోళ్ల భారం, గత ప్రభుత్వం అనుసరించిన విధానాలతో పదేళ్లలో విద్యుత్ సంస్థలు దివాళా తీశాయని విద్యుత్ శాఖ వర్గాలు పేర్కొన్నాయి.

### గణనీయంగా పెరిగిన నిర్మాణ వ్యయం

గత ప్రభుత్వం కొత్త రాష్ట్రంలో తలపెట్టిన యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ఇప్పటికీ పూర్తి కాలేదు. అవినీతి అవకతవకలతో విద్యుత్తు స్థాపన, నిర్మాణ వ్యయం గణనీయంగా పెరిగిందని ప్రస్తుత ప్రభుత్వం చెబుతోంది. ఒక్కో యూనిట్ ఉత్పత్తికి రూ.6 కోట్ల ఖర్చయ్యే పెట్టుబడి అంచనా ఇప్పటికే రూ. 10 కోట్లకు చేరింది. కాలం చెల్లిన సాంకేతికత, పాత యంత్రాల వినియోగం, అడ్డగోలు నిధుల దుర్వినియోగమంతా కలిపితే యాదాద్రి, భద్రాద్రి ప్లాంట్ల నుంచి ఉత్పత్తి చేసే విద్యుత్తు ఖర్చు తడిసి మోపెడవుతుందని పేర్కొంటున్నారు.

### ఎన్‌టిపిసి రెండో దశకు వెనుకడుగు.. ప్రత్యామ్నాయంపై దృష్టి

ఎన్‌టిపిసి రెండో దశ విద్యుత్ ఒప్పందానికి రాష్ట్ర ప్రభుత్వం వెనుకడుగు వేస్తోంది. ఎక్కువ రేటు పెట్టి ఎన్‌టిపిసి విద్యుత్‌ను కొనుగోలు చేస్తే , డిస్కంలు భారీగా నష్టపోతాయని, 25 ఏళ్ల కొనుగోలు ఒప్పందంతో తెలంగాణ రాష్ట్ర ప్రజలపై మోయలేనంత ఆర్థిక భారం పడుతుందని, అందుకే తక్కువ ధరకు రాష్ట్రానికి విద్యుత్‌ను సరఫరా చేసే ప్రత్యామ్నాయాలను చూసుకోవడమే మేలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. 4000 మెగావాట్ల ఎన్‌టిపిసి విద్యుత్ లో ఇప్పటి వరకు 1600 మెగావాట్ల ప్లాంట్ మాత్రమే అందుబాటులోకి వచ్చింది. ఇటీవలే ప్రారంభించిన రెండో దశ 2400 మెగావాట్ల ప్లాంట్ పూర్తయ్యేందుకు మరో అయిదేళ్లు పడుతుంది. ఇందులో 85 శాతం విద్యుత్‌ను రాష్ట్రానికి కేంద్రం ఇవ్వజూపుతోందని విద్యుత్ శాఖ తెలిపింది. ప్రస్తుతం ఒక్కో యూనిట్ కు రూ.5.90 చొప్పున ఎన్‌టిపిసి విద్యుత్ రేటు అమలులో ఉన్నది, కొత్త ప్లాంట్ పూర్తయ్యే సరికి యూనిట్ ధర రూ.8 నుంచి రూ.9 చేరుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో అంతకంటే తక్కువ రేటుకు విద్యుత్ లభ్యమవుతుందని, గడిచిన పదేళ్ల లో అందుబాటులోకి అధునాతన సాంకేతికతతో పాటు పునరుత్పాదక విద్యుత్తు ఉత్పత్తి కారణంగా ఒక్కో యూనిట్ రూ.2 నుంచి రూ.4 లోపు లభ్యమవుతుందని విద్యుత్ శాఖ చెబుతోంది.

### ఉదయం నుంచి సాయంత్రం వరకు సౌర విద్యుత్

అధునాతన పద్ధతులతో పాటు విద్యుత్ చట్టాలకు అనుగుణంగా విద్యుత్ భవిష్యత్తు ప్రణాళికను రూపొందిస్తుంది. వినియోగదారులపై ఎక్కువ భారం లేకుండా,దేశానికే ఆదర్శంగా ఉండేలా 'తెలంగాణ పవర్ పాలసీ' ఉండేలా ముసాయిదా తయారీపై కసరత్తు చేస్తున్నామని విద్యుత్ శాఖ తెలిపింది. ఎక్కువ మొత్తంలో పునరుత్పాదక విద్యుత్తు ఉత్పత్తి, సరఫరాకు ముందుకు వచ్చే ప్రైవేటు కంపెనీలను ఆహ్వానించి, ఆ కంపెనీలతో ఒప్పందాలు చేసుకోవాలని భావిస్తోంది. పునరుత్పాదక విద్యుత్తు ఉత్పత్తితో బహుళ ప్రయోజనాలున్నాయి. రెండేళ్లలో ఈ ప్లాంట్లు అందుబాటులోకి వస్తాయి. సౌర విద్యుత్తును పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని ప్రభుత్వం లక్ష్యంగా ఎంచుకుంది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రాష్ట్రంలోని విద్యుత్తు అవసరాలన్నీ సౌర విద్యుత్తు ద్వారానే అందుకోవాలని, దీంతో మిగతా మార్గాల ద్వారా వచ్చే ఖరీదైన విద్యుత్తు అవసరం తగ్గుతుందని భావిస్తోంది.

### స్వయం సహాయక సంఘాలకు సోలార్ ప్లాంట్లు

రాష్ట్రంలోని అన్ని 33/11 కేవీ సబ్ స్టేషన్ల పరిధిలో సోలార్ ప్లాంట్లను నెలకొల్పేందుకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తోంది. అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాల్లో మహిళా స్వయం సహాయక సంఘాల అధ్వర్యంలో సోలార్ ప్లాంట్లను నెలకొల్పాలని చూస్తోంది. సోలార్ ప్లాంట్లకు ముందుకు వచ్చే అన్ని ప్రైవేటు కంపెనీలను, వ్యక్తులను భాగస్వాములను చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది.ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలు, యూనివర్సిటీలు, హాస్టళ్లు, ప్రభుత్వ ఆఫీసు భవనాలపైనా సోలార్ యూనిట్లు నెలకొల్పే సాధ్యాసాధ్యాలను కూడా ప్రభుత్వం పరిశీలిస్తోంది.

### 6732 మెగావాట్ల విద్యుత్ ఉత్పతి

రాష్ట్రంలో ఉన్న మేజర్, మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టుల ద్వారా పంప్డ్ స్టోరేజీ విద్యుత్తును ఉత్పత్తి చేసే అవకాశాలను ప్రభుత్వం అధ్యయనం చేస్తోంది. ఇప్పటికే ఉన్న రిజర్వాయర్లతో పాటు నిర్మాణంలో ఉన్న వాటి పరిధిలో 6732 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తికి అవకాశాలున్నాయని విద్యుత్తు సంస్థలు గతంలోనే అంచనా వేశాయి.
తక్కువ ధరతో పాటు లాభసాటి వ్యాపార మార్గాల్లో విద్యుత్తు ఉత్పత్తికి ఉన్న అవకాశాలను కొత్త పాలసీ ప్రాధాన్యతనిస్తోంది. హిమాచల్ ప్రదేశ్‌లో జల విద్యుత్తు ఉత్పత్తికి అపారమైన అవకాశాలున్నాయి. ప్రభుత్వమే పెట్టుబడులు పెట్టి అక్కడ భారీ హైడ్రో ఎలక్ట్రిక్ ప్లాం ట్ ఏర్పాటు చేసే ఆలోచనలు కూడా ఉన్నాయి. ఇటీవలే ముఖ్యమంత్రి రేవం త్ రెడ్డి ఢిల్లీలో హిమాచల్ ప్రదేశ్ సిఎం సుఖ్వీందర్ సింగ్ తో అందుకు సం బంధించిన సంప్రందింపులు జరిపినట్లు తెలిసింది.

# బిఆర్ఎస్ పాపాన్ని కాంగ్రెస్ ప్రభుత్వంపై రుద్దాలనుకోవడం నీచం

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** గత బిఆర్ఎస్ పాపాన్ని వంద రోజుల కాంగ్రెస్ ప్రభుత్వంపైన రుద్దాలనుకోవడం నీచమైన బుద్ధి అని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మండిపడ్డారు. గత తొమ్మిది సంవత్సరాల బిఆర్ఎస్ పరిపాలనలో ఏనాడైన ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన, ఏ ఒక్క రైతునైనా ఆదుకున్నారా అని కెసిఆర్‌ను ప్రశ్నించారు. ఈ మేరకు మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అప్పటికే నాగార్జునసాగర్‌లో నీళ్లు లేకపోవడంతో మొదటి పంటకే నీళ్ళివనీ గత బిఆర్ఎస్ ప్రభుత్వం, రెండో పంటకు నీళ్ళివ్వాలని హేతుబద్ధత లేని డిమాండ్‌లు చేయడం 'మీ' (కెసిఆర్) దుర్భుద్ధికి తార్కారం కాదా?అని నిలదీశారు. రైతులను అధోగతి పాలు చేసి, ఇప్పుడు ఏ మొహం పెట్టుకొని రైతుల పరామర్శకు వెళ్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రకృతి వైపరిత్యాలను, వర్షాభావ పరిస్థితులను కూడా ప్రభుత్వ వైఫల్యంగా చూపేందుకు ప్రయత్నించడం నీచమైన ప్రవృత్తి అని అన్నారు. కేవలం ఒక రైతుబంధు పేరుతో విత్తన సబ్సిడీ, ఇన్ పుట్ సబ్సిడీ, యాంత్రికరణ పథకం, డ్రిప్ స్ప్రింకర్ల మీద సబ్సిడీ పథకాలను ఎత్తివేసి, చిన్న, సన్నకారు రైతులకు కోలుకోనీయలేని దెబ్బతీయలేదా అని అన్నారు. గోదావరి వరదల కారణంగా సర్వస్వం కోల్పోయిన రైతులకు రూ.1000 కోట్లు ఇస్తామని చెప్పి 1000 పైసలైన ఇచ్చారా అని అన్నారు. ఏప్రిల్ మాసంలో కురిసిన వడగళ్ళ వానలకు నష్టపోయిన రైతుల కోసం రూ. 304 కోట్ల నిధుల నిమిత్తం జీవో నెం. 24ను జారీచేసి డబ్బులను విడుదల చేశారా అని ప్రశ్నించారు. మే మాసంలో జరిగిన పంట నష్టాన్ని కనీసం సర్వే చేయించలేదన్నారు. మేడిగడ్డ బ్యారేజీ వైఫల్యానికి కారణం ఎవరని ప్రశ్నించారు. బిఆర్ఎస్ ప్రవేశపెట్టిన ప్రతి పథకంలోనూ గోల్ మాల్ చేశారని, ధాన్యం కొనుగోలు,ధరణి,విద్యుచ్ఛక్తి కొనుగోలు, గొర్రెల పథకం, చేప పిల్లల పంపిణీ, దళితబంధు,చివరకు సిఎంఆర్ఎఫ్ పథకంలో కూడా గోల్ మాల్ చేశారని దుయ్యబట్టారు. చివరకు నికృష్టమైన ఫోన్ ట్యాపింగ్ కు కూడా బరితెగించారని, కుటుంబసభ్యులు కూడా స్వేచ్ఛగా మాట్లాడుకునే అవకాశం లేకుండా చేశారని విమర్శించారు. వర్షాభావ పరిస్థితులను కూడా రాజకీయం చేయాలనుకొనే హేయమైన పనులకు పాల్పడుతూ వ్యక్తిత్వాన్ని హననం చేసుకునే పరిస్థితులు తెచ్చుకుంటున్నారన్నారు. తెలంగాణ ప్రజలలో అంతో ఇంతో మిగిలిన వ్యక్తిత్వాన్ని చంపుకోవద్దని కెసిఆర్‌కు తుమ్మల హితవు పలికారు.

# పదేళ్ల తర్వాత కెసిఆర్‌కు ప్రజలు గుర్తుకు వచ్చారా? : అద్దంకి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అధికారం కోల్పోయిన మూడు నెలలకే రాజకీయంగా పతణమైన తర్వాత కెసిఆర్ జనంలోకి రావాలనుకోవడం విచిత్రంగా ఉందని టిపిసిసి ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ అన్నారు. గాంధీ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ విపక్షంలోకి వచ్చిన తర్వాత కెసిఆర్‌కి పొలంబాట పట్టాలని అర్థమైందన్నారు. పదేళ్ల తర్వాత కెసిఆర్‌కు ప్రజలు గుర్తుకు వచ్చారని ఎద్దేవా చేశారు. జనం బాట మరిచిన కెసిఆర్‌కు ప్రజల అజెండా ఏంటో తెలియడంలేదన్నారు. అధికారంలో ఉన్నప్పుడు రైతులు ఇబ్బందులు పడిన సమయంలో పట్టించుకొని కెసిఆర్, ఒడిపోగానే పర్యటనలు చేస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీకి రాని కెసిఆర్ వచ్చే ఎన్నికల్లో నష్టపోతామనే ఉద్దేశంతోనే రాజకీయ లబ్ది కోసం పొలం బాట పట్టారన్నారు. నాడు పండిన పంటలు కొనకపోతే రోడ్ల మీద మొలకెత్తిన సందర్భాలున్నాయని తెలిపారు. ఇప్పుడు రైతుల కోసం మొసలి కన్నీరు కారుస్తున్నాడని దుయ్యబట్టారు. కెసిఆర్‌ను నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. ఇప్పటికైనా బాధ్యతాయుతమైన ప్రతిపక్ష నేతగా కెసిఆర్ నడుచుకుంటే బాగుంటుందని అద్దంకి దయాకర్ హితవు పలికారు. కెసిఆర్ సర్కార్ కట్టిన ప్రాజెక్టుల డొల్ల తనమే ఇప్పుడు రైతుల గోసకు కారణమైందని మండిపడ్డారు. ఫ్రీ కరెంట్ అంటూ కరెంట్‌ను అమ్ముకొని రైతులను కెసిఆర్ మోసం చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి 20 ఏళ్లకు ఒకసారి దక్షిణ భారతదేశంలో నీటి ఎద్దటి పరిస్థితులు వస్తున్నాయని, కర్ణాటకలో కన్నీళ్లు మింగే పరిస్థితి ఉందన్నారు. తెలంగాణలో అలాంటి పరిస్థితి రాలేదన్నారు. ఇవేమీ తెలియనట్లు బిఆర్ఎస్ గగ్గోలు పెడుతుందని విమర్శించారు. తెలంగాణ అస్తిత్వాన్ని వదిలేసి, బిఆర్ఎస్‌ను ఏర్పాటు చేసిన కెసిఆర్ ను అప్పుడే ప్రజలు మరిచిపోయారన్నారు. కెసిఆర్ మొసలి కన్నీళ్లు పెట్టినా ఎవ్వరు పట్టించుకోరన్నారు. రైతులను, ప్రజలను ఆదుకునే బాధ్యతను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుందని దయాకర్ అన్నారు.

# ఉపాధ్యాయ, విద్యారంగం కోసం ఎస్‌టియు రాజీలేని పోరాటాలు

**ఎస్‌టియు పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎంఎల్‌సి కత్తి నర్సింహారెడ్డి**




**ప్రజాపక్షం/హైదరాబాద్:** మెరుగైన పిఆర్‌సి, రీగ్రూప్‌డు స్కేళ్లు, పెన్షన్, గ్రాట్యూటీ, నోషనల్ ఇంక్రిమెంట్లు ఇలా రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్‌టియు) అనేక విజయాలను సాధించిందని ఎస్‌టియు పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎంఎల్‌సి కత్తి నర్సింహారెడ్డి అన్నారు. గడిచిన 77 ఏళ్లుగా గుర్తింపు పొంది, ఉపాధ్యాయ ఉద్యమ ప్రస్థానంలో సేవలందించిన ఏకైక సంఘం ఎస్‌టియు అని అన్నారు. హైదరాబాద్,కాచిగూడలోని ఎస్‌టియు భవన్‌లో రాష్ట్రోపాధ్యాయ సంఘం తెలంగాణ రాష్ట్రం (ఎస్‌టియుటిఎస్) రాష్ట్ర అధ్యక్షుడు ఎం.పర్వత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర స్థాయి కార్యకర్తల ఒక రోజు శిక్షణ శిబిరం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి కత్తి నర్సింహారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగిస్తూ 1958 మొదటి పే రివిజన్ నుండి ఉపాధ్యాయ, విద్యారంగం కోసం ఎస్‌టియు రాజీలేని పోరాటం చేసిందని గుర్తు చేశారు. సంఘాలు, ఉద్యమాలు వాటిఅవశ్యకత అంశాన్ని ఆయన వివరించారు. ఎస్‌టియు పూర్వ రాష్ట్ర బాధ్యులు సి.రమేష్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు అవంచ సుధాకర్, పూర్వ రాష్ట్ర బాధ్యులు పున్న గణేష్ సిసిఎ రూల్స్, ఫండమెంటల్ రూల్స్, లీవ్ రూల్స్, రివైజ్డ్ పెన్షన్ రూల్స్, తదితర అంశాలపై సుదీర్ఘంగా వివరించారు. అనంతరం ఎస్‌టియు టిఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.పర్వత రెడ్డి, జి.సదానందంగౌడ్ మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఉద్యమాలే ఏకైక మార్గమన్నారు.బదిలీ చేసి, రిలీవ్ కాని ఉపాధ్యాయులను విద్యా సంవత్సరం చివరి రోజున విడుదలకు ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. పదోన్నతులు, టెట్ ఉత్తీర్ణతపై సందేహాలను నివృత్తి చేయాలని, బదిలీలు, పదోన్నత్తులకు సంబంధించి అవాంతరాలను తొలగించాలని , పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. మెరుగైన పిఆర్‌సి మంజూరు చేయాలన్నారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే లోపు విద్యావాలంటీర్లు ,సర్వీస్ పర్సన్‌లను నియమించాలని , పుస్తకాలను యూనిఫామ్ విధిగా విద్యార్థులకు అందేలా చూడాలని వారు సూచించారు. ఈ శిక్షణ శిబిరంలో అన్ని జిల్లాల నుండి సుమారు రెండు వందల మంది కార్యకర్తలు, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ఆట సదయ్య, రాష్ట్ర బాధ్యులు కృష్ణారెడ్డి, గజేందర్ , శ్రీధర్‌బాబు చౌహాన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు హాజరయ్యారు.

# చిన్న మొత్తాల పొదుపు పథకాల వడ్డీల తీరుతెన్నులు..



**న్యూఢిల్లీ:** కొత్త ఆర్థిక సంవత్సరం (2024–25) సోమవారం నుంచి ప్రారంభం కానుండగా, వివిధ రకాల చిన్న మొత్తాల పొదుపు పథకాల వడ్డీల్లో కొన్ని మార్పులు చోటు చేసుకున్నాయి. సురక్షితమైన, క్రమబద్ధమైన ఆదాయం ఇచ్చే పెట్టుబడి సాధనాల్లో చిన్న మొత్తాల పొదుపు పథకాలు ముఖ్యమైనవి. వీటి వడ్డీ రేట్లు ఈ ఏప్రిల్ 1 నుంచి ఎలా ఉండబోతున్నాయనేది సహజంగానే ఆసక్తి రేపే విషయం. 2024 ఆర్థిక సంవత్సరంలో నిఫ్టీ 50లో పెట్టుబడి పెట్టిన మదుపరులకు 30 శాతం వరకు అధిక రాబడులు వచ్చాయి. అయినప్పటికీ, భారత్‌లో రిస్క్ ఎక్కువ ఉన్న పెట్టుబడుల్లో ఇన్వెస్ట్ చేయడానికి అత్యధికులు ఇష్టపడరు. సురక్షితమైన, క్రమబద్ధమైన ఆదాయం ఇచ్చే పెట్టుబడి సాధనాలకే మొగ్గు చూపుతారు. మరోవైపు, కొందరు తమ పోర్ట్ ఫోలియోను డైవర్సిఫై చేస్తారు. తమ పెట్టుబడులను రిస్క్ ఉన్న, రిస్క్ లేని ఇన్వెస్ట్ మెంట్స్ గా బాలెన్స్ చేస్తారు. కాగా, ఏప్రిల్ 1 నుంచి నుంచి ప్రారంభమయ్యే జూన్ త్రైమాసికానికి (ఏప్రిల్‌జూన్) చిన్న పొదుపు పథకాలపై వడ్డీ రేట్లు యథాతథంగా ఉండనున్నాయి. ఈ విషయాన్ని 2024 మార్చి 8న ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. అయితే, ఇటీవల రెండు చిన్న పొదుపు పథకాల వడ్డీ రేట్లు ఈ ఏడాది జనవరి 1 నుంచి పెరిగాయి. సీనియర్ సిటిజన్ సేవింగ్స్‌కు, సుకన్య సమృద్ధి యోజన ఖాతాలకు అత్యధిక వడ్డీ రేటు లభిస్తోంది. అంటే ఈ రెండు పథకాలకు 8.2 శాతం వార్షిక వడ్డీ రేటు లభిస్తోంది. నేషనల్ సేవింగ్స్ సర్టిఫికేట్‌కు 7.7 శాతం, కిసాన్ వికాస్ పత్ర (కెవిపి)కు 7.5 శాతం వడ్డీ వస్తుంది. అదనంగా, కాంపౌండింగ్ రేటు కూడా పరిగణించవలసిన ముఖ్యమైన అంశం. కాంపౌండింగ్ ఎంత ఎక్కువగా ఉంటే అంత ఎక్కువ రాబడి వస్తుంది. ఇక, బ్యాంక్ ఖాతాను పోలివుండే పోస్టాఫీస్ సేవింగ్స్ అకౌంట్‌ను కనీస మొత్తంగా రూ.500 చెల్లించడం ద్వారా ఓపెన్ చేయవచ్చు. ఈ ఖాతాలో డిపాజిట్లకు గరిష్ట పరిమితి లేదు. ఈ అకౌంట్ నుంచి విత్ డ్రా చేయగల కనీస మొత్తం రూ. 50. కానీ, దీనిపై 4 శాతం మాత్రమే వార్షిక వడ్డీ లభిస్తుంది. నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్‌ను పెట్టుబడిదారులు కనీసం రూ .1,000 పెట్టుబడి పెట్టడం ద్వారా తీసుకోవచ్చు. ఇందులో కూడా డిపాజిట్లకు గరిష్ట పరిమితి లేదు. ఈ పథకం ద్వారా వార్షికంగా 7.7 శాతం వడ్డీ రేటు లభిస్తుంది. దీనిని అసలు మొత్తంతో వార్షికంగా కలిపినప్పటికీ మెచ్యూరిటీ సమయంలో మాత్రమే చెల్లిస్తారు. డిపాజిటర్లు పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పిపిఎఫ్)లో ఒక ఆర్థిక సంవత్సరంలో కనీసం రూ.500, గరిష్ఠంగా రూ.1.5 లక్షలు ఇన్వెస్ట్ చేయవచ్చు. వార్షిక వడ్డీ రేటు 7.1 శాతంగా ఉంది. కిసాన్ వికాస్ పత్ర పెట్టుబడిదారులు కనీసం రూ .1,000 నుంచి పెట్టుబడి పెట్టవచ్చు. గరిష్ట పరిమితి లేదు. వార్షికంగా 7.5 శాతం వడ్డీ లభిస్తుంది. సుకన్య సమృద్ధి యోజన కింద ఒక ఆర్థిక సంవత్సరంలో కనీసం రూ.250, గరిష్ఠంగా రూ.1.50 లక్షలు ఇన్వెస్ట్ చేయవచ్చు. జనవరి 1, 2024 నుంచి వడ్డీ రేటు 8.2 శాతంగా ఉంది.

# ఆదాయపన్ను కొత్త నియమాలు




**న్యూఢిల్లీ:** కొత్త ఆర్థిక సంవత్సరంలో కొత్త పన్ను నిబంధనలు అమలు కానున్నాయి. ముఖ్యంగా కొత్త పన్ను విధానంతో, పన్ను శ్లాబ్లు, రాయితీలు, తగ్గింపులు మారుతాయి. కొత్త పన్ను విధానం 2024–25 ఆర్థిక సంవత్సరం ప్రారంభమయ్యే ఏప్రిల్ ఒటి నుంచి డిఫాల్ట్‌గా అమలవుతుంది. ఇన్‌కమ్ టాక్స్ రిటర్న్స్ (ఐటిఆర్) ఫైలింగ్ను సరళీకృతం చేయడం, పన్నులు సరిగ్గా చెల్లించేలా ప్రజలను ప్రోత్సహించడం దీని ప్రధాన లక్ష్యం. కొత్త పన్ను విధానం వల్ల ప్రయోజనం లేదని ఎవరైనా అనుకుంటే, వారు పాత పన్ను విధానాన్ని అనుసరించవచ్చు. 2023 ఏప్రిల్ ఒకటి నుండి, ప్రాథమిక పన్ను మినహాయింపు పరిమితి రూ. 2.5 లక్షల నుండి రూ. 3 లక్షలకు పెంచారు. అయితే, ఆదాయపు పన్ను చట్టం1961లోని సెక్షన్ 87ఎ ప్రకారం, ఈ పన్ను మినహాయింపు పరిమితిని 5 లక్షల నుంచి 7లక్షలకు పెంచారు. కాబట్టి ఏప్రిల్ 1 నుండి, 7 లక్షల రూపాయల కంటే తక్కువ ఆదాయం ఉన్న వారందరికీ పూర్తి పన్ను రాయితీ లభిస్తుంది. అంటే వారు ప్రభుత్వానికి ఎలాంటి ఆదాయపు పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు.

**కొత్త పన్ను స్లాబ్‌ల వివరాలు..**

- ☞ రూ.3 లక్షలలోపు ఆదాయం ఉన్న వారు పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు.
- ☞ రూ.3లక్షల నుంచి రూ.6 లక్షల మధ్య ఆదాయం ఉన్న వారిపై 5 శాతం పన్ను ఉంటుంది.
- ☞ రూ. 6 లక్షల నుంచి రూ. 9 లక్షల మధ్య ఆదాయం ఉన్నవారిపై 10 శాతం పన్ను విధిస్తారు.
- ☞ రూ.9లక్షల నుంచి రూ.12 లక్షల ఆదాయం ఉన్నవారిపై 15 శాతం పన్ను ఉంటుంది.
- ☞ రూ. 12 లక్షల నుంచి రూ. 15 లక్షల మధ్య ఆదాయం ఉన్నవారు 20 శాతం పన్ను చెల్లించాలి.
- ☞ రూ. 15 లక్షల కంటే ఎక్కువ ఆదాయం ఉన్నవారిపై 30 శాతం పన్ను విధిస్తారు.

పాత పన్ను విధానంలో రూ.50,000 స్టాండర్డ్ డిడక్షన్ ఉండేది. దీనిని కొత్త పన్ను విధానంలోనూ చేర్చారు. కాబట్టి ఈ ప్రాథమిక మినహాయింపు ఏప్రిల్ 1, 2024 నుండి కొత్త పన్ను విధానంలో చేరుతుంది. ఇది పన్ను చెల్లింపుదారులకు మరింత ప్రయోజనం చేకూరుస్తుంది.

**తగ్గిన సర్చార్జి:** రూ. 5 కోట్ల కంటే ఎక్కువ ఆదాయం ఉన్న వారిపై ఇప్పటి వరకు 37 శాతం సర్చార్జి ఉంది. అయితే, ఫిబ్రవరిలో సమర్పించిన మధ్యంతర బడ్జెట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ సర్చార్జిని 25 శాతానికి తగ్గించారు. ఇది కూడా ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానుంది. ఇలావుంటే, 2023, ఏప్రిల్ 1న లేదా ఆ తర్వాత జారీ అయిన జీవిత బీమా పాలసీలకు సంబంధించి, ప్రీమియం మొత్తం రూ.5 లక్షలు దాటితే, పన్ను విధిస్తారు. ప్రభుత్వేతర ఉద్యోగులకు లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ పన్ను మినహాయింపు పరిమితి 2022 నుండి రూ.3 లక్షలుగా ఉంటుంది. ఉంది ఏప్రిల్ 1 నుంచి రూ.25 లక్షలకు పెంచనున్నారు. ఇది ప్రైవేట్ రంగ ఉద్యోగులకు ఎంతో మేలు చేస్తుంది.

# యుఎస్ వీసా ఫీజులు నేటి నుంచి అధికం




**న్యూఢిల్లీ:** యుఎస్ వీసా ఫీజులు ఏప్రిల్ 1, సోమవారం నుంచి పెరగున్నాయి. అంటే, ఇకపై అమెరికా వెళ్లే ఆలోచనలో ఉన్నవారు వీసా దరఖాస్తు ఫీజుల కోసం ఎక్కువ మొత్తం చెల్లించాల్సి ఉంటుంది. 2016 తర్వాత హెచ్1బి, ఎల్1, ఇబి5 వీసా కేటగిరీల్లో వీసా ఫీజును పెంచడం ఇదే తొలిసారి. వీసా సేవల్లో సమూల మార్పులు, ఇమ్మిగ్రేషన్ విధానాలు సహజంగానే అంతర్జాతీయ సంబంధాలపై ప్రభావం చూపుతాయి. అమెరికా అధ్యక్ష ఎన్నికలకు ముందు ఈ మార్పులు కీలకం కానున్నాయి. హెచ్1బి, ఎల్1, ఇబి 5 వీసాల ద్వారా అమెరికాకు వెళ్లేందుకు భారతీయులు ఎక్కువగా మక్కువ చూపుతారు. మారిన ఫీజులను అనుసరించి, హెచ్1 బి వీసా దరఖాస్తు (ఫారం ఐ 129) ఫీజును 460 డాలర్ల (రూ.38,000కు పైగా) నుంచి 780 డాలర్లకు (రూ. 64,000కు పైగా) పెంచారు. వచ్చే ఏడాది నుంచి హెచ్1బి రిజిస్ట్రేషన్ కూడా 10 డాలర్లు (రూ.829) నుంచి 215 డాలర్లకు (రూ.17,000కు పైగా) పెరగనుంది. హెచ్ 1బి అనేది నాన్‌ఇమ్మిగ్రెంట్ వీసా. ఇది సైద్ధాంతిక లేదా సాంకేతిక నైపుణ్యం అవసరమయ్యే ప్రత్యేక వృత్తులలో విదేశీ కార్మికులను నియమించడానికి యుఎస్ కంపెనీలను అనుమతిస్తుంది. టెక్నాలజీ కంపెనీలు భారత్, చైనా వంటి దేశాల నుంచి ఏటా పదుల సంఖ్యలో ఈ వీసాతో ఉద్యోగులను నియమించుకుంటాయి. కాగా, ఎల్ 1 వీసా ఫీజును 460 డాలర్ల (రూ. 38,000కు పైగా) నుంచి 1,385 డాలర్లకు (రూ.1,10,000 కంటే ఎక్కువ) పెంచారు. ఎల్ 1 వీసా కూడా నాన్ ఇమ్మిగ్రెంట్ వీసా కేటగిరీలోకి వస్తుంది. బహుళజాతి కంపెనీలు తమ విదేశీ కార్యాలయాల నుంచి కొంత మంది ఉద్యోగులను తాత్కాలికంగా అమెరికాలో పనిచేయడానికి బదిలీ చేయడానికి ఇది వీలు కల్పిస్తుంది. ఇన్వెస్టర్స్ వీసాగా పిలిచే ఇబి 5 వీసా దరఖాస్తు ఫీజును 3,675 డాలర్ల (రూ. 3,00,000 కు పైగా) నుంచి 11,160 డాలర్లకు (రూ. 9,00,000కు పైగా) పెంచారు. అమెరికా ప్రభుత్వం ఈ ఇబి5 ప్రోగ్రామ్‌ను 1990లో ప్రారంభించింది. విదేశాల్లోని సంపన్నులైన పారిశ్రామికవేత్తలు అమెరికాలో కనీసం 5లక్షల డాలర్లతో ఏదైనా వ్యాపారం ప్రారంభిస్తే, వారికి, వారి కుటుంబ సభ్యులకు ఈ వీసా ఇస్తారు. ఆ వ్యాపారం ద్వారా అమెరికాలో కనీసం 10 మంది అమెరికన్లకు ఉపాధి కల్పించాల్సి ఉంటుంది. కాగా, పెంచిన ఫీజులు ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమల్లోకి వస్తున్నాయి.

# కెసిఆర్ ప్రెస్‌మీట్‌లో పవర్ కట్...!

**ప్రజాపక్షం/సూర్యాపేటప్రతినిధి :** కాంగ్రెస్ ప్రభుత్వ వచ్చిన తరువాత కరెంట్ కోతలు నిత్యకృత్యంగా మారాయి. రాష్ట్రంలో ఎడాపెడా కరెంట్ కోతలు విధిస్తూనే ఉన్నారు. ఇప్పటికే రాష్ట్ర మంత్రులు, ఎంఎల్‌సిల మీటింగ్‌ల్లో కూడా పవర్ కట్స్ చూస్తూనే ఉన్నాం. తాజాగా సూర్యాపేటలో బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ ప్రెస్‌మీట్‌లోను ఇదే రిపీట్ అయింది. సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో ఆదివారం బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ పర్యటించి రైతుల సమస్యలను తెలుసుకున్నారు. ఎండిపోతున్న పంటలను పరిశీలించారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ప్రెస్‌మీట్‌లో పాల్గొన్నారు. ఇలా కెసిఆర్ ప్రసంగం మొదలయ్యిందో లేదో కరెంట్ పోయింది. ఆ తరువాత కొద్ది సేపటికే కరెంట్ రావడంతో ఇట్ల కరెంట్ పోతా...వస్త ఉంటది అంటూ సైటెర్ వేశారు. కెసిఆర్ అన్నమాట వినగానే మీడియా మిత్రులు, ప్రజాప్రతినిధులతో కూడిన వేదిక నవ్వులతో నిండిపోయింది. కరెంట్ కోతలను ఇప్పుడు మనం ప్రత్యక్షంగా చూస్తున్నామని కెసిఆర్ అన్నారు. ఆ తరువాత తన ప్రసంగాన్ని కొనసాగించాడు.

# బిసిలను మోసం చేస్తున్న రాజకీయ పార్టీలు

జనాభా ప్రతిపాదిక ప్రకారం సీట్లు కేటాయించాలి

లేకుంటే ఎన్నికల్లో బిసిల తడఖా చూపిస్తాం: కృష్ణయ్య



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాజకీయ పార్టీలన్ని బిసిలను మోసం చేస్తున్నాయని రాజ్యసభ సభ్యులు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. హైదరాబాద్ కాచిగూడలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుత లోక్‌సభ ఎన్నికలలో బిజెపి, కాంగ్రెస్, బిఆర్ఎస్‌తో సహా అన్ని రాజకీయ పార్టీలు బిసిలకు జనాభా ప్రతిపాధికన టికెట్లు కేటాయించకుండా అన్యాయం చేశాయని విమర్శించారు. ఏ ఒక్క పార్టీ కూడా బిసిలకు న్యాయం చేయడం లేదన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందని, అంగ బలం, ఆర్థికబలం ఉందని, ఏ బిసి నేతకు టికెట్టు ఇచ్చినా బిసిలు గెలుస్తారన్నారు. అలాగే బిఆర్ఎస్ పార్టీ పదేళ్లుగా అధికారంలో ఉందని, ఏ బిసి నేతకు టికెట్టు ఇచ్చిన గెలుస్తారని అన్నారు. బిసిల పేదరికం, అమాకత్వం అడ్డం పెట్టుకొని, 76 సంవత్సరాలుగా అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య దేశంలో బిసిలకు జనాభా ప్రకారం అధికారంలో, సంపదలో, నిధులలో, విద్య, ఉద్యోగ రంగాల్లో గౌరవప్రదమైన వాటా ఇవ్వాల్సిందే అన్నారు. 30 ఏళ్లుగా బిసిలకు 50 శాతం టికెట్లు ఇవ్వాలని పోరాడుతున్నామని, కానీ రాజకీయ పార్టీలు 20 శాతం కూడా ఇవ్వడం లేదన్నారు. అందుకే పార్లమెంట్‌లో తాము రాజకీయ రిజర్వేషన్‌ల కోసం బిసి బిల్లు ప్రవేశపెట్టాలని పోరాడుతున్నామని తెలిపారు. 30ఏళ్లుగా తాము చేస్తున్న ఉద్యమానికి మద్దతు లభిస్తుందన్నారు. అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ఇస్తున్నాయని, త్వరలోనే పార్లమెంట్‌లో బిసి బిల్లు పెట్టేందుకు రాజకీయ పార్టీలపై ఒత్తిడి తీసుకోస్తామన్నారు. పార్టీలకు అతీతంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఇప్పటికైన ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో రాజకీయ పార్టీలు జనాభా ప్రతిపాదికన బిసిలకు తగిన సీట్లు కేటాయించాలని కృష్ణయ్య డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఎన్నికల్లో బిసిల తడఖా చూపిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు గుజ్జ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ వాదంతో మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్న బిజెపి



బిజెపితో ప్రజాస్వామ్యం మనగడకు ప్రమాదం : ప్రొఫసర్ శంకర్ నారాయణ

త్యాగాల చరిత్ర కలిగినది ఎఐటియుసి సంఘం

ట్రేడ్ యూనియన్ శిక్షణ తరగతులు బోధించిన వివి ఎస్ బోస్

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** జాతీయ వాద ముసుగులో మతోన్మాదాన్ని బిజెపి ప్రభుత్వం రెచ్చగొడుతుందని ప్రొఫసర్ శంకర్ నారాయణ అన్నారు. ఆదివారం భూపాలపల్లి ఏరియాలో మంజూరు నగర్‌లోని ఇల్లందు క్లబ్ హౌస్‌లో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ట్రేడ్ యూనియన్ శిక్షణ తరగతుల కార్యక్రమంలో వారు ముఖ్య అతిథిగా హాజరై కార్మికులకు పాఠాలు బోధించారు. బిజెపి ప్రభుత్వం కేంద్రంలో మరోసారి అధికారంలోకి వస్తే వినాశనం విధ్వంసం ఆర్థిక పరిస్థితి చిన్న భిన్నం అవుతుందని తెలిపారు. మోడీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ఆదాని అంబానీ పెట్టుబడిదారులకు కట్టబెడుతుందని వివరించారు. బిజెపి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్యం మనుగడకు ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. వివిఎస్ బోస్ మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నాలుగు కోడలుగా విభజించి కార్మిక హక్కులను హరించి వేస్తుందని తెలిపారు. అనేక త్యాగాలు చరిత్ర కలిగిన సంఘం అనేక పోరాటాలు నిర్వహించి హక్కులను సాధించిన ఘనత ఎఐటియుసికి ఉందని, ఈ ప్రపంచంలో సూర్య చంద్రుడు ఉన్నంత వరకు కమ్యూనిస్టులు ఎర్రజెండా సంఘాలు కార్మికుల పక్షాన ఎప్పటికీ ఉంటాయని తెలిపారు. ఈ క్లాసుల ద్వారా విన్న విషయాలను కార్మికుల సమస్యల పరిష్కారానికి ఉపయోగపడే విధంగా ఉండాలని ఆకాంక్షించారు. రాబోయే రోజుల్లో ఈ బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మికులంతా సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ శిక్షణ తరగతుల్లో ఎఐటియుసి అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శిలు వాసిరెడ్డి సీతారామయ్య కొరిమి రాజ్ కుమార్, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ మిరియాల రంగయ్య, యూసుఫ్, బ్రాంచ్ కార్యదర్శి మోట పలుకుల రమేష్, మాతంగి రామచందర్, గురుజేపల్లి సుధాకర్ రెడ్డి, జి.శ్రీనివాస్, పాషా, విజేందర్, పోశం, నారాయణ, రామచందర్, పి.శ్రీనివాస్, తిరుపతి, ఎం.శ్రీనివాస్, పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

# కెసిఆర్ మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరు: జి.నిరంజన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కెసిఆర్ తన మీద కమ్ముకుంటున్న దుష్పరిపాలన, అవినీతి కేసుల ప్రభావం నుండి ప్రజల దృష్టి మరల్చడానికే ఆదివారం సూర్యపేట పర్యటనలో రైతులను రెచ్చగొట్టే ప్రయత్నం చేశాడని టిపిసిసి సీనియర్ ఉపాధ్యాక్షుడు జి.నిరంజన్ అన్నారు. గాంధీ భవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పదేళ్ల పాలనలో అంతులేని అక్రమాలకు పాల్పడిన కెసిఆర్ మాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని విమర్శించారు. కెసిఆర్ అవినీతి పరిపాలన చరిత్ర ప్రజల కళ్ల ముందు ఉందన్నారు. అందుకే అసెంబ్లీ ఎన్నికల్లో బుద్ధి చెప్పారన్నారు. కెసిఆర్ ఖజానాను ఖాళీ చేసి వెళ్లినందునే రైతు రుణమాఫీలో జాప్యం జరుగుతోందని ప్రజలు నమ్ముతున్నారని నిరంజన్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలోనే వనరులను సమకూర్చుకుని, తమను ఆదుకుంటుదనే భరోసాతో రైతులు ఉన్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్, తాగునీరు, సాగు నీరు కష్టాలు లేకుండా అన్ని చర్యలు తీసుకుందని చెప్పారు. కెసిఆర్ గోరంతను కొండంతగా చూపే ప్రయత్నం చేస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని నిరంజన్ హెచ్చరించారు.

# ఈతకా... జరభద్రం



● మృత్యుకుహరాలుగా మారుతున్న చెరువులు, వాగులు, కుంటలు ● ఈతకు వెళ్లి ప్రాణాలు కోల్పోతున్న వైనం ● తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉంటే మేలు ● సెలవు రోజుల్లో పిల్లలు జాగ్రత్త

**ప్రజాపక్షం/బూర్గంపాడు :** రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో సంవత్సరాల నుండి ఈతకు వెళ్లి పిల్లలు, యువకులు మృత్యువాత పడిన సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. అనేక సంఘటనల్లో అనేక మంది విద్యార్థులు, యువకులు మృతి చెందిన విషయం విధితమే... ఈ పరిస్థితి ఉమ్మడి జిల్లాలో సైతం ఉంది. ఈత అంటే అందరికి సరదా, వాగులో, చెరువుల్లో నీళ్లను చూస్తే వాటిలో దిగి ఈత కొట్టాలనే కోరిక ఉంటుంది. అది పిల్లలు, పెద్దలైనా... అయితే ఇక్కడ అసలు సమస్య మొదలౌతుంది. సరదాగా ఉంటుందని నీటి లోతు ప్రదేశంలో ఈతకు దిగడంతో ప్రమాదాలు సంభవించి ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితులు చూస్తున్నాం. విద్యార్థులకు పాఠశాల సెలవులు ఇచ్చిన నేపథ్యంలో, యువకులు స్నేహితులతో టూర్‌కు వెళ్ళినప్పుడు చెరువులు, వాగుల్లో స్నానాలు చేయడానికి ఇష్టపడతారు. ఈ సమయంలోనే ప్రమాదాలు పొంచి ఉంటుంది. ఈత రాకుండా జలాశయాల్లో దిగి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. పలువురి ఈత సరదా కుంటుబాల్లో విషాదం నింపకూండ ఉండాలంటే జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం వుంది.

**జలాశయాల వద్ద తీసుకోవలసిన జాగ్రత్తలు**

- ☞ ఈత వస్తేగాని చెరువులు, కుంటలు, బావుల్లోకి దిగకూడదు. లోతు ఎంత ఉంది. ఎక్కడైన గుంతలు ఉన్నయో లేదో తెలుకొని దిగడం మంచిది.
- ☞ నీటిలో సాహసాలు, పోటీలు పెట్టుకోవద్దు, బాగా ఈత వచ్చిన వారితో పోటీ పడవద్దు, ఈత వచ్చిన వారు లోతుకు వెళ్ళారు అని ఈత రాని వారు లోతుకి వెళ్ళితే ప్రమాదమే....
- ☞ గుంపులుగా చెరువుల్లో దూకడం ప్రమాదం, బండలు, బురద ఉంటే దెబ్బలు తాకడంతో పాటు అందులో ఇరుక్కుపోయో ప్రమాదం ఉంది.
- ☞ వాగులో సుడిగుండాలు ఉంటాయి, అటువైపు వెళ్లకపోవడమే మంచిది
- ☞ ఈత వచ్చినా ఎక్కువ సేపు నీటిలో ఉండకూడదు. శ్వాస పీల్చడం కష్టంగా ఉంటే వెంటనే బయటకు రావాలి
- ☞ మునిగే వారిని కాపాడేటప్పుడు వారి జట్టును మాత్రమే పట్టుకొని బయటకు తీసుకురావాలి, అంతేగాని మనల్ని గట్టిగా పట్టే సుకుంటే ఇద్దరు మునిగిపోతారు.
- ☞ తల్లిదండ్రులకు తెలియకుండా పిల్లలు చెరువులకు వెళ్లకుండా చూసుకోవాలి
- ☞ ఈత రాని వారు నీటిలో దిగకుండా ఉంటే మంచిది

**ఆదమరిస్తే అంతే**

గ్రామాల సమీపంలో ఉన్న చెరువులు. ప్రాజెక్టులు, కాలువలు, బావులు, నీటిగుంతలు, ఒర్రెల వద్దకు వెళ్లి విద్యార్థులు, యువకులు ఈత సరదా కోసం వెళ్లి సాహసాలు చేస్తుంటారు. కొంత మంది ఈత రాకపోవడంతో... నీటిలోకి దిగి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. నీటిలో ఆడుకోవడం అంటే అందరూ సరదా పడుతుంటారు. చిన్నారులైతే చెప్పాలిసిన అవసరం లేదు. అయితే లోతు తెలియక నీటిలో మునిగి చాలా మంది మృత్యువాత పడుతుండటం ఆ కుటుంబాల్లో విషాదం నింపుతుంది. పిల్లలు ఒకరిని చూసి మరొకరు నీటిలో దిగుతారు. జలకాలాటలో మునిగి తేలుతూ ఆదమరిస్తే ప్రమాదాలకు గురైకన్నవారికి దుఃఖాన్ని మిగుల్చుతున్నారు. ఈత రాని పిల్లలు, పెద్దలు నీటి వనరుల వైపు వెళ్లకుండా తల్లదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. పెద్దవాళ్లు అయితే ఒకసారి వారి కుటుంబాలను గుర్తు తెచ్చుకోవాలి. పిల్లలను తల్లిదండ్రులు ప్రతి క్షణం కనిపెడుతుండాలి. ఇలా చేయకపోవడంతో ప్రమాదాలు జరిగి ప్రాణానష్టం వాటిల్లే అవకాశం ఉంది.

# సాహితీ విహారి

# గాలిబ్‌ను ఎందుకు చదవాలి?

నిన్నమొన్నటి వాడా గాలిబ్ (మీర్జా అసదుల్లా ఖాన్/ 1797–1869)... ఆయన చరిత్రకు, రచనలకు సుమారు రెండు వందల ఏళ్ల వయసు ఉంది. ఇంకా ఆయననే చదవాలా? ఎందుకు చదవాలి? ఈ ప్రశ్నలకు సమాధానం అనుకున్నంత సులభం కాదు. కానీ, ఒక్క మాటలో చెప్పాలంటే, గాలిబ్‌ను ఒకసారికాదు... పదులు.. వందల సార్లు చదివి తీరాలి. ఎందుకు చదవాలన్న ప్రశ్నకు మాత్రం సుదీర్ఘమైన వివరణ అవసరం. ఎందుకంటే, గాలిబ్ గురించి ఒకటి రెండు మాటల్లోనో, పంక్తుల్లోనే చెప్పడం కష్టం. ఆయన రచనలు సమీక్షించడం, విశ్లేషించడం అసాధ్యం. అయితే, గాలిబ్ రచనలను మెహర్ అఫ్షాన్ ఫారూఖీ కొత్త పుస్తకం 'గాలిబ్: ఫ్లవర్స్ ఇన్ ఎ మిర్రర్' మరోసారి గుర్తుచేసింది. ఆ పుస్తకం విడుదల సందర్భంగా, ఆయన రచనలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఏర్పడింది. ప్రచురణకు నోచుకోని గాలిబ్ రచనలు 'ముస్తారాద్ కలాం'పై ఈ పుస్తకంలో విమర్శనాత్మక వ్యాఖ్యానాలు ఉన్నాయి. ప్రముఖ విద్యావేత్త, అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ వ్యవస్థాపకుడు సర్ సయ్యద్ అహమ్మద్ ఖాన్ సోదరుడు సయ్యద్ మహమ్మద్‌కు అప్పట్లో ఓ లిథోగ్రాఫిక్ ప్రెస్ ఉండేది. 1841లో ఆయన గాలిబ్ కవితలను సేకరించి 'దివాన్'ను ప్రచురించాడు. ఆ సమయానికి గాలిబ్ మద్యపానానికి, జూదానికి అలవాటు పడ్డాడు. ఉర్దూలో రాయడం మానేసి, పూర్తిగా పర్షియన్ భాషకే అంకితమయ్యాడు. కానీ, కవిగా అతను సాహితీ ప్రయాణాన్ని ఎక్కడా ఆపలేదు. ఆయన షాయరీలు, జగల్ల సంకలనం 'దివాన్'లో మొత్తం 1095 పద్యాలు ఉన్నాయి. గాలిబ్ మ్యానుస్క్రిప్ట్‌లో నీలిరంగు లాపిన్, బంగారు అలంకారాలు, చైనా సిరా, అలంకరించి ముస్తాబు చేసిన పలకలు ఇప్పటికీ భద్రంగా ఉన్నాయి. అవి లిథోగ్రాఫిక్ ప్రారంభ దశలోని ప్రింట్ మాదిరి ఉన్నాయి.

గాలిబ్‌కు 19 సంవత్సరాల వయసు ఉన్నప్పుడే అతని మొదటి సంకలనం 1533 పద్యాలతో వెలువడింది. ఆ తర్వాత మరో నాలుగు సంచికలు వెలువడ్డాయి. ప్రతి సంచికలోనూ ఒకదానితో పోలిస్తే మరొకటి ఎక్కువ పద్యాలు ఉండడం గమనార్హం. ఉర్దూలో గాలిబ్ 4,200 కంటే ఎక్కువే కవితలు, పద్యాలు రాశాడు. వాటిలో 2,200 కవితలు మ్యానుస్క్రిప్ట్‌కే పరిమితమయ్యాయి. దురదృష్టవశాత్తు, గాలిబ్ రచనల పూర్తి ఎడిషన్ 'కుల్లియత్' ఆయన జీవించి ఉండగా ముద్రణకు నోచుకోలేదు. 'దివాన్'లోనే అముద్రిత కవితల గురించి గాలిబ్ చేసిన



వ్యాఖ్యలను ఇక్కడ ప్రస్తావించుకోవాలి. 'ఈ దివాన్ వెలుపల చెల్లాచెదురుగా కనిపించే పద్యాలు అసంభవనీయాలు' అంటాడు గాలిబ్. పండితులు కూడా అప్పట్లో తిరస్కరణకు గురైన గాలిబ్ పద్యాలను కష్టతరమైనవిగా పేర్కొంటారు. సంక్లిష్టమైన పర్షియన్ పద నిర్మాణాలకు అర్థాలను తెలుసుకోవడానికి విశేష కృషి అవసరం. మీర్జా అబ్దుల్ ఖాదిర్ బెదిల్ (1644–1720), సాయిబ్ తబ్రీజీ (1592–1676) మాదిరిగానే, గాలిబ్ కవిత్వం కూడా సంక్లిష్టంగానూ, విస్తారమైన అర్థాలతోనూ, దార్శనికతతోనూ నిండివుంటుంది. అసలు గాలిబ్ ఇంతటి సంక్లిష్టతకు ప్రాధాన్యం ఎందుకు ఇచ్చాడు? బహుశా సమకాలీన కవుల నుంచి తనను తాను వేరు చేసుకోవాలనే కోరిక కావచ్చు. 1790 నుండి 1870 మధ్యకాలంలో, ఉర్దూ లో కనీసం ఐదు వందల మంది కవులు పుంఖానుపుంఖంగా రచనలు చేశారు. అటువంటి రద్దీగా ఉండే సాహితీ శకంలో ప్రత్యేక గుర్తింపు పొందాలంటే, అసాధారణ ప్రక్రియ ఏదో ఒకటి చేపట్టక తప్పదని అనుకున్నాడేమో! అందుకే, ఆయన ప్రతి కవితలోనూ విస్తృతమైన అర్థం ఉంటుంది. ఆలోచనలే కాదు... వ్యక్తీకరణ శైలి కూడా భిన్నంగా గోచరిస్తుంది. తన రచనల్లోని ఈ సంక్లిష్టత



గురించి గాలిబ్ స్వయంగా ప్రస్తావించిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఆయన తన మరణానికి నాలుగు సంవత్సరాల ముందు, మౌల్వీ మహమ్మద్ అబ్దుర్ రజాక్ 'షకీర్'తో తరచు ఉత్తరప్రత్యుత్తరాలు జరిపేవాడు. ఒక సందర్భంలో, ఒక పద్యం అర్థం చేసుకోవడానికి చాలా కష్టంగా ఉందని మౌల్వీ చెప్పినప్పుడు, అందుకు తాను ఎంతో సంతోషిస్తున్నానని గాలిబ్ వ్యాఖ్యానించాడు. 'ఈ ఒరవడి నా స్వభావం నుంచి నేను తెచ్చిన కొత్త ఆలోచన. ఈ ప్రత్యేకతను చూసి గర్వపడుతున్నాను' అని పేర్కొన్నాడు.

గాలిబ్ రచనా శైలిపై కొంత అసంతృప్తి వ్యక్తం చేసిన వారు ఉండవచ్చేమోగానీ, అతని ప్రతిభ, దార్శనికత, లోతైన అర్థాలు... భావాల సమ్మిళిత మూర్తిమత్వంపై ఎవరికీ అనుమానాలుగానీ, ఆక్షేపణలుగానీ లేవు. ఉండవు కూడా. అందుకే, మొఘల్ సామ్రాజ్య క్షీణదశ, బ్రిటిష్ రాజ్య ప్రారంభ దశల్లో ప్రపంచ మేటి రచయితల్లో ఒకటిగా గాలిబ్ గుర్తింపు సంపాదించాడు. ఉర్దూ, పర్షియన్ భాషల్లో ఉత్కృత్తమ కవిగా కీర్తిప్రతిష్టలువ గడించాడు. అప్పటి వరకూ అంతగా ప్రాచుర్యానికి నోచుకోని ఉర్దూ సాహిత్యానికి, కవిత్వానికి గాలిబ్ ఓ గుర్తింపును తీసుకొచ్చాడు. ఈ విషయంలో అతని కృషి అపారం. ఉర్దూ, పర్షియన్ రచనా సంప్రదాయాలను మిళితం చేసి, ఒక ప్రత్యేకమైన, అత్యంత ఆధునాతనమైన కవితా శైలిని గాలిబ్ అభివృద్ధి చేశాడు. ఇప్పటికీ అతని రచనలను ఎంతో మంది ఇష్టంగా చదువుతున్నారంటే, వాటి ప్రత్యేకత ఏమిటో సులభంగానే అర్థమవుతుంది. ఉర్దూ కవిత్వంలో గాలిబ్ కొత్త వ్యక్తీకరణ రూపాలు, ఇతివృత్యాలను ప్రవేశపెట్టాడు. తర్వాతి కాలంలో ఎంత మంది ఉర్దూ కవులకు మార్గదర్శకుడయ్యాడు. ఉర్దూను సాహిత్య భాషగా అభివృద్ధి చేయడానికి కూడా గాలిబ్ చేసిన కృషి అనన్యసామాన్యం.

కవితలు, పద్యాలు, లేఖలు, వ్యాసాలు.. ఇలా ఎన్నో రకాలైన సాహితీ ప్రక్రియల్లో ఆరితేరిన గాలిబ్, ఉర్దూను సాహిత్యం, మేధో సంభాషణ భాషగా నిలబెట్టాడు. ఆయన ప్రవేశపెట్టిన పలురకాల రచనా విధానాలు ఇప్పటికీ ఉర్దూ సాహిత్యంలో అంతర్భాగంగా కొనసాగుతున్నాయి. కొంత మంది వ్యక్తులు జీవితం కంటే చాలా ఉన్నతంగా ఆవిష్కృతమవుతారు. వారి పేర్లు, నైపుణ్యాలు ఆయా రంగాల్లో నిర్వచనాలుగా ఉండిపోతాయి. 'సైంటిస్టు' అనగానే అల్బర్ట్ ఐన్‌స్టీన్ పేరు స్ఫురిస్తుంది. కవిత్వం.. నాటకం అనగానే షేక్స్‌పియర్ గుర్తుకొస్తాడు. అదే విధంగా 'షాయరీ' అనగానే మొట్టమొదట గుర్తుకొచ్చే పేరు గాలిబ్. మీర్జా అసదుల్లా ఖాన్ తన రచనలకు గాలిబ్ అనే కలం పేరును ఎన్నుకోవడానికి కారణం ఏమిటో ఇదిమిత్తంగా తెలియకపోయినా, ప్రచారంలో ఉన్న కథనాలను అనుసరించి, చిన్నతనం నుంచే కవిత్వం రాయడం ప్రారంభించిన అతను తొలుత అసద్ పేరును ఉపయోగించాడు. అయితే, యుక్తవయసు వచ్చేసరికి, అదే పేరుతో మరో కవి ఉన్నట్టు తెలియడంతో పేరు మార్చుకోవాలని నిర్ణయించుకున్నాడు. అప్పుడే గాలిబ్ అనే పేరును ఎంచుకున్నాడు. గాలిబ్ అంటే విజేత అని అర్థం. తన కలం పేరుకు తగ్గట్టే ఆయన ఉర్దూ కవితా ప్రపంచంలో విజేతగా నిలిచాడు. ఉమ్రావ్ జాన్‌ను వివాహం చేసుకున్న తర్వాత, ఆమే అతని లోకమైంది. జీవితాంతం ఆమెనే ఆరాధించేవాడని అంటారు. అందుకేనేమో గాలిబ్ షాయరీల్లో అంతటి లాలిత్యం, సౌరభం దాగున్నాయి.

'ఉన్కో దేఖే సే జో ఆజాతీహై మూ పర్ రౌనక్,
వో సమాజ్తే హై కే బీమర్‌కా హాల్ అచ్ఛాహై
దేఖానా ఖిస్మత్ కీ ఆప్ అపనే పే
రష్క్ ఆజాయేహై మై ఉసే దేఖూ.. భలా కబ్ ముఝ్‌సే దేఖా జాయే హై
హోకే ఆషిక్ వో పరిఇషరుఖ్ ఔర్ నాజుక్ బాన్
గయా రంగ ఖిల్తా జాయేహై జిత్నాకి ఉడ్తా జాయే హై' (ఆమెను చూసిన వెంటనే నా ముఖం వెలిగిపోతుంది. ఆమె నా ఆరోగ్యం ఎలా ఉందోనన్న అనుమానంతో చూస్తుంది. మనం మనపైనే అనుమానపడే పరిస్థితి రావడం విచిత్రం. ఇంతటి నాజూకైన అందాన్ని నేను మళ్లీ ఎప్పుడు చూస్తాను) అంటాడు గాలిబ్. ఈ మాటలు ఉమ్రావ్ జాన్‌ను ఉద్దేశించినవేనని చాలా మంది నమ్మకం.

తనకంటూ ఒక ప్రత్యేకతను సంపాదించుకోవడానికి సంక్లిష్టమైన శైలిని ఎంచుకున్న కారణంగా, గాలిబ్ షాయరీలు, గజల్స్‌ను ప్రచురించడానికి అప్పట్లో ఉన్న ప్రధాన ప్రచురణకర్తలంతా నిరాకరించారు. దేవుడి ఉనికిని నమ్మకపోవడం కూడా ప్రచురణకర్తల ఆగ్రహానికి కారణమై ఉండవచ్చు. అయితే, గాలిబ్ దిగులు పడలేదు. కుంగిపోలేదు. తన దారిద్ర్యాన్ని కూడా కవితలో ఇలా చెప్పుకున్నాడు..

మాలూమ్ నా థా ఇత్నా కుచ్ హై ఘర్ మై బెచ్నే కే లియే గాలిబ్
జమీన్ సే లేకర్ జమీర్ తక్, సబ్ బిక్ రహా హై.. (అమ్మడానికి నా వద్ద ఇంత ఉందని తెలియదు గాలిబ్.. భూమి నుంచి మొదలు పెడితే ఆలోచనల వరకూ అన్నీ అమ్ముడు పోతున్నాయి). దటీజ్ గాలిబ్. అతను కేవలం ఒక కవి, రచయిత, వ్యాసకర్త మాత్రమే కాదు.. గొప్ప దార్శనికుడు. భావకుడు. సత్యసంధుడు. అన్నిటినీ మించి మంచి మనిషి. కొత్తకొత్త కవితా రీతులను సృష్టించి, ఉర్దూ సాహిత్యానికి ఒక గుర్తింపును సంపాదించిపెట్టిన గాలిబ్ ప్రజల మనిషి. ప్రతి ఒక్కరి మనిషి. 1869, ఫిబ్రవరి 15న ఢిల్లీలో తుదిశ్వాస విడిచేవరకూ గాలిబ్ తన పంథాలోనే కొనసాగాడు. ఉర్దూ సాహిత్యానికి ప్రాణప్రతిష్ట చేసి, జీవితానికి సార్థకత చేకూర్చుకున్నాడు.

సత్యశ్రీ

### హాస్య చతురుడు..

లోతైన ఆలోచనలకు... అత్యంత సంక్లిష్టమైన శైలికి మారుపేరైన గాలిబ్‌లో గొప్ప హాస్య చతురుడు కూడా దాగుతున్నాడు. మచ్చుకు కొన్ని ఉదాహరణలు... 'కలం' (పెన్ను) అనే పదం ఆడా లేక మగా? ఎవరికి వాడతారు? అని ఓ వ్యక్తి అడిగితే, గాలిబ్ వెంటనే 'రాసేవాళ్లను బట్టి' అని సమాధానమిచ్చాడు. మగవాడు రాస్తే 'మేరా కలం' అని, ఓ మహిళ రాస్తే 'మేరీ కలం' అనీ అంటారంటూ ఛలోక్తి విసిరాడు.

అదే విధంగా 'జూతా', 'జూతీ'లో ఏది సరైన పదమని అడిగినప్పుడు, 'అగర్ జోర్‌సే పడేతో జూటా ఔర్ హల్కీ పడేతో జూతీ' (ఒకవేళ బలంగా తగిలితే జూతా.. మెల్లిగా తగిలితే జూతీ) అంటూ, చెప్పుల్లోనూ ఆడామగ తేడాను వివరిస్తాడు. గాలిబ్‌కు మామిడి పండ్లు అంటే చాలా ఇష్టం. అవి



అంటే అసలు ఇష్టం లేని ఓ వ్యక్తి గాలిబ్ దగ్గరికి వచ్చి 'ఆమ్‌తో గధే భీ నహీ ఖాతే' (మామిడి పండును గాడిద కూడా తినదు) అని విమర్శించే ప్రయత్నం చేస్తాడు. దానికి సమాధానంగా గాలిబ్ 'ఇసీ లియే గధే హై.. క్యోంకీ ఆమ్ నహీ ఖాతే' (అందుకే అది గాడిదైంది. ఎందుకంటే, అది మామిడి పండు తినదు కాబట్టి) అని చెంపపెట్టు సమాధానమిస్తాడు.

### గాలిబ్ స్థాయి వేరు...

మోమిన్ నుండి ఫైజ్ వరకు, ఉర్దూ కవులు ఎంతోమంది ఉన్నారు. షాయర్లలో ప్రతిభావంతులకు కొదువ లేదు. కానీ గాలిబ్ వ్యక్తిత్వానికి ఎవరూ సరిరారు. నిజాలను నిర్మొహమాటంగా చెప్పడంలో గాలిబ్‌ను మించిన వారు లేరు. అతని షాయరీలు, గజల్స్‌లో బాధ వినిపిస్తుంది. కన్నీరు కనిపిస్తుంది. గాలిబ్ ప్రపంచం గురించి ఆలోచించలేదు. ప్రపంచ ధోరణిని అనుసరించడానికి, అనుకరించడానికి ప్రయత్నించలేదు. తన ఆలోచనలను సమాకాలీన ధోరణుల చుట్టూ తిప్పలేదు. తాను చూసిన వాస్తవాలను రచనల్లో పొందుపరిచాడు. అనుభవాలను రాశాడు. తనను తాను పరిచయం చేసుకున్నాడు.

'హై ఔర్ భీ దునియా మే సుఖన్వర్ బహుత్ అచ్ఛే, కెహతే హై కే 'ఘాలిబ్' కా హై అందాజ్ ఎబయాన్



ఔర్' (వాక్చాతుర్యం ఉన్నవారు ప్రపంచంలో చాలా మందే ఉన్నారు. కానీ గాలిబ్ స్థాయి వేరని అంటారు) అని తన గురించి తానే చెప్పుకున్నాడు. మానసిక, ఆర్థిక సమస్యలతో అతను నిరంతరం పోరాటం సాగించాడు. పాత ఢిల్లీలో గాలిబ్‌కి హవేలీని ఇప్పుడు 'గాలిబ్ మెమోరియల్'గా మార్చారు. అక్కడ గాలిబ్‌పై ఒక ఎగ్జిబిషన్ ఉంది.'

# బహుముఖ ప్రజ్ఞాశాలి అలెక్సాండ్రోవిచ్

**రష్యన్ కవి వర్ధంతి నేడు**




రష్యా ఎంతో మంది గొప్పగొప్ప రచయితలను సాహితీ ప్రపంచానికి అందించింది. అలాంటి వారిలో బహుముఖ ప్రజ్ఞావంతుడిగా పేరు తెచ్చుకున్నాడు యెవ్‌జెనీ అలెక్సాండ్రోవిచ్ యెవ్టుషెంకో. 1933, జులై 18న జన్మించిన అలెక్సాండ్రోవిచ్, 2017 ఏప్రిల్ 1న తుదిశ్వాస విడిచాడు. ఒక నవలా రచయితగా, వ్యాసకర్తగా, నాటక రచయితగా, స్క్రీన్ రైటర్‌గా, ప్రచురణకర్తగా, నటుడిగా, సంపాదకుడిగా బహుముఖ ప్రజ్ఞ ప్రదర్శించాడు. యూనివర్సిటీ ప్రొఫెసర్‌గా ఎంతో మంది జీవితాలను తీర్చిదిద్దాడు. పలు చిత్రాలకు దర్శకత్వ బాధ్యతలు కూడా నిర్వర్తించాడు. తల్లి ఇంటిపేరును కూడా తన పేరుకు జతచేయడం అలెక్సాండ్రోవిచ్‌ను ప్రత్యేక వ్యక్తిగా నిలబెట్టింది. సైబీరియాలోని ఇర్కుటస్క్ ప్రాంతంలో, జిమా అనే చిన్నపట్టణంలో, ఒక రైతు కుటుంబంలో జన్మించిన అలెక్సాండ్రోవిచ్‌కు రష్యన్, బాల్టిక్ జర్మన్, ఉక్రేనియన్, పోలిష్, బెలారసియన్, టాటర్ మూలాలు ఉన్నాయి. అతని తల్లి ముత్తాత జోసెఫ్ బైకోవ్స్కీది స్టాచ్‌టా ప్రాంతం. అతని భార్య ఉక్రేనియన్ సంతతికి చెందినది. రైతుల తిరుగుబాటుకు జోసెఫ్ నాయకత్వం వహించాడు. తత్ఫలితంగా అతను దేశ బహిష్కరణకు గురై, సైబీరియాకు వెళ్లాల్సి వచ్చింది. ఆయన కుమార్తెల్లో మరియా బైక్వోవ్‌స్కాయ బెలారిసియన్ సంతతికి చెందిన ఎర్మోలై నౌమోవిచ్ యెప్టుషెండోను వివాహం చేసుకుంది. అతను మొదటి ప్రపంచ యుద్ధం సమయంలో ఇంపీరియల్ ఆర్మీలో సైనికుడిగా, అంతర్యుద్ధంలో రెడ్ ఆర్మీలో అధికారిగా పని చేశాడు. ఎర్మోలై పూర్వీకులు జర్మన్, బాల్టిక్ జర్మన్ సంతతికి చెందిన వారు. ఇంతటి వైరుధ్యమైన కుటుంబ నేపథ్యం ఉన్న అలెక్సాండ్రోవిచ్ ఆలోచనలు కూడా అంతే విభిన్నంగా ఉండేవి. చిన్నతనంలో సైబీరియాలోని జిమాలో నివసిస్తున్నప్పుడు తన మొదటి పద్యాలు, హాస్య చస్తుష్కిని రాశాడు. అలెక్సాండ్రోవిచ్ 7 సంవత్సరాల వయస్సులో అతని తల్లిదండ్రులు విడాకులు తీసుకున్నారు. అతను తన తల్లి వద్ద ఉండిపోయాడు. 10 సంవత్సరాల వయస్సులో, అతను తన మొదటి కవితను కంపోజ్ చేసాడు. ఆరు సంవత్సరాల తరువాత ఒక స్పోర్ట్స్ జర్నల్ అతని కవిత్వాన్ని ప్రచురించిన మొదటి పత్రిక. 19 సంవత్సరాల వయస్సులో, అతని మొదటి కవితల పుస్తకం 'ది ప్రాస్పెకట్స్ ఆఫ్ ది ఫ్యూచర్' ప్రచురితమైంది. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత , అతను మాస్కోకు వెళ్లి 1951 నుండి 1954 వరకు గోర్కీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లిటరేచర్‌లో చదువుకున్నాడు. అక్కడే తనను తాను రచయితగా తీర్చిదిద్దుకున్నాడు. అనంతరం యూనియన్ ఆఫ్ సోవియట్ రైటర్స్‌లో చేరాడు. అతని ప్రారంభ పద్యం So mnoyu vot chto proiskhodit ( 'నాకు అదే జరుగుతోంది' ) అనేది విశేష ప్రజాదరణ పొందింది. నటుడు, గేయ రచయిత అలెగ్జాండర్ డోల్కీస్ ఈ పాటపై ఇచ్చే ప్రదర్శనలు ప్రజల్లోకి వెళ్లాయి. 1955లో, సోవియట్ సరిహద్దులు తన జీవితంలో అడ్డంకిగా ఉన్నాయని ఒక కవిత రాశాడు. అతని మొదటి ముఖ్యమైన ప్రచురణ 1956 కవిత స్టాంసియా జిమా ( జిమా స్టేషన్). 1957లో, 'వ్యక్తిగతవాదం' వంటి రచనలతో సోవియట్ సాహిత్య సంస్థ నుంచి అలెక్సాండ్రోవిచ్ బహిష్కరణకు గురయ్యాడు. కానీ, సోవియట్ ప్రజల్లో అతని పద్యాలు, పాటలు, కవితలు విస్తృతంగా ప్రచారమయ్యాయి. క్రుష్చేవ్ థా సమయంలో రాజకీయంగా చురుకుగా ఉన్న రచయితలలో అలెక్సాండ్రోవిచ్ ఒకరు . 1961లో, అతను తనకు అత్యంత ప్రసిద్ధ కవిత అయిన బాబీ యార్ అని ఒక సందర్భంలో రాసుకున్నాడు. ఫలితంగా, నాజీల మారణకాండ తర్వాత అలెక్సాండ్రోవిచ్‌పై నిఘా పెరిగింది. ఆ సమయంలోనే నాజీల దురాగతాలపై అతను రచనలు చేశాడు. యూదుల మారణకాండను కళ్లకు కట్టినట్టు వర్ణించాడు. 1962 అక్టోబర్‌లో ప్రావ్దా వార్తా సంస్థ అతనిని కరస్పాండెంట్‌గా క్యూబాకు పంపింది. అనై ఐడాని 'నాస్లెడ్నికి స్టాలినా' (ది హెయిర్స్ ఆఫ్ స్టాలిన్ ) రాసి, మరోసారి సంచలనం సృష్టించాడు. 1963, జనవరిలో అతను పశ్చిమ జర్మనీ, ఫ్రాన్స్ దేశాల్లో పర్యటనను ప్రారంభించాడు. పారిస్‌లో ఉన్నప్పుడు, అతని ప్రీకోషియస్ ఆటోబయోగ్రఫీని ఎల్'ఎక్స్‌ప్రెస్లో ధారావాహికంగా ప్రసారం చేయడానికి ఏర్పాటు చేశాడు. ఇది మాస్కోలో ప్రకంపనలు సృష్టించింది. అనంతరం అతను స్వదేశానికి తిరిగి వెళ్లాడు. అతనిపై సోవియట్ యూనియన్ ఎలాంటి చర్యలు తీసుకోకపోయినప్పటికీ, చాలా సంవత్సరాలు విదేశాలకు వెళ్లకుండా అడ్డుకుంది. తాను చెప్పదలచుకున్న విషయాన్ని ఎలాంటి భయం లేకుండా వివరించే అలెక్సాండ్రోవిచ్, 1950, 1960 దశగాల్లో ప్రసిద్ధి చెందిన సోవియట్ యూనియన్ కవుల్లో ఒకడిగా గుర్తింపు పొందాడు. వాసిలీ అక్సియోనోవ్ , ఆండ్రీ వోజ్నెస్కీ, బెల్లా అఖ్మదులినా, రాబర్ట్ రోజ్డెస్ట్వెన్స్కీ , అనటోలీ గ్లాడిలిన్ వంటి రచయితల సరసన స్థానం సంపాదించాడు. రాజకీయ సిద్ధాంతాలు, విభేదాలను పక్కకు ఉంచితే, గొప్ప రచయితగా, అంతకంటే ఘనమైన మానవతావాదిగా అలెక్సాండ్రోవిచ్ పేరు చరిత్రలో నిలిచిపోతుంది.

## ఈ వారం కవితలు

### మీకు శతకోటి దండాలు



పారిశుద్ధ్యమే మన ప్రాణాలకు దివ్య ఔషధమని
ప్రతి మతపు అంతర్లీన ప్రబోధమని
కుటుంబానికి దూరమై
కరోనా మహమ్మారికి చేరువై
కనిపించని వైరస్ ప్రపంచంతో
కత్తులు లేని పద్మవ్యూహంలో
అనారోగ్యం చాటున
అందరికీ కనిపించే యుద్ధం చేస్తున్నారు..!
మృత్యువు కౌగిట్లోకి
వెళుతున్నామని తెలిసినా
మొక్కవోని ధైర్యంతో
దయగల హృదయ మందిరంతో
'మురుకు తత్వం'పై దండయాత్ర సాగిస్తున్నా రు..!
ప్రభాతరవి ప్రాభవం ప్రారంభం కాకమునుపే
నిషాంధకారంలో
'చీపురు'చిరుదీపంతో
చెత్త ను పారద్రొలి
వెలుగును సృష్టిస్తున్నారు..!
'శానిటైజర్' మంత్రంతో శాంతిని ఆహ్వానిస్తున్నారు..!
మదర్ థెరిస్సా మానవత్వపు పరిమళానికి
ప్రకాశ రంగులు అద్దుతున్నారు..!

అందరూ మీ జీవితాన్ని
మీ జీతంతో చిన్నచూపు చూస్తుంటే
పెద్ద మనస్సును ప్రదర్శిస్తూ
అమ్మలా మమ్మల్ని కాపాడుతున్న అవనిపై
ఆరోగ్య సైనికులు మీరు..!
పరిశుభ్రత పంటను పండిస్తున్న కర్షక
దేవుళ్ళు మీరు..!
శ్రీ శ్రీ మహాప్రస్థానపు అగ్గి రవ్వల్లారా..!
పారిశుద్ధ్య కార్మికులారా..!
మీ పాదాల స్పర్శతో..
మీకు శతకోటి దండాలు..!

ఫిజిక్స్ అరుణ్ కుమార్
9394749536

### శిఖరాగ్రం

మండుటెండలు ఒకవైపు
పండు వెన్నెల ఒకవైపు
వార్షిక పరీక్షలు ఒకవైపు
రాష్ట్ర ఎన్నికలు ఒకవైపు

మండు టెండలు తగ్గాలంటే
మెండుగ మొక్కలు నాటాలి
పండు వెన్నెల్లో తడవాలంటే
నిండు జాబిల్లినే చూడాలి

వార్షిక పరీక్షల్లో నెగ్గాలంటే
నేర్పుగ ఓర్పుగ చదవాలి

ఎన్నికల్లో గెలుపొందాలంటే
అన్ని విషయాల్లో నైపుణ్యం ఉండాలి

ఓటర్లు విచక్షణతో ఓటే వెయ్యాలి
మాట నిలబెట్టే వ్యక్తికే పట్టం కట్టాలి
చట్ట సభల్లో సగౌరవంగా కూర్చోబెట్టాలి
ఓటర్లకు ఓటమి లేదని ఋజువు చేయాలి

మంచి వారినే ఎపుడూ ఎన్నుకోవాలి
ముంచే వారినే ఎపుడూ సాగనంపాలి
అభివృద్ధి సంక్షేమమే నిత్యం జరగాలి
సుభిక్షంగ మన రాష్ట్రమే శిఖరాగ్రం చేరాలి

గుండాల నరేంద్ర బాబు
తిరుపతి

### నీరే ఆధారం!



ఎర్రటి ఎండల్లో నెర్రలు బారిన
నేలల్లో వలసల్లా సాగుతోన్న దాహం!
నెత్తిన ఖాళీ బిందెలతో దూరాలు
తగ్గించేసినా చెమటల్లో తప్ప నీటిని
నిజంగా చూడలేని నిస్సహాయత
ఒక్క చెలమ చెలిమి లేని ఒంటరి
ఇసుక దారుల్లో కన్నీటి పొరల్లోంచే
కానరాని నీటిజాడ కోసం అన్వేషణ!

చేతులు కాలాక ఆకులు పట్టినట్టు..
అమృత దారల్లాంటి వర్షపు నీళ్ళు
నేలపాలైన గాజు ప్రతిమలా వెక్కిరిస్తుంటే
ఆ ముత్యపు బిందువుల్ని గుదిగుచ్చి
భద్రంగా దాచుకోలేని నిర్లక్ష్య ఫలమిది
నదుల ఊపిరి తీసేలా ప్రవాహదారుల్ని
కాచి రిసార్టుల్ని గుండెలపై అదిమేసి
నదీమ తల్లిని ఎముకల గూడు చేసి
అడవుల్లో ఆటవిక రాజ్యం స్థాపించి
పచ్చదనాన్ని నల్లధనంగా మార్చేసి
నేలతల్లి గుండెల్లోకి ఎండిన బోర్లేసి
భూగర్భజలాలకు గర్భశోకం తెచ్చిపెట్టి

అవినీతి సంపాదనకే పథకాలు తప్ప
సాగునీటికి తాగునీటికి ప్రణాళికలు
లేని దూరదృష్టి రాహిత్యపు దురదృష్టాల్ని
వెంటేసుకొని ఎండిన బావుల చుట్టూ
ఆవురావురాని మూగే కాకులమయ్యేం!

ఖాళీ బిందెలు బీళ్లు పడిన నేలలు
ఎండిన గొంతుకలతో పాడిపంటలు కరువై
ఎడారి కష్టాలై తడారిన బతుకులయ్యాయి
పరిసరాలు ఎండి గుండె తడి ఆవిరయ్యేక
ఇకనైనా మనం కళ్ళు తెరవాలి తప్పదు!
ప్రతి నీటి బిందువు సాక్షాత్తూ అమృత
బిందువేనని గుర్తించి నీటిని పూజించాలి..

భీమవరపు పురుషోత్తమ్
9949800253

### 'నర(క)'రూపాలు

పాలివాండ్ల ఆస్తి తగాదాలు
ఈర్ష్యాద్వేషాల బుసబుసలు
గెట్టు, పుట్ట పంచాయితీలు
నవ్వినోన్ని అణగదొక్కే ఆక్రోశాలు
నవ్వులు వెనక నరక చూపులు !

లేనోడ్ని చూసి వెకిలి సకిలింపులు
వెన్నుపోటు పొడిచే వాక్కు కత్తులు
మగువల చీర నగల సిగపట్లు
మహిళల మధ్య ఎత్తిపొడుపులు
ప్రేమ పాల నురగల్లో నిమ్మ రసాలు !

అనుబంధాల్లో అనంత అగాధాలు
కల్మషాల కంపు కరచాలనాలు
షరతులతో కూడిన స్నేహాలు
ప్రశంసల వెనుక విష విమర్శలు
ఎక్కేవాడిని లాగే ఎండ్రి కాయలు !

జారి పడ్డోన్ని చూసి సకిలింపులు
సెల్‌ఫోన్‌లో మొలుస్తున్న స్నేహాలు
ఆన్‌లైన్ వేదికల్లో ప్రేమ పెళ్లిళ్లు
బీరువాల్లో తాళి పెట్టే ఇల్లాళ్లు
ఏడడుగుల్ని ఎగతాళి చేసే జంటలు !

సహజీవన శారీరక సుఖ సంబరాలు
మూన్నాళ్ల ముచ్చట్లాన మూడుముళ్లు
పారాణి ఆరక ముందే విడాకులు
నల్ల ధనార్జనలే చీకటి సూత్రాలు
టేబుల్ మీదే అమ్యామ్యా ఒప్పందాలు !

రక్తం పీల్చే లంచావతార జలగలు
అక్కెరకురాని నేటి మంచితనాలు
నడమంత్రపు నరక నర పోకడలు
తెరమీద నకిలీ వెలుగుల రంగులు
తెరవెనుక మురికి దురాలోచనలు

మధుపాలీ
9949700037

### జంపింగ్ ??!!

నాయకుల జీవితం అంతా
ఒక పార్టీ నుండి
మరో పార్టీకి సునాయసంగా 'జంపింగ్!'
పదవీ వ్యామోహం జీవిత ధ్యేయం
జపింగ్ అలంకారం !!

ప్రజాసేవ చేయాలంటే పదవే అతి ముఖ్యమా !!
ప్రజలంతా నాయకుల జంపింగ్ గురించే
హాస్యంగా చెప్పుకుంటున్నారు!
ముక్కుమీద వేలు వేసుకుంటున్నారు
ఎన్నికల్లో ఎవరు ఓటు వేస్తారు !
ఎలా గెలుస్తారు !
గొప్ప నాయకుడని ఎవరు కొలుస్తారు
జీవితమంతా జంపింగ్ లతో ఓటమి పాలు !!

కందాళై రాఘవాచార్య

### అమ్మ..నాన్నకు శత కోటి వందనాలు

అమ్మే నా దైవం
అమ్మకు శతకోటి వందనాలు
అమ్మను మించిన ప్రేమ మరొకటి లేదు
అవనిలో దైవం లాంటి అమ్మ!!
అమ్మ ఒడిలోనే మన భాష
ప్రపంచానికి పరిచయం చేసేది అమ్మ
అమ్మ ను మించిన దైవం లేదు
ఆత్మ గాళ్ళు అమ్మ!!

అనురాగం ఆప్యాయత పంచే అమ్మ
అమ్మ కు గుండెల్లో గుడి కట్టాలి
అమ్మది ఆకాశమంత ప్రేమ
సృష్టి కి అమ్మ మూలం!!

అమ్మ ఎన్ని జన్మలెత్తినా నీ ఋణం తీర్చలేను
ఓ తల్లి నీజోల పాటే మధురం
అవనిలో అమ్మ ప్రేమే గొప్పది!!
నాన్న నా బలం

నాన్న ను మించిన ప్రేమ మరొకటి లేదు
నాన్న నా దైవం నడక నేర్పిన నాన్న!!

నాన్న అంటే ఆకాశమంత ప్రేమ
నాన్న నాకు కొండంత అండ
ఆత్మగాళ్ళు నాన్న
అనురాగం ఆప్యాయత పంచే నాన్న!!

కన్నవారికి మెతుకు
కన్న బిడ్డకు బతుకు
నిచ్చుటకై నాన్న పరుగు!!
కనిపించే దైవం అమ్మానాన్న
మన సంతోషమే నాన్న సంతోషం
నాన్న ప్రేమ అజరామరం
నాన్న త్యాగమూర్తి.!!

దేవులపల్లి రమేశ్,
9963701294

## ప్రజలు బుద్ధిచెప్పినా తీరు మార్చుకోని బిఆర్ఎస్ నేతలు : విప్ ఐలయ్య



ప్రజాపక్షం/ఆలేరు : తెలంగాణ రాష్ట్ర ప్రజలు కేసీఆర్‌కు బుద్ధి చెప్పిన వారి తీరు ఇంకా మార్చుకోలేదని దురాకారంతో వ్యవహరిస్తున్నాడని ఆలేరు ఎంఎల్ఎ, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఎన్నో పథకాలను అమలు చేయడం జరిగిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతులకు అందించిగా పథకాలు అందిస్తూ వారితో పాటు విద్యుత్ అందిస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు ఇటీవల జరిగిన ఎన్నికల్లో కేసీఆర్‌కు బుద్ధి చెప్పినా ఇంకా బుద్ధి రాలేదని హేళన చేశారు. కాలేశ్వరం అని చెప్పి లక్షల కోట్లు దండుకొని రాష్ట్రాన్ని అప్పుల పాలు కేసీఆర్ చేశాడని గుర్తు చేశారు. తెలంగాణ ప్రజలు నిన్ను విస్మరించి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి చేస్తే మొసలి కన్నీరు కారుస్తూ మళ్ళీ రైతుల పొలాల్లోకి ఏ ముఖం పెట్టుకొని వెళ్తున్నావని మండిపడ్డారు. గత సంవత్సరం వర్షాలు తక్కువ పడటం వల్లే భూగర్భ జలాల్లో నీరు లేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వల్ల కరువు రాలేదని వర్షాలు లేక ప్రాజెక్టులన్ని ఎండిపోయాయని పేర్కొన్నారు. రైతుల పొలాలు ఎండిపోవడం బాధాకరమే గాని రైతుల గురించి ప్రభుత్వం ఆలోచిస్తుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే రైతుల సంక్షేమం సాధ్యపడుతుందని వారన్నారు. కెసిఆర్ చిల్లర మల్లర మాటలు బంద్ చేసి ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించి ప్రతిపక్షపాత్రను సక్రమంగా నిర్వహించాలన్నా రు. కార్యక్రమంలో యాదగిరిగుట్ట మండలం ఎంపీపీ చీర శ్రీశైలం, మండల పార్టీ అధ్యక్షుడు కానుగు బాలరాజుగౌడ్ పాల్గొన్నారు.

## సమాజంలో గురువుది ప్రత్యేక స్థానం



ప్రజాపక్షం/చొప్పదండి : విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శనం చేసి, బంగారు భవిష్యత్తుకు బాటలు వేసే గురుకువు సమాజంలో ప్రత్యేక స్థానం ఉందని కరీంనగర్ జిల్లా చిగురుమామిడి ఎంపిపి కొత్త వినీత శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం చిగురుమామిడి జడ్పి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దోమ లింగారెడ్డి ఉద్యోగ విరమణ ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. దోమ లింగారెడ్డి శకుంతల దంపతులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఎంపిపి మాట్లాడుతూ గత 35 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ ఎంతో మంది విద్యార్థుల భవిష్యత్తులను తీర్చిదిద్దాడని కొనియాడారు. లింగారెడ్డి స్వగ్రామమైన చిగురుమామిడిలో పదవీ విరమణ పొందడం సంతోషకరమన్నారు. గత ప్రభుత్వం మన ఊరు మన బడి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఎంతగానో కృషి చేసిందన్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి గీకురు రవీందర్, ఎంవో శ్రీనివాస్ రెడ్డి, పిఆర్‌టియు రాష్ట్ర అసోసియేష్ సభ్యుడు బాల్‌రెడ్డి, సిఆర్‌పి ఆంజనేయులు, పాఠశాల ఉపాధ్యాయులు, విధ్యార్థులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఖాతాదారుల సేవే లక్ష్యం



ప్రజాపక్షం/నల్లగొండ : ఖాతాదారుల సేవే లక్ష్యంగా సంఘమిత్ర కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ పని చేస్తూ అందరి మన్ననలు పొందుతుందని బ్యాంక్ ఫౌండర్ అండ్ చైర్మన్ సంఘం రామకృష్ణ తెలిపారు. ఆదివారం పట్టణంలోని రత్న ఫంక్షన్ హాల్‌లో జరిగిన 51వ సర్వసభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. 1998 సంవత్సరంలో స్థాపించిన సంఘమిత్ర కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తూ ప్రతి సంవత్సరం లాభాల బాటలో పయనిస్తుందని పేర్కొన్నారు. 1035 మంది వాటాదారులతో రూ.133.13 లక్షల వాటా ధనము కలిగి ఉందని పేర్కొన్నారు. 2974 మంది డిపాజిట్ దారులతో 78.29 కోట్ల డిపాజిట్స్ సేకరించినట్లు తెలిపారు. లాభాలు రూ.1.81 కోట్లు కలిగి అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ వైస్ చైర్మన్‌లు సన్నిదాన చక్రపాణి, మహ్మద్ షరీఫ్, డైరెక్టర్లు పున్న చండీకేశ్వర్, కొంగరి బిక్షం, గజ్జెల వెంకటేశ్వర్లు, గుండ అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## స్త్రీశక్తి అవార్డు గ్రహీతకు సన్మానం



ప్రజాపక్షం/దేవరకొండ : దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ భవనంలో ఆదివారం సావిత్రిబాయి పూలే ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్త్రీ శక్తి జాతీయ అవార్డు పురస్కారం పొందిన మల్లికేటి లావణ్య ను ఆదివారం మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్‌విటిలు శాలువా, మెమోంటంతో ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ స్పోర్ట్స్ అసోసియేషన్‌కు చెందిన మహిళా డ్యాన్స్ మాస్టర్ లావణ్యకు జాతీయ స్థాయి అవార్డు రావడం గర్వించదగ్గ విషయం అని అన్నారు. కార్యక్రమంలో శాంసన్, ఉమామహేష్, శ్రీధర్‌గౌడ్, కృష్ణకిషోర్, నిరంజన్, భాస్కర్‌రెడ్డి, సురేష్, జయలక్ష్మి, ప్రసన్న, వాసు పాల్గొన్నారు.

## అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : సుదీర్ఘకాలం న్యాయశాఖలో అంకితభావంతో పనిచేసి అందరి మన్ననలు పొందడం అభినందనీయమని న్యాయశాఖ ఉద్యోగుల సంఘం ఆలిండియా అధ్యక్షులు బి.లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా న్యాయశాఖలో పదవి విరమణ చేసిన డి. లక్ష్మారెడ్డి, వి రమేష్ ల సన్మానోత్సవ కార్యక్రమం జిల్లా న్యాయ శాఖ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా న్యాయ సేవా సదన్ కార్యాలయంలో నిర్వహించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో మెరుగైన సేవలందించే అధికారులకు ప్రజలలో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. పదవి విరమణ తర్వాత ఉద్యోగి కుటుంబ సభ్యులతో జీవనం సాగించాలన్నారు. పదవీ విరమణ ప్రభుత్వ ఉద్యోగికి తప్పదు అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయశాఖ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు కె. జగన్నాథం, ఎస్వి సుబ్బయ్య, న్యాయ శాఖ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు మాతంగి వీరబాబు, కార్యదర్శి ఎం విద్యాసాగర్ రెడ్డి, కోశాధికారి ఎండి లతిప్ పాష, సభ్యులు ఆర్ గిరిధర్, జంగయ్య, వంశీకృష్ణ, జి.సరిత, ఎం.సరస్వతి, ఎం.ఉషారాణి కుటుంబ సభ్యులు బంధువులు పాల్గొన్నారు.

# మీ ఆట ముగిసింది.. కాంగ్రెస్ ఆట మొదలైంది

### మంత్రి సీతక్క



ప్రజాపక్షం/కౌటాల : బిజెపి, బిఆర్ఎస్ ఆట ముగిసిందని, కాంగ్రెస్ ఆట మొదలైందని, త్యాగాల కుటుంబం ఇందిరమ్మది కుటుంబమని మంత్రి దనసరి సీతక్క అన్నారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండల కేంద్రంలోని జగదాంబ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ముఖ్య అతిథిగా జిల్లా ఇంచార్జ్ మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఈ సమావేశంలో బిఎస్‌పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జెడ్పి మాజీ చైర్మన్ సిడం గణపతి, ఆయన వర్గీయులు మంత్రి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి శాలువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ గాంధీ కుటుంబానికి ముప్పై నాలుగు సంవత్సరాల తర్వాత మళ్ళీ ప్రధానమంత్రి అవకాశం రానుందని, రాహుల్ గాంధీని ఈసారి ప్రధాని చేసే విధంగా ప్రజలు ఆశీర్వదించాలన్నారు. మోడీ పదేళ్ళలో మతాల కొట్లాటలు తెచ్చాడని, ఉద్యోగాలు, అభివృద్ధి అడిగితే రాముడి అక్షింతలు పంపించి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. దేవుళ్ల పేరుతో బిజెపి రాజకీయాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందని, దీన్ని ప్రజలు గమనించి తగిన బుద్ధి చెప్పాలన్నారు. రూ.500 వందలు ఉన్న గ్యాస్ సిలిండర్‌ను రూ.1200 వందలు చేసిన ఘనత మోడీ సర్కార్‌కు దక్కిందన్నారు. అదాని, అంబానీల కోసమే బిజెపి పనిచేస్తుందన్నారు. గాంధీని చంపిన గాడ్సేకు మద్దతు తెలిపి పూజించే పార్టీ బిజెపి అని, వాళ్ళు కాంగ్రెస్‌ను పూర్తిగా నాశనం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. కరోనా కష్ట సమయంలో కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి సర్కారు ప్రజలకు ఎలాంటి సహాయం చేయలేదని, నల్లధనం తీసుకువస్తా, ప్రతి ఒక్కరి బ్యాంకు ఖాతాలో పదిహేను లక్షల రూపాయల వేస్తా అన్న మోడీ దాని మాట కూడా ఎత్తడం లేదని విమర్శించారు. బిఆర్ఎస్ గల్లీలో కూడా కనిపించదని, దానికి ఓటు వేయడం దండుగా అన్నారు. తమకు లొంగలేదని శిబూసోరెన్ వంటి గిరిజన నాయకుణ్ణి జైలుకు పంపిన చరిత్ర బిజెపికి ఉందన్నారు. ఏడు లక్షల కోట్ల అప్పు ఉన్నా ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఉచిత బస్సు ప్రయాణం, 200యూనిట్లు కరెంటు, రూ.500లకే గ్యాస్ సిలిండర్‌ను అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే 92శాతం మందికి రైతుబంధు ఇచ్చామన్నారు. బహుజనవాదం అంటూ, దళితుల పక్షపాతిగా గొప్పలు చెప్పిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఇప్పుడు కెసిఆర్ పంచన చేరి కెసిఆర్ పాలన స్వర్ణయుగం అంటూ కితాబు ఇవ్వడం హాస్యాస్పదంగా ఉం దన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బిజెపి, బిఆర్ఎస్ మాయమాటలు నమ్మి ఓటువేయద్దని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి కాంగ్రెస్ పార్టీని పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపి అభ్యర్థి, ఆత్రం సుగుణ, మాజీ ఎంఎల్ఎ కోనేరు కోనప్ప పాల్గొన్నారు.

## అంబేద్కర్ విజ్ఞాన మందిరానికి పుస్తకాలు అందజేత



ప్రజాపక్షం/అయిజ : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విజ్ఞాన మందిరానికి ఆదివారం దాత గోరంట్ల జయదేవ్ విద్యార్థుల పోటీ పరీక్షల కోసం, మరియు నిరుద్యోగుల కోసం, గోరంట్ల జయదేవ్ పుస్తకాలు, కుర్చీలు, పాడ్స్, లైట్లు, డోర్సు, బెంచీలు, వాటర్ కాన్లు, విండోనెట్, ముఖ్యంగా విద్యార్థుల కోసం గ్రూప్స్, టెట్, డిఎస్సీ, ఎస్సై, కానిస్టేబుల్, జాబ్స్‌కోసం కావలసిన బుక్స్ అందజేశారు. అలాగే వివిధ అవసరాలు కోసం అంబేద్కర్ విజ్ఞాన మందిరానికి 30 వేల రూపాయలు ఇచ్చి ఆయన దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా దాత గోరంట్ల జయదేవ్‌ను గ్రంథాలయ కమిటీ సభ్యులు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

## అన్యాక్రాంతమవుతున్న భూదాన్ భూములు

### సర్వోదయ మండలి రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ నాయక్



ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం : మండల కేంద్రంలో సర్వోదయ మండలి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వోదయమండలి రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ నాయక్ మాట్లాడుతూ అన్యాక్రాంతం అవుతున్న భూదాన్ భూముల రక్షణకు వెంటనే తెలంగాణ భూదాన్ యజ్ఞ బోర్డ్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ గాంధీభవన్లో ఉంటూ అక్కడే ఆంధ్రప్రదేశ్ భూధాన్ బోర్డు పేరుతో ఆఫీసు పెట్టి ఇప్పటికీ పాత తేదీలలో తెలంగాణ ఆంధ్ర ప్రాంత ప్రజలకు ప్రొసీడింగ్స్ ఇస్తూ అక్రమాలకు పాల్పడుతున్న గున్న రాజేందర్‌రెడ్డిపై సిఐడి కేసు నమోదైన స్టేలతో తప్పించుకుని తిరుగుతున్నారని, ఇప్పటికీ నేనే అధ్యక్షుడిని చలామణి అవుతున్న అతనిని గాంధీభవన్ నుండి తరిమేయాలన్నారు. భూదాన్ భూములలో అవినీతి అక్రమాలు జరుగుతున్న గత ప్రభుత్వం పట్టించుకోకుండా భూదాన్ బోర్డు రద్దుచేసి కోట్ల విలువలు చేసే భూతం భూములతో భూదందా చేసిందని మండిపడ్డారు. అలాగే మైహోమ్ రామేశ్వరరావు లాంటి అక్రమార్కుల చేతుల్లో వేలకోట్ల విలువలు చేసే భూదాన్ భూములను ఆక్రమించుకొని కట్టిన ఫ్యాక్టరీలు కూల్చి అయినా సరే నిరుపేదలకు పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశంలో 1951లో మొదటిసారిగా భూములను దానంగా గాంధీ ఆశయాలు, నెహ్రు ఆదేశాలతో, వినోభా దానంగా వచ్చిన భూదాన భూములను పేదవారికి పంపిణీ చేయడం జరిగిందని కానీ నేడు వారి ఆశయాలకు ఈ ప్రభుత్వాలు తిలోదాకాలిస్తూ చట్టాలకు తూట్లు పొడిచింది అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మందుగుల బాలకృష్ణ, సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఏపూరి సతీష్, మాజీ సర్పంచ్ రేడియ నాయక్, పాండు, మోత్య, సక్రి, నరేష్, శీను తదితరులు పాల్గొన్నారు. అనంతరం సర్వోదయ మండలి జిల్లా కన్వీనర్ కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కన్వీనర్ గా. ఆంబోతు రఘుపతి నాయక్ కో కన్వీనర్ గా గడ్డం యాదగిరిను ఎన్నుకున్నారు.

## ఆరు గ్యారంటీలు మాటలకే పరిమితం

### ఆర్ఎస్‌ప్రవీణ్ కుమార్



ప్రజాపక్షం /గద్వాల : కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు మాటలకే పరిమితం అయ్యాయని బిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి డా.ఆర్ఎస్ ప్రవీన్‌కుమార్ విమర్శించారు. ఆదివారం జోగులాంబ గద్వాలలో జరిగిన బిఆర్ఎస్ సమావేశంలో ఎంపి అభ్యర్థిని ఎన్నికల్లో గెలిపించాలని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎంపి అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ పాలనలో పేద ప్రజకు అభివృద్ధి సంక్షేమ పథకాలు అందేవని, కాంగ్రెస్ పానలో వంద రోజుల్లో కరువు వచ్చిందన్నారు. పదేళ్ల అభివృద్ధికి ఓటు వేద్దామా లేక వంద రోజుల అబద్దానికి ఓటు వేద్దామా అన్నారు. నన్ను ప్రజలు ఆశీర్వదిస్తే పార్లమెంటులో ప్రశ్నించే గొంతుకనవుతానని, ప్రతి కార్యకర్త, నాయకులు,నేనే ఎంపి అభ్యర్థిని నేనే ప్రవీణ్‌కుమార్ అని భావించి గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ మోసపూరిత విషయాలను ప్రజలకు వివరించాలని అలాగే బిఆర్ఎస్ పాలన అభివృద్ధిని వివరించి త్వరలో జరిగే 13వ తేది నాగర్ కర్నూల్ పార్లమెంటు ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేయించాలని భారీ మెజార్టీతో గెలిపించాలని బిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి అభిలాష్ రావు అన్నారు. బిఆర్ఎస్ పాలనలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయి కానీ కాంగ్రెస్ వచ్చిన వెంటనే కరెంటు, నీళ్ళు లేక పంటలు ఎండిపోయి రైతుల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్ పాలన వచ్చిన వలసలు ఆగాయి ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందాయి రైతులకు రైతుబంధు, కరెంటు,నీళ్ళు అందించాం ఎక్కడ చూసిన పచ్చని పంట పొలాలు ఉండేవని, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో కరెంటు, నీళ్లు లేక రైతుల గోస పడుతున్నారన్నారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున బిఆర్ఎస్ ప్రజా ప్రతి నిధులు,ముఖ్య నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## జిల్లాలో పోలీసుయాక్ట్ అమలు

### ఎస్‌పి చందనా దీప్తి

ప్రజాపక్షం/నల్లగొండ : జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని ఏప్రిల్ 1 నుండి 30 వరకు నెలరోజుల పాటు జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీసు యాక్ట్1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్‌పి చందనా దీప్తి తెలిపారు. పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేనిది జిల్లా ప్రజ లు, ప్రజా ప్రతినిధులు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని, శాంతి భద్రతలకు భంగం కలిగే విధంగా, ప్రజా ధనానికి నష్టం కల్గించే, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టకూడదన్నారు. జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు ఇట్టి విషయంలో పోలీసు వారికి సహకరించవలసిందిగా సూచించారు. అనుమతి లేకుండా పై చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్టరీత్యా కఠిన చర్యలు ఉంటాయి అని ఎస్‌పి చందనా దీప్తి హెచ్చరించారు.

### ఈతకు వెళ్లే పిల్లల పట్ల జాగ్రత్తలు



వేసవికాలం సమీపిస్తున్న తరుణంలో చిన్న పిల్లలు, యువకులు ఈత సరదా కొరకు వెళ్లి ఈత రాకపోవడంతో ప్రమాదాల బారిన పడే అవకాశాలు ఉన్నాయి. కాబట్టి పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని బావులు, చెరువులు, కాల్వల వద్ద ఈత కొట్టే సమయంలో జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఎస్‌పి చందనా దీప్తి తెలిపారు. వేసవి కాలం సమీపిస్తున్న తరుణంలో పాఠశాలలు లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో యువకులు, పిల్లలు స్నేహితులతో కలిసి ఈత సరదా కొరకు బావుల వద్ద కాలువల్లో, చెరువుల్లో ఈతకు పోతుంటారు. ఈత రాని వారు బావిలోకి, చెరువులోకి దిగి ప్రమాదాల బారిన పడిన సంఘటనలు ప్రతి సంవత్సరం కొన్ని ప్రాంతాలలో చోటు చేసుకుంటున్నాయని గుర్తు చేశారు.

## అధైర్యపడకండి..అండగా ఉంటాం

### ఖమ్మం ఎంపి నామా నాగేశ్వరరావు



ప్రజాపక్షం/నేలకొండపల్లి : రాష్ట్రంలో సాగు, తాగు నీటి కోసం ప్రజలు, రైతులు కన్నీళ్లు పెడుతున్నారని ఖమ్మం ఎంపి నామా నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని నేలకొండపల్లి, సింగారెడ్డిపాలెంలో ఆదివారం ఎండిన వరి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులు, ప్రజలు కన్నీళ్లు పెడుతున్నారన్నారు. రైతులు అధైర్యపడవద్దని.. బిఆర్ఎస్‌కు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ అసమర్థత వలన ఈ దుస్థితి నెలకొందన్నారు. ఎండిన ప్రతీ ఎకరానికి రూ.30 వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, జడ్పీ చైర్మన్ కమల్‌రాజు, వైస్‌చైర్మన్ ధనలక్ష్మి , మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, చంద్రావతి, కురాకుల నాగభూషణం, నాగుబండి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## ప్రజలను మాయచేసి మభ్యపెడుతున్న సర్కార్

### బోయినపల్లి వినోద్ కుమార్



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : ఆరు గ్యారంటీల అబద్దాల పునాదులపై కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని.. ప్రజలను మాయచేసి మభ్యపెట్టిందని కరీంనగర్ బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ ఆరోపించారు. మానకొండూర్ నియోజకవర్గ స్థాయి బిఆర్ఎస్ విద్యార్థి యువ చైతన్య సదస్సు అల్గునూరులో శ్రీ లక్ష్మి నర్సింహగార్డెన్‌లో జరిగింది. ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ రసమయి బాలకిషన్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ 14 ఏళ్లు కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో గోదావరి, కృష్ణ నదులపై కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి ఇరిగేషన్ ప్రాజెక్టులను నిర్మాణం చేసి కోటి ఎకరాలకు సాగునీళ్లు ఇవ్వడం జరిగిందన్నారు. పదేళ్లలో 1.61లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయడం జరిగిందన్నారు. తెలంగాణ ఏర్పాటయ్యాక 26వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల నిర్మాణం చేసి వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా చేయడం జరిగిందన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడునెలల్లోనే కరెంటు కోతలు మొదలయ్యాయన్నారు. 2014లో ఎంపిగా గెలిచిన తర్వాత కొత్తపల్లి నుంచి మనోహరాబాద్ వరకు రైల్వేలైన్, కరీంనగర్ చుట్టుపక్కల నాలుగు జాతీయరహదారులు,వెయ్యికోట్లతో కరీంనగర్‌కు స్మార్ట్ సిటీ తీసుకురావడం జరిగిందన్నారు. కరీంనగర్‌లో ట్రిబుల్ ఐటి మంజూరు చేయించి 50ఎకరాల ప్రభుత్వ స్థలం కేటాయిస్తే ప్రస్తుత ఎంపి బండి సంజయ్ పట్టించుకోకపోవడంతో బిజెపి కేంద్ర ప్రభుత్వం ఇతర రాష్ట్రాలకు తరలించిందన్నారు. కరీంనగర్ పార్లమెంటు పరిధిలో బండి సంజయ్ ఒక్క నవోదయ పాఠశాల తేలేదన్నారు. బండి సంజయ్ ఏ అర్హతతో ప్రజలను ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు. పార్లమెంటులో ప్రశ్నించే గొంతు వినిపించాలంటే ప్రజలు కారు గుర్తుపై ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జివి రామకృష్ణరావు, జడ్పి వైస్‌చైర్మన్ సిద్దం వేణు, రాష్ట్ర నాయకులు గెల్లు శ్రీనివాస్ యాదవ్, ఏనుగు రవీందర్ రెడ్డి, ద్యావ మధుసూధన్‌రెడ్డి, జక్కుల నాగరాజు యాదవ్, శ్రీనాథ్‌గౌడ్, హరిబాబు, గంప వెంకన్న, మహిపాల్ రెడ్డి, మహిపాల్, శేఖర్ గౌడ్, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, దేవేందర్ రెడ్డి, రమేష్, భూపతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం చేతకానితనంతోనే రాష్ట్రంలో కరువు

### మాజీ మంత్రి పువ్వాడ అజయ్



ప్రజాపక్షం/ఖమ్మం : కాంగ్రెస్ పాలన వైఫల్యం, చేతకాని తనం వల్లే రాష్ట్రంలో కరువు వచ్చిందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆరోపించారు. కెసిఆర్ అంటేనే కాలువలు, చెరువులు, నదులని ఆయన లేకపోవడం వలనే నాలుగు నెలల్లో పరిస్థితి తారుమారైందని ఆయన తెలిపారు. ఆదివారం బిఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అజయ్‌కుమార్ మాట్లాడుతూ మన చేతుల్లో ఉన్న వ్యవస్థలను పదేళ్లుగా కాపాడుకున్నామని కానీ ఇప్పుడు వ్యవస్థలను కాపాడలేని స్థితికి కాంగ్రెస్ వచ్చిందన్నారు. పంటలు ఎండిపోవడమే కాకుండా తాగునీటి కరువు రానుందని మార్చి నెలలోనే పరిస్థితి ఈవిధంగా ఉంటే భవిష్యత్తు ఏమిటని అజయ్‌కుమార్ ప్రశ్నించారు. విద్యుత్ సమస్య కూడా తీవ్రం కానుందన్నారు. పంటలు ఎండిపోయిన రైతులకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ జిల్లాలో పాలేరు రిజర్వాయర్ కింద ఎండిపోయిన పంటలను పరిశీలించామని కేసిఆర్ చెరువులు నింపి సాగునీటిని అందించి పంటలను కాపాడారని కాంగ్రెస్ ఆ పని చేయలేకపోయిందన్నారు. ఖమ్మం పార్లమెంటుతో పాటు రాష్ట్రంలో 14 పార్లమెంటు సీట్లను బిఆర్ఎస్ గెలుచుకోబోతుందన్నారు. ఖమ్మం పార్లమెంటు బిఆర్ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఒక తడి నీరు అంది ఉంటే పంట చేతికొచ్చేదని ఎండిన పంటలను చూస్తుంటే బాధేసిందన్నారు. నాలుగు నెలల్లో రాష్ట్రంలో చాలా కష్టాలు వచ్చాయని నామ తెలిపారు. సమావేశంలో జెడ్పిఛైర్మన్ లింగాల కమల్‌రాజు, ఎంఎల్‌సి తాతా మధుసూదన్ రావు, మాజీ ఎంఎల్ఎలు సండ్ర వెంకటవీరయ్య, వనమా వెంకటేశ్వరరావు, మదన్‌లాల్, మెచ్చా నాగేశ్వరరావు, బానోత్ చంద్రావతి, మేయర్ పునుకొల్లు నీరజ, కూరాకుల నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

### వాటర్ మేనేజ్‌మెంట్ తెలియదు

ఖమ్మం అర్బన్ : కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం వల్లే నేడు ప్రజలకు, రైతులకు తాగు, సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. ఆదివారం గట్టయ్య సెంటర్‌లోని బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పువ్వాడ మాట్లాడుతూ కాంగ్రెస్‌కు వాటర్ మేనేజ్‌మెంట్ తెలియదన్నారు. కేసిఆర్ పాలనలో ఇలాంటి పరిస్థితి చూడలేదన్నారు. నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నాయని రైతులు వాపోతున్నారని ఎంపి నామ నాగేశ్వరరావు తెలిపారు. ఒక తడి నీళ్లు వదిలిన పంటలు చేతికి వచ్చేవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని నామ తెలిపారు.

### అబద్దపు ప్రచారంతో అధికారంలోకి

ఖమ్మం రూరల్ : అబద్దాలు, గోబెల్స్ ప్రచారంతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తన వెంట కరువును తీసుకువచ్చిందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ విమర్శించారు. నీళ్లు లేక ఎండిపోయిన ఖమ్మం జిల్లాలోని పాలేరునియోజకవర్గంలోని పాలేరురిజర్వాయర్‌ను ఆదివారం ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర,మాజీ ఎమ్మెల్యేలు సండ్రా వెంకట వీరయ్య, మదన్‌లాల్, శ్రేణులతో కలిసి పువ్వాడ అజయ్ పరిశీలించారు. ఈ సందర్భంగా పువ్వాడ మాట్లాడుతూ తక్షణమే సాగర్ జలాల ద్వారా పాలేరు జలాశయాన్ని నింపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ తాతా మధు, బిఆర్ఎస్ నాయకురాలు చంద్రావతి, జడ్పీ ఛైర్మన్ లింగాల కమల్‌రాజు, డిసీసీబీ మాజీ ఛైర్మన్ కూరాకుల నాగభూషణం, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు బెల్లం వేణు, నాయకులు వేముల వీరయ్య, ఎండి ఆసీఫ్‌పాషా, వడ్త్యా బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ముచ్చటగా మూడో పార్టీలోకి...



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి :** తెలంగాణ మాజీ ఉప ముఖ్య మంత్రి, స్టేషన్‌ఘనపూర్ ఎంఎల్‌ఎ కడియం శ్రీహరి ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. తన కూతురు కడియం కావ్యతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, తెలంగాణ ఇంచార్జీ దీపాదాస్ ముప్షీ చేతుల మీదుగా కాంగ్రెస్ కండువాను కప్పుకున్నారు. కడియం కాంగ్రెస్‌లో చేరడంతో గత నాలుగు రోజులుగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో నెలకొన్న రాజకీయ ఉత్కంఠకు తెర పడింది. కడియం శ్రీహరి కాంగ్రెస్‌లో చేరినప్పటికీ ఎంపిగా పోటీ చేస్తారా..తన కూతురునే పోటీలోకి దింపుతారా అన్నది ఇంకా ఆసక్తిగా ఉంది.

కడియం శ్రీహరి వృత్తిరీత్యా అధ్యాపకుడు. జనగామ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేశారు. టిడిపి ఆవిర్భావంతో ఆ పార్టీలో చేరా రు. స్టేషన్‌ఘనపూర్ నుండి 1994లో పోటీ చేసి గెలు పొందారు. సాంఘీక సంక్షేమ శాఖ మంత్రిగా పనిచేశారు. 1999 ఎన్నికల్లోనూ గెలుపొందిన కడి యం నీటిపారుదల శాఖ మంత్రిగా పనిచేశారు. 2004 ఎన్నికల్లో ఓడిపోగా 2008లో వచ్చిన ఉప ఎన్నికల్లో మళ్లీ గెలుపొందారు. పై పదవులు అన్ని టిడిపి నుండి పొందినవే. తెలంగాణ వచ్చిన తరువాత బిఆర్ఎస్‌లో చేరడానికి సిద్ధమైన కడియంను కెసిఆర్ స్వాగతించారు. 2014లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తరువాత వచ్చిన పార్లమెంట్ ఎన్నికల్లో కడియం శ్రీహరి వరంగల్ ఎంపిగా పోటీ చేసి గెలుపొందారు. తాటికొండ రాజయ్యను గొలగించి కడియంను ఉప ముఖ్యమంత్రిగా చేశారు. 2018లో స్టేషన్‌ఘనపూర్ ఎంఎల్‌ఎ టిక్కెట్టు ఆశించి బంగపడ్డారు. 2023 ఎన్నికల్లో తప్పక టిక్కెట్టు ఇవ్వాలని కెసిఆర్‌ను కోరిన నేపథ్యంలో రాజయ్యను కాదని కడియంకు టిక్కెట్టు ఇచ్చారు. 2014 నుండి 2024 మార్చి వరకు కడియం బిఆర్ఎస్‌లో ఉన్నారు. ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. అంటే కడియం శ్రీహరి రాజకీయ ప్రస్తానం 1983లో ప్రారంభం కాగా 30 ఏండ్ల పాటు కడియం శ్రీహరి టిడిపిలో ఉన్నారు. ఆ తరువాత 10 ఏండ్లు బిఆర్ఎస్‌లో పనిచేశారు. ఇప్పుడు కాంగ్రెస్ తీర్థం పచ్చుకున్నారు. ఒక విధంగా చెప్పాలంటు ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయాల్లో కడియం తలపండిన నాయకుడనే చెప్పాలి.

**కాంగ్రెస్ శ్రేణుల కలయిక సవాల్**

కడియం కాంగ్రెస్ పార్టీలో చేరినప్పటికీ స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గంలో ఆ పార్టీ శ్రేణులను కలుపుకొని పనిచేయడం సవాల్‌గా మారింది. రాష్ట్ర స్థాయిలో పెద్ద లీడర్ అయినప్పటికీ నియోజకవర్గంలో మాత్రం కాంగ్రెస్ శ్రేణులు కడియం చేరికను వ్యతిరేకిస్తున్నారు. బహిరంగ విమర్శలు చేయడంతో పాటు కడియంపై అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. గత 40 ఏండ్లు కాంగ్రెస్ కార్యకర్తల్ని విరోదులుగానే చూశారు. ఇప్పుడు వారందరిని కలుపుకొని పనిచేయాల్సిన పరిస్థితి. అయితే పార్లమెంట్ పరిధిలో భూపాలపల్లి, పరకాల, వర్ధన్నపేట ఎంఎల్‌ఎలతో సన్నిహిత సంభందాలే ఉన్నాయి. వీరు గతంలో టిడిపిలో కలిసి పనిచేశారు. ఇక వరంగల్ తూర్పు, పశ్చిమ ఎంఎల్‌ఎలతోనూ ఎలాంటి విబేధాలు లేవు. స్టేషన్‌ఘనపూర్‌లోనే పరిస్థితి ఎలా ఉంటుందన్నది చూడాలి.

## అగ్నికి ఆహుతి అవుతున్న అడవులు



**ప్రజాపక్షం/గోవిందరావుపేట :** పస్రా నుండి 163 నేషనల్ హైవే మీద పస్రా నుండి తాడ్వాయి వరకు ఎక్కడ ఖాళీ లేకుండా అడవుల మొత్తం దగ్ధం అవుతున్న పట్టించుకోలేక పోతున్న ఫారెస్టు అధికారులు, అడవులు మొత్తం అగ్నికి ఆహుతి కాకుండా అడవులను అంతరించిపోకుండా, జీవరాశులు అగ్గికి మృత్యువాత చెందకుండా కాపాడాల్సిన బీట్ ఆఫీసర్లు, ఫీల్డ్, సెక్షన్ ఆఫీసర్లు ఎంతో మంది అధికారులు ఉన్న మొత్తం అడవి తగలబడుతున్న హైవే మీద ఒక్కరు కూడా స్పందించలేకపోవడం, ఎలాంటి చర్య తీసుకోలేకపోవడం ఏమవుతుందని తెలుసుకోలేకపోవడం విడ్డూరంగా ఉందని హైవే మీద పోతున్న వాహనదారులు విడ్డూరంగా చూస్తూ ఉంటున్నారు. రోడ్డుకు ఇరువైపులా అడవులు మొత్తం తగలబడుతున్న అధికారులు ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఇంత వరకు స్పందించకపోవడం పెద్ద పెద్ద వృక్షాలు తగలబడిపోతున్న అడవుల్లో ఉన్న జీవరాశులు మృతి చెందుతున్న వాయు కాలుష్యం అవుతున్న రహదారి వెంట పొగ కప్పి ఉండడం వలన వచ్చి పోయే వాహనాలకు ఇబ్బందులు ఎదురవుతున్న అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వింతగా ఉంది. రహదారి వెంట ఉన్న అడవులకు నిప్పు అంటుకొని తగలబడి పోతున్న స్పందించిన అధికారులు ఎక్కడో ఎదో అడవి లోపల ఏదో జరిగితే వెంటనే ఎలా స్పందిస్తారని ఎండాకాలం రావడం వలన ఆకతాయిల వలన అడవులకు నిప్పంటిస్తున్న వారిని అరికట్టలేక అంటుకున్న అడవిని కాపాడలేక అధికారులు విఫలమవుతున్నారని స్థానికులు అనుకుంటున్నారు. ఏ విధమైన చర్యలు తీసుకుంటే అడవుల్లో అగ్గి అంటించే వారిపై చర్యలు తీసుకోగలుగుతారని అంటుకున్న అడవులను ఏ విధంగా సంరక్షిస్తూ ఉండాలని అధికారులు ముందు ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు, వాహనదారులు కోరుకుంటున్నారు.

## ఎండిన పంటల్ని పరిశీలించిన కెసిఆర్



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి :** పొలం బాట కార్యక్రమం చేపట్టిన తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఆదివారం జనగామ జిల్లా దేవరుప్పుల మండలంలోని దరావత్‌తండాలో ఎండిన పంటల్ని పరిశీలించారు. ఆదివారం ఉదయం ఎర్రవెల్లి ఫాంహౌస్ నుండి బయలుదేరిన కెసిఆర్ మొదటగా జనగామకు చేరుకున్నారు. అక్కడి నుండి దేవరుప్పుల వరకు వాహన ర్యాలీగా కేసీఆర్ వెళ్లారు. ధరావత్‌తండాలోని ఆంగోతు హామీ అనే రైతు పంట పొలాన్ని పరిశీలించారు. ఆంగోతు హామీకి 6 ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా పూర్తిగా వరి నాటు పెట్టారు. రెండు ఎకరాలు ఎండిపోయింది. నాలుగు బోర్లు వేసినప్పటికీ నీరు రాలేదని ఆ రైతుకు కెసిఆర్‌కు వివరించారు. ఎండిన పంటను పరిశీలించిన కెసిఆర్ రైతులు ఇచ్చిన వరిగట్టిని పట్టుకొని పరిశీలించారు. ఆ రైతులతో మాట్లాడారు. గతంలో ఎలా ఉండే ఇప్పుడు ఎలా ఉందని అడిగారు. ఆంగోతు హామీ అనే రైతు తన బిడ్డ పెళ్లి ఉంది, పంట చూడబోతే ఎండిపోయిందని తెలపగా ఆర్థిక సహాయం అందిస్తామని కెసిఆర్ హామీ ఇచ్చారు. అక్కడి నుండి కెసిఆర్ తుంగతుర్తి మండలానికి బయలుదేరారు. కెసిఆర్ రాక సందర్భంగా ఉమ్మడి జిల్లా నేతలు మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, జనగామ ఎంఎల్‌ఎ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంఎల్‌ఎలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, గండ్ర రమణారెడ్డి, రెడ్యానాయక్, చల్లా ధర్మారెడ్డి మాజీ ఎంపి మాలోతు కవిత కేసీఆర్‌కు స్వాగతం పలికారు. ఎంపి సంతోష్‌కుమార్, జనగామ ఎంఎల్‌ఎ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి కాల్వ మల్లేష్ కేసీఆర్‌తోనే ప్రత్యేక బస్సులో ప్రయాణించారు. పదిహేను నిమిషాలు పంటల్ని పరిశీలించిన రైతులతో మాట్లాడిన కేసీఆర్ తిరిగి బస్సులోనే తుంగతుర్తికి బయలుదేరారు.

## సి-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలి

మెదక్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్



**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి :** సివిజిల్ యాప్ ద్వారా ప్రజలు తమ దృష్టికి వచ్చిన ఎన్నికల కోడ్ ఉల్లంఘనల పై ఫిర్యాదు చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ రాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటర్లను మభ్య పెట్టేందుకు ఎవరైనా అక్రమంగా నగదు, మద్యం, ఇతర వస్తువులను పంపిణీ చేయడం, ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడే వాటిని లైవ్ ఫోటోలు, లైవ్ వీడియోలను సి విజిల్ యాప్ ద్వారా తీసి పంపాలన్నారు. సివిజిల్ యాప్ ద్వారా అందిన ఫిర్యాదులపై వంద నిమిషాలలో సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటారని, లైవ్ ఫోటోలు, వీడియోలను తీసేటప్పుడు, అప్లోడ్ చేసే సమయంలో జిపిఎస్ ఆన్‌లో ఉంచాలని, జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ ద్వారా లోకేషన్ నమోదు అవుతుందని, సభలు, సమావేశాల్లో విద్వేషపూరిత కామెంట్స్ చేసిన, పార్టీ అభ్యర్థులు పంచే డబ్బులు, మద్యం, బహుమతులు లాంటి వివరాలను, అనుమతిలే కుండా ర్యాలీలు నిర్వహించిన, ఇతర ఎన్నికల ఉల్లంఘనలపై లైవ్ ఫోటోలు, వీడియోలు సి విజిల్ యాప్ ద్వారా పంపాలని సూచించారు. ప్ర జలు సివిజిల్ యాప్ ను తమ ఫోన్ లలో ప్లే స్టోర్ నుంచి డౌన్లోడ్ చేసుకొని తమ చుట్టుపక్కల జరుగుతున్న ఎన్నికల కోడ్ ఉల్లంఘనలను అప్లోడ్ చేసి తమ దృష్టికి తీసుకుని రావాలని, అదే విధంగా 1950 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా ఫిర్యాదులు చేయ వచ్చని, 24 గంటలు కలెక్టరేట్ కార్యాలయంలో సివిజిల్ యాప్ ఫిర్యాదులపై పర్యవేక్షణ చేయడం జరుగుతున్నదని, ఫిర్యాదు చేసిన వారి వివారలను గోప్యంగా ఉంచనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి ప్రకటనలో తెలిపారు.

## తప్పలను కప్పిపుచ్చుకునేందుకే పొలంబాట పట్టిన కెసిఆర్

ఎంఎల్‌ఎ మామిడాల యశస్వినిరెడ్డి



**ప్రజాపక్షం/పాలకుర్తి:** గతంలో చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకే మాజీ సిఎం కెసిఆర్ పొలంబాట పట్టారని ఎంఎల్‌ఎ మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంఎల్‌ఎ యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి హనుమాండ్ల ఝాన్సిరెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ యశస్వినిరెడ్డి మాట్లాడుతూ కెసిఆర్‌కు రైతులపై ప్రేమ ఉంటే అధికారంలో ఉన్నపుడు ఎందుకు వారిని పట్టించుకోలేదని వారికి నష్టపరిహారం ఎందుకు చెల్లించలేదన్నారు. పొలంబాట పేరు చెప్పుకొని కెసిఆర్ పర్యటన చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కెసిఆర్ తిహార్ జైల్లో ఉన్న కవితను పరామర్శిస్తే బాగుండేదన్నారు. కాళేశ్వం కుంగడం వల్లే నీరు దిగువకు విడుదల చేశారని దీంతో ఈ పరిస్థితి వచ్చిందన్నారు. తాము రైతులకు సాగునీరు అందించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. అనంతరం ఝాన్సిరెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి గెలుపుకోసం నియోజకవర్గ ప్రజలు అత్యధిక మెజార్టీ అందించనున్నట్లు తెలిపారు. కెసిఆర్ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు పర్యటన చేస్తున్నాడని ఆమె విమర్శించారు. ఈ సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ, హమ్యా నాయక్, నాయకులు నిరంజన్‌రెడ్డి, నెహ్రూ నాయక్, నల్ల శ్రీరాములు, సురేష్, పోగు శ్రీనివాస్, కారుపోతుల శ్రీనివాస్, కమ్మగాని నాగయ్య, యాక సోమయ్య, రమేష్, ఎల్లయ్య, శ్రీనివాస్, భాస్కర్, వెంకన్న, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ జన్మలో పిఎం కాలేరు

బిజెపి అభ్యర్థి రఘునందన్‌రావు



**ప్రజాపక్షం/ జగదేవ్‌పూర్:** ప్రజా సమస్యలను పక్కన పెట్టి అవినీతే ప్రధాన ధ్యేయంగా పని చేసే కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్ గాంధీ జన్మలో కూడ ప్రధానమంత్రి కారని మెదక్ పార్లమెంట్ బిజెపి అభ్యర్థి రఘునందన్‌రావు సంచలన వాఖ్యలు చేశారు. ఆదివారం సిద్దపేట జిల్లా జగదేవ్‌పూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బిజెపి విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. ప్రపంచ దేశాలు మెచ్చిన ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వంలో భారత దేశం అభివృద్ధిలో అగ్రగామిగా నిలిసుస్తున్న తరుణంలో ముడో సారి ముచ్చటగా నరేంద్ర మోడీ దేశ ప్రజల అశీర్వాదంతో ప్రధానమంత్రి కాబోతున్నరని జోస్యం చెప్పారు. గత తొమ్మిదన్నర సంవత్సరాల కాలంలో రాష్ట్రాన్ని ఏలిన బిఆర్ఎస్ పార్టీకి నేటి పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులు దొరకడంలేదని ఎద్దవ చేశారు. త్రిబుల్ సూటర్‌గా ప్రచారం చేసుకుంటున్న మాజీ మంత్రి హరీష్‌రావును సిద్దపేటలో ఎవరు దేకుతలేరని వాఖ్యలు చేశారు. రాబోయె ఎన్నికల్లో తనను మెదక్ పార్లమెంటు స్థానం నుండి భారీ మెజార్టీతో గెలించాలని కార్యకర్తలను కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎల్లు రాంరెడ్డి, గర్నె పల్లి కృష్ణామూర్తి , కుడిక్యాల రాములు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థిని అధిక మెజారిటీతో గెలిపించండి

మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు



**ప్రజాపక్షం/నిజాంపేట్/సిద్దిపేట జిల్లా ప్రతినిధి :** నిజాంపేట మండల కేంద్రంలో ఆదివారం బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మా దేవేందర్ రెడ్డి అధ్యక్షతన పార్లమెంట్ ఎన్నికల ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు, బిఆర్ఎస్ మెదక్ ఎంపి అభ్యర్థి వెంకట్రాంరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ మళ్లీ అందుకుగాను కాంగ్రెస్ పార్టీ నాయకులను కార్యకర్తలను అడుగడుగున నిలదీయండి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 100 రోజులలో 6 గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఫేక్ వార్తలతో ప్రజలను నట్టేట ముంచుతుందన్నారు. బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు మండుటెండల్లో సైతం 24 గంటల కరెంటును రైతులకు కాలేశ్వరం కాలువల ద్వారా పంట సాగుకు నీరునందించామన్నారు. బిజెపి పార్టీ 10 సంవత్సరాల పాలనలో తెలంగాణకు ఒక్క మెడికల్ కాలేజీ మంజూరు చేయకపోవడం రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం సహకరించలేదన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ బిజెపి పార్టీలు చేసింది ఏమీ లేదన్నారు. ఇప్పటికైనా తెలంగాణ ప్రజలు గమనించాలని రానున్న పార్లమెంట్ ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చని కాంగ్రెస్ బిజెపి పార్టీ అభ్యర్థులకు ఓటు వేస్తారా లేదా తెలంగాణ రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసిన బిఆర్ఎస్ పార్టీకి ఓటేస్తారా ప్రజల తేల్చుకోవాలన్నారు. మెదక్ ఎంపీ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా వెంకట్రాంరెడ్డి ఏడు సంవత్సరాలు కలెక్టర్ గా సేవలందించిన ఆయన ఎంతోమంది నిరుపేద కుటుంబాలకు అండగా ఉన్నారు. నిరుపేద విద్యార్థులకోసం పివిఆర్ ట్రస్టు ద్వారా 100కోట్లతో నిరుపేద విద్యార్థులకు ఉన్నత విద్య కొరకై సేవలందిస్తామని తెలిపారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలలో టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి వెంకటరామిరెడ్డిని కారు గుర్తుపై ఓటు వేసి అధిక మెజార్టీతో గెలుపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ షేర్ సుభాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి, అసెంబ్లీ ఇంచార్జ్ కంత రెడ్డి తిరుపతిరెడ్డి,పార్టీ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, ఎంపిపి సిద్ధరాములు,వైస్ ఎంపిపి అందే ఇందిరా రెడ్డి, సొసైటీ చైర్మన్లు అందే కొండల్ రెడ్డి,బాపురెడ్డి, ఎంపిటిసిలు బాల్రెడ్డి,సురేష్, తదితరులు పాల్గొన్నారు.

**కెసిఆర్ కష్టపడి రాష్ట్రం తెచ్చిండు... కాళేశ్వరం నీళ్లు ఇచ్చిండు...**

ప్రత్యేక రాష్ట్రం రాకముందు ఎడారిగా ఉన్న తెలంగాణను వచ్చాక కాళేశ్వరం నీళ్లతో గోదారి చేసిన ఘనత కేసీఆర్‌ది అని, మండుటెండల్లో చెరువుల్లో నీళ్లతో మత్తళ్లు దుంకుతున్నాయ్ అని మాజీ మంత్రి హరీశ్‌రావ్ అన్నారు. సిద్దిపేట రూరల్ మండలం సీతారాంపల్లి శంకర్ నగర్‌లో ఆదివారం జరిగిన పెద్దమ్మ దేవాలయ ప్రథమ వార్షకోత్సవంలో మరీశ్‌రావు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సంందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కష్టపడి రాష్ట్రం తెచ్చుడే కాకుండా రాష్ట్రానికి త్రాగు, సాగునీళ్లు ఇచ్చిండని గుర్తు చేశారు. పెద్దమ్మ తల్లి దయ, దీవెనలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు హరీశ్‌రావుని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు.

## బిఆర్ఎస్ ఉండద్దు.. బిజెపి గెలువద్దు..

ఎంఎల్‌ఎ రేవూరి ప్రకాశ్‌రెడ్డి



**ప్రజాపక్షం/గీసుకొండ:** పొచమ్మ కూడపెడితే మైసమ్మ తిన్నట్లు కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చి రూ. 16 వేల కోట్ల మిగులు బడ్జెట్ ఇస్తే రూ.7 లక్షల కోట్ల అప్పులు చేసి ప్రాజెక్టుల రీడిజైన్‌తో కెసిఆర్ కుటుంబం లాభ పడిందని పరకాల ఎంఎల్‌ఎ రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మరియపురం గ్రామ మాజీ సర్పంచ్, ప్రముఖ పారిశ్రామిక వేత్త అల్లం బాలిరెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి రావడం అభినందనీయమన్నారు. ఆదివారం మరియపురంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఎల్‌ఎ రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కత్తి వెంకటస్వామి బాలిరెడ్డికి కండువా కప్పి పార్టీలో ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి మాట్లాడుతూ.. గత 25 ఏళ్లుగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ ఏకగ్రీవ సర్పంచ్‌గా ఎన్నిక కాబడిన తన ఊరును బాలిరెడ్డి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకవచ్చారన్నారు. బాలిరెడ్డితో మొదలైన చేరికతో బీఆర్ఎస్ పార్టీ గ్రామాల్లో పూర్తిగా నిర్వీర్యం కావాలని, బీజేపీని గెలువనీయొద్దన్నారు. అటు బిఆర్ఎస్.. ఇటు బిజెపి పార్టీ రాష్ట్రంలో ప్రభుత్వాన్ని కూలగొట్టే ప్రయత్నం చేయకూడదంటే రాష్ట్రానికి శనిలా మారిన బిఆర్ఎస్‌ను రాష్ట్రంలో లేకుండా చేస్తామని.. కుక్కకాటుకు చెప్పుదెబ్బ మాదిరి అందుకు పార్టీలో అందరినీ ఆహ్వానిస్తామన్నారు. ఒబిసి ఈశాన్య రాష్ట్రాల ఇన్‌ఛార్జి కత్తి వెంకటస్వామి మాట్లాడుతూ.. బిజెపి రాష్ట్రానికి, దేశానికి చేసింది ఏమీలేదని అన్ని మాయ మాటలే అన్నారు. మోడీ, అమిత్‌షా బందీ నుంచి దేశాన్ని రక్షించడటానికి రాహుల్ గాంధీ వస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి, గీసుకొండ ఎంపిపి భీమగాని సౌజన్య, స్టేట్ కోర్డినేటర్ గాదె దయాకర్, జిల్లా, నియోజకవర్గ అధికార ప్రతినిధులు శ్రీనివాస్‌రెడ్డి, చాడ కొమురారెడ్డి, తదితరులు భారీ సంఖ్యలో కాంగ్రెస్‌లో చేరారు.

## దయనీయ స్థితిలో ఏటూర్ నాగారం గ్రామపంచాయతీ

**ప్రజాపక్షం/ఏటూరు నాగారం:** మేజర్ గ్రామ పంచాయతీ అయినా ఏటూర్ నాగారంలో ప్రస్తుతం గ్రామ పంచాయతీ పనితీరు ఏ విధంగా ఉందో అర్థమవుతుంది. ఇచ్చట కాంట్రాక్ట్ వసూలు సిబ్బంది ఆడిందే ఆట పాడిందే పాటగా సాగడం వల్ల కనీసం సిబ్బంది వేతనాలు కూడా ఇవ్వలేని దయనీయ స్థితిలో ఏటూర్ నాగారం గ్రామపంచాయతీ ఉంది. ప్రభుత్వం ద్వారా వచ్చే నిధులను 50 శాతం శాశ్వత పనులు మిగిలిన 50 శాతం నిధులతో గ్రామ పంచాయతీ సిబ్బంది వేతనాలు, పారిశుద్ధ నిర్వహణ, వీధిలైట్ల నిర్వహణ, అంతర్గత డ్రైనేజీల నిర్వహణ చేయవలసి ఉంటది కానీ ఈ మేజర్ గ్రామ పంచాయతీలో రెగ్యులర్ ఉద్యోగస్తులను ప్రజా ప్రతినిధులతో కలిసి ఈ కాంట్రాక్ట్ ఉద్యోగస్తులు ప్రభుత్వ నియమ నిబంధనాల ప్రకారం పని చేయనీయరు. గ్రామపంచాయతీకి రావలసిన ఇంటి పన్ను వసూలు మరియు పనేత్తరములు అనగా షాపింగ్ కాంప్లెక్స్ , వారసంత మరియు ఇసుక క్వారీల ద్వారా వచ్చే డబ్బులను వసూలు చేయడంలో కాంట్రాక్ట్ వసూలు సిబ్బందిదే హవా నడుస్తుంది. గతంలో ఇచ్చట పనిచేసిన ఇద్దరూ ముగ్గురు పంచాయతీ కార్యదర్శులను బదిలీ చేయించడంలో స్థానిక రాజకీయ నాయకులతో చేతులు కలిపి జిల్లా అధికారులతో మాట్లాడి బదిలీ చేయించడంలో వారి పాత్ర ఎంతో ఉంది అది అందరికీ తెలిసిన ఎవరూ బయటికి చెప్పలేని నిజం. ప్రస్తుతం ఆ గ్రామ పంచాయితీ లో పేరు కే.కార్యదర్శి పెత్తనం మాత్రం కాంట్రాక్ట్ బిల్ కలెక్టర్లది స్కేల్ పోస్ట్ కార్యదర్శి మరియు జూనియర్ అసిస్టెంట్ ఉన్న వాళ్ళు కేవలం సంతకనికే పరిమితం స్కేల్ పోస్ట్ బిల్ కలెక్టర్ ఉన్న పక్కన పెట్టిన వైనం ఎవరైనా వారికి ఎదురు చెప్తే ట్రాన్స్ఫర్ అని బెదిరిప్పు విల్లా పెత్తనం ఇంకా ఎన్ని రోజులు అని ప్రజలు వాపోతున్నారు. గ్రామ పంచాయితీ ఏదైనా పని ఉండి వెళ్ళాలంటే ఆలోచిస్తున్న వైనం వెళ్తే ఆ పని చేయడానికి ఎక్కడ డబ్బులు అడుగుతారో అని ప్రజలు వాపోతున్నారు. కావున పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి వర్యులు ఏటూర్ నాగారం గ్రామపంచాయతీ పై ప్రత్యేక దృష్టి పెట్టి నియమ నిబద్ధతో పనిచేసే అధికారులను నియమించి అన్ని తామై చక్రం తిప్పుతున్న తాతకాలిక ఉద్యోగస్తులను పక్కకు పెట్టి అభివృద్ధి అయ్యే విధంగా చేయగలరని గ్రామ ప్రజలందరూ వేడుకుంటున్నారు.




## ముమ్మరంగా పోలీస్ తనిఖీలు

**ప్రజాపక్షం/కేసముద్రం :** పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్లో డిఎస్పీ ఎం తిరుపతిరావు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చూడాలని పోలీస్ సిబ్బందికి సూచించారు.



## నూతన రా రైస్ మిల్లు ప్రారంభం

ఎంఎల్ఎ మైనంపల్లి రోహిత్‌రావు



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** నిజాంపేట మండల పరిధి లోని నస్కల్ గ్రామంలో నూతనంగా నిర్మించిన సాయి గాయత్రి ఇండస్ట్రీస్ రా రైస్ మిల్లును స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు రిబ్బన కట్ చేసి ప్రారంభించారు. సంబంధిత రైస్ మిల్ మిషన్లను టెంకాయ కొట్టి స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలనుపైన వినతి పత్రాలు తీసుకోవడం జరిగింది. అనంతరం యువనేత మైనంపల్లికి సలాం సలాం అనే పాటల సిడిని ఆవిష్కరించారు. గ్రామానికి సంబంధించిన రోడ్డు విషయంపై చర్చించగా సంబంధిత కాంట్రాక్టుకు కిషన్ రావుకు ఫోన్ చేసి రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మారుతి మహేందర్, నసీరోద్దీన్, సుప్రభాత్రావు, ముత్యంరెడ్డి, సత్యనారాయణ రెడ్డి, దేమే యాదగిరి, కరికే విద్యాసాగర్ కుమార్, మోహన్ రెడ్డి, నాతి లక్ష్మా గౌడ్, అజయ్, వెంకట్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ఎంఎల్ఎ



**ప్రజాపక్షం/ఇనుగుర్తి :** మండలంలోని చిన్న ముప్పారం గ్రామంలో ఆదివారం మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మేరకు దేవాలయ అర్చకులు క్రిష్ణ మోహన చార్యులు శాలువాతో సత్కరించి ఆశీర్వదించారు. అనంతరం గ్రామంలో సవారిలచ్చమ్మ తల్లి పండుగ లో పాల్గొని కొబ్బరి కాయ కొట్టి ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలిగి ఉండాలని మొక్కి వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు సత్యపాల్ రెడ్డి, ఇనుగుర్తి మండల పార్టీ అధ్యక్షులు కూరెల్లి సతీష్, యంపిటిసి కదిరె జగన్, సీనియర్ నాయకులు బైరి అశోక్ గౌడ్, గ్రామ పార్టీ అధ్యక్షులు, యూత్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో 30, 30(ఎ) పోలీసు యాక్ట్ అమలు

జిల్లా ఎస్‌పి చెన్నూరి రూపేష్



**ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి :** శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా నెల రోజు పాటు (ఏప్రిల్ 1వ తేది నుండి 30 వరకు 30,30(ఎ) పోలీసు యాక్ట్ 1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ తెలిపారు. పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేనిది సంగారెడ్డి జిల్లా ప్రజలు ప్రజా ప్రతినిధులు, ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు,ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు ,సభలు సమావేశాలు నిర్వహించరాదని, శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా ప్రజా ధనానికి నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, చేపట్టకూడదన్నారు. జిల్లా ప్రజలు ప్రజాప్రతినిధులు వివిధ సంఘాల నాయకులు ఇట్టి విషయంలో పోలీసు వారికి సహకరించవలసిందిగా సూచించారు. అనుమతి లేకుండా పై చర్యలకు పాల్పడితే సంబందిత వ్యక్తులపై చట్టరీత్య కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## కెయు కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని వినతి



**ప్రజాపక్షం/హన్మకొండ టౌన్ :** కాకతీయ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న బోధనేతర కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, మాజీ ఎమ్మెల్యే వేం నరేందర్‌రెడ్డి, తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాంలను కలిసి వినతిపత్రం అందచేశారు. ఆదివారం కేయూ బోధనేతర కాంట్రాక్ట్ ఉద్యోగుల జాక్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో వారిని కలిసి వినతిపత్రం అందించారు. కేయూలో సుమారు మూడు దశాబ్దాల నుంచి చాలీ చాలని వేతనాలతో పనిచేస్తున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా రెగ్యులరైజ్ చేయాలని కోరగా సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తానన్నారు. అవసరమైతే ఉద్యోగులతో సమావేశం ఏర్పాటుచేయిస్తామని నరేందర్‌రెడ్డి, కోదండరాం హామీ ఇచ్చినట్లు తెలిపారు. వినతిపత్రం అందించిన వారిలో జాక్ నాయకులు డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్, రాయికంటి సురేష్‌కుమార్, డాక్టర్ శాగంటి శ్రీనివాస్, నాగుల శివప్రసాద్, సంగాల రాజమౌళి, కొడవటిగంటి దయాకర్, డాక్టర్ సుదయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నత విద్యను అభ్యసించి భావి భారత పౌరులుగా ఎదగాలి

ఎంఎల్ఎ దొంతి మాధవరెడ్డి



**ప్రజాపక్షం/నర్సంపేట :** విద్యార్థులందరూ ఉన్నత విద్యను అభ్యసించి భావి భారత పౌరులుగా ఎదగాలని నర్సంపేట ఎంఎల్ఎ దొంతి మాధవరెడ్డి అన్నారు. పట్టణంలోని విజ్‌డామ్ పాఠశాలలో శనివారం రాత్రి గ్రాడ్యుయేషన్ డే, అన్యువల్ డే కార్యక్రమలను నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంఎల్ఎ మాట్లాడుతూ సరస్వతి దేవి ఆశీస్సులతో చిన్నారులందరు జీవితం అత్యున్నత స్థాయికి ఎదగాలని అదే విధంగా విద్య ద్వారనే సమాజాభివృద్ధి సాధిస్తుందన్నారు. విద్యార్థులందరు సంస్కారవంతులుగా సమాజంలో తయారవుతారని, విద్య గౌరవాన్ని పెంచుతుందని, విద్య ప్రతి ఒక్కరిని సమాజంలో అత్యున్నత స్థాయిలో నిలబెడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ జావీద్, జంగీర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పెండెం రామనంద్, తక్కళపల్లి రవీందర్‌రావు, పాలయి శ్రీను, వేముల సాంబయ్య గౌడ్, బత్తిని రాజేందర్, దండెం రతన్‌కుమార్, విజయ్‌కుమార్, ఒర్సు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## నిలువ నీడ లేక ప్రయాణికుల ఇబ్బందులు



**ప్రజాపక్షం/నెక్కొండ :** వరంగల్ జిల్లాలో రెండవ అతి పెద్ద రైల్వే స్టేషన్‌గా పేరున్న నెక్కొండ మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో రెండవ నెంబర్ ఫ్లాట్ ఫామ్‌పై కొనసాగుతున్న పనులతో ప్రయాణికులు నిత్యం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుత మార్చి నెలలోపే విపరీతమైన ఎండలతో ఉదయం గోల్కొండ ఎక్కడానికి వచ్చే ప్రయాణికులు నిలువ నీడ లేక బ్రిడ్జి మెట్ల పైన బ్రిడ్జి క్రింద ఎక్కడ నీడ ఉంటే అక్కడ ప్రయాణికులు తలదాచుకుంటున్నారు. సంబంధిత అధికారులకు ప్రజాప్రతినిధులకు ప్రయాణికులు నిత్యం ఎదుర్కొంటున్న గోసను పట్టించుకునే నాథుడే లేకుండా పోయే తక్షణమే తాత్కాలిక ఏర్పాటు చేయాలి, లేదా త్వరితగతిన పనులు పూర్తి చేసి రెండవ నెంబర్ ఫ్లాట్ ఫామ్‌పై షెడ్యూల్ నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఎంత ఆలస్యమైతే అంత నష్టం అధికార పార్టీలకే నష్టం వాటిల్లే ప్రమాదం పొంచి ఉందని రాబోయేవి పార్లమెంట్ ఎన్నికలు వైరి పక్షాలు ప్రభుత్వాలను బదనం చేయడానికి ఈ సమస్యను సోషల్ మీడియా, లేదా పేపర్ల ద్వారా విస్తృత ప్రచారం చేసిన యెడల అధికార పార్టీలకే నష్టం వాటిల్లుతుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



## ఆదుకోని ఆసరా... ఆందోళనలో పెన్షన్ దారులు

సిపిఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు

**ప్రజాపక్షం/సిరిసిల్ల :** గత బిఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగానే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పెన్షన్ లబ్ధిదారులకు నెలనెలా పెన్షన్లు అందక లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. ఆదివారం సిరిసిల్ల సుభాష్ నగర్ సిపిఐ కార్మిక భవనంలో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. ఏప్రిల్ ఒకటవ తారీఖు నాటికి రెండు నెలల పింఛన్లు ఇవ్వాల్సి ఉండగా ఇప్పటివరకు కూడా పెన్షన్ దారులకు వారి ఖాతాల్లో డబ్బులు జమ చేయకపోవడం ఫలితంగా వృద్ధులు వికలాంగులు ఒంటరి మహిళలు ఆందోళనకు గురి అవుతున్నారని అన్నారు. నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వము ఎన్నికల మేనిఫెస్టోలో పెన్షన్ లబ్ధిదారులందరికి 5000 రూపాయల పెన్షన్స్ జమ చేస్తామని చెప్పి ఇప్పటివరకు ఉన్న పెన్షన్ కూడా ఇవ్వకపోవడం దుర్మార్గం అన్నారు. దీని ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం చాలా సూచనీయమైనవని ఏది ఏమైనా మానిఫస్టోలో పెట్టిన విధంగా పెన్షన్ దారులు అందరు కూడా నెలకు ఐదువేల రూపాయల చొప్పున రెండు నెలల పెన్షన్స్ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం లోగా పెన్షన్ లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయకుంటే మున్సిపల్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి పంతం రవి, కార్యవర్గ సభ్యులు కడారి రాములు, సోమ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారు : జంగయ్య




**ప్రజాపక్షం/రంగారెడ్డి :** కేంద్రంలోని బిజెపి నేతృత్వంలోని మోడీ ప్రభుత్వం దేశ సంపదను అప్పనంగా ఆదాని, అంబానీలకు కట్టబెడుతున్నారని సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి అన్నారు. ఆదివారం భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) బాలాపూర్ మండలం నిర్మాణ మహాసభ నగర్ బుడగ జంగాల కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ ఓవైపు ప్రభుత్వ రంగ సంస్థలను పూర్తిగా నిర్వీర్యం చేస్తూ మరోవైపు ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహిస్తున్నారని తీవ్రంగా ధ్వజమెత్తారు. గత ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క వాగ్దానాన్ని అమలు చేయక పోగా ధనవంతుల్ని మరింత ధనవంతులుగా చేస్తూ పేదలను మరింత దిగదారిచే విధంగా ఆర్థిక సంస్కరణ తీసుకువచ్చిన మోదీ ప్రభుత్వాని పార్లమెంట్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని సిపిఐ నాయకులు పాలమాకుల జంగయ్య, ఆందోజు రవీంద్ర చారి లు పిలుపునిచ్చారు. అనంతరం సిపిఐ బాలాపూర్ మండల నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకులు పానుగంటి పర్వతాలు, స్థానిక నాయకులు చంద్రశేఖర్ రెడ్డి,శంకరయ్య,దశరథ, శత్రు నాయక్, అంజయ్య, రామస్వామి, యాదమ్మ, వీరస్వామి, శివ, మహేశ్వరి పాల్గొన్నారు. సిపిఐ బాలాపూర్ మండలం నూతన కార్యదర్శిగా ఎం. చంద్రశేఖర్ రెడ్డి ఎన్నుకోగా గా కార్యవర్గ సభ్యులుగా దశరథ, శంకరయ్య, శత్రు నాయక్, పిచ్చి రాజు, లక్ష్మమ్మ,వాణి,శివా నాయక్ ఎన్నుకోవడం జరిగింది.

## మధ్యాహ్న భోజన కార్మికుల బకాయిలు వెంటనే చెల్లించాలి



**ప్రజాపక్షం/సిరిసిల్ల :** మధ్యాహ్న భోజన కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం వీర్నపల్లి పెల్లి జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు వంట చేసి పెట్టిన డబ్బులు కోడిగుడ్ల బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టినట్టు పదివేల జీతం చెల్లించాలన్నారు. సిలిండర్లు, వంట సామాగ్రి, నిత్యవసర వస్తువులు ప్రభుత్వమే సప్లై చేయాలని కోరారు. అంగన్వాడీ కార్మికుల లాగా మధ్యాహ్న భోజన కార్మికులకు డ్రెస్ కోడ్ అమలు చేయాలన్నారు. సమస్యలపై ప్రభుత్వం స్పందించకుంటే జూన్ మాసం నుండి సమ్మెలోకి వెళ్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో తెలంగాణ మధ్యా హ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ వీర్నపల్లి మండల కమిటి చాకలి భాగ్య, శంకరయ్య, మల్లారం లక్ష్మి, గౌరీ, లక్ష్మీరాజవ్వ, భూధవ్వ, గంగవ్వ, దేవవ్వ, మమత, రాజవ్వ పాల్గొన్నారు.

## కామ్రేడ్ లింగయ్య ఆశయ సాధనకు ప్రజా పోరాటాలు



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** కామ్రేడ్ ఎన్నిక లింగయ్య ఆశయ సాధన కోసం ప్రజా పోరాటాలు నిర్మిద్దామని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కంబాల శ్రీనివాస్ అన్నారు.ఆదివారం పట్టణంలోని గోవిందాపురంకు చెందిన సీనియర్ కామ్రేడ్ ఎన్నిక లింగయ్య(65) అనారోగ్యంతో మృతిచెందాడు.కామ్రేడ్ లింగయ్య మృతదేహంపై సిపిఐ నాయకులు అరుణపతాకాన్ని కప్పి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కామ్రేడ్ లింగయ్య పోరాటాలలో చురుకుగా పాల్గొనేవారని తెలంగాణ మలిదశ ఉద్యమంలో తనవంతు పాత్ర పోషించాడన్నారు.సిపిఐ అభివృద్ధి కోసం జరిగిన పోరాటాలలో కామ్రేడ్ లింగయ్య ముందు భాగంలో ఉండేవారని ఆయన అన్నారు. కామ్రేడ్ లింగయ్య మరణం సిపిఐకే కాదు పట్టణానికి తీరనిలోటని ఆయన అన్నారు.నివాళులర్పించిన వారిలో ఏఐటియూసి జిల్లా అధ్యక్షులు జడ శ్రీనివాస్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు యల్లావుల రమేష్ సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి జక్కుల రమేష్,ఏఐటియూసి బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ప్రసాద్, సిపిఐ పట్టణ కార్యవర్గ సభ్యులు జడ వెంకన్న, సిపిఐ గోవిందాపురం కార్యదర్శి కుడితొట్టి స్వామి, దళిత కులపోరాట సమితి అధ్యక్షురాలు కుడితొట్టి సత్యావతి పాల్గొన్నారు.

# సింగరేణిలో రాజకీయ జోక్యం వద్దు

నూతన బొగ్గు గనులు వస్తేనే సంస్థకు భవిష్యత్తు
సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్




**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** సింగరేణిలో మునుపెన్నడు లేని విధంగా రాజకీయ జోక్యం అవినీతి తారాస్థాయికి చేరుకుందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ అన్నారు. ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మంజూరు నగర్ లోని ఇల్లందు క్లబ్ హౌస్ లో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్‌లో ఎఐటియుసి ట్రేడ్ యూనియన్ శిక్షణ తరగతుల కార్యక్రమంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అధ్యక్ష , ప్రధాన కార్యదర్శిలు మాట్లాడుతూ సింగరేణిలో అవినీతి రహిత పాలన కోరుకొని ఎఐటియుసిని కార్మికులు గుర్తింపు సంఘంగా గెలిపించాలని తెలిపారు. గత పాలకుల రాజకీయ జోక్యంతో కార్మిక సంఘాలే యాజమాన్యానికి బ్రోకర్లుగా ఏర్పాటు చేసి మెడికల్ దందా నిర్వహించారని విమర్శించారు. సింగరేణిలో నూతన గనులు వస్తేనే భవిష్యత్తు మనుగడ ఉంటుందని కొత్త బావుల ఏర్పాటు కోసం ఎఐటియుసి అనేక పోరాటాలు నిర్వహించిందని తెలిపారు. అట్లాగే సింగరేణిలో సింగరేణి తాడిచెర్ల ఓ సీ2 ఇల్లందు కోయగూడెం ఓసి త్రీ, సత్తుపల్లి శ్రావణిపల్లి కేకే 6 ఇంక్లైన్ బావులను సింగరేణి ఆధ్వర్యంలో బొగ్గు తీయాలని గుర్తింపు సంఘంగా యాజమాన్యాన్ని కోరడం జరిగిందని త్వరలోనే ఈ నూతన బావులు ఏర్పాటు అవుతాయని దీంతో మరో 50 ఏళ్లు సింగరేణి డోకా ఉండదని అన్నారు. సింగరేణిలో క్లరికల్ ఉద్యోగాలు ఇంటర్నల్ సింగరేణిలో పనిచేసే విద్యావంతులకే ఇవ్వాలని దానికోసం 360 పోస్టులు 15 రోజులలో నోటిఫికేషన్ రాబోతుందని తెలిపారు. గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ గెలిచి సుమారు మూడు నెలలు గడుస్తున్న ఇప్పటివరకు సింగరేణి యాజమాన్యం రాజకీయాలు చేస్తూ కోడ్ ఆఫ్ కండక్ట్ పేరుతో గుర్తింపు సంఘం పత్రం కూడా ఇవ్వడం లేదని అన్నారు. దీంతో స్ట్రక్చర్ మీటింగ్ లు జరగక కార్మిక సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. గతంలో హౌసింగ్ లోన్ పెట్టుకున్న వారికి లోన్ మంజూరు కాక ఆపేశారని వారికి కూడా ఇచ్చే విధంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. సింగరేణి పాఠశాలలో సిబిఎస్ సిలబస్ అమలు చేసే విధంగా యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని తెలిపారు. సింగరేణిలో జరిగే మెడికల్ అవినీతిని అరికట్టేందుకు, దరఖాస్తు చేసుకున్న అర్హత కలిగిన ప్రతి కార్మికుని కొడుకులకు డిపెండెంట్ ఉద్యోగాలు ఇవ్వాలని ఆ దిశగా యాజమాన్య దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని తెలిపారు. కార్మికులు ఏదైతే ఎన్నికల్లో ఏఐటీయూసీ ఇచ్చిన హామీల, ప్రతి సమస్య పరిష్కారం కోసం సింగరేణి కాలర్స్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి కార్మికుల పక్షాన నిరంతరం పోరాడుతుందని తెలిపారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ మిరియాల రంగయ్య, బ్రాంచ్ సెక్రటరీ మోట పలుకుల రమేష్, మాతంగి రామచందర్ గురుజేపల్లి సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.



## జిల్లాకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలి

తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్ :** క్రీడాకారులు ఉత్తమ ప్రతిభకనబర్చి సూర్యాపేట జిల్లాకు జాతీయస్థాయిలో గుర్తింపు తీసుకరావాలని తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్, టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సూర్యాపేట బాస్కెట్‌బాల్ క్లబ్ ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడుతూ మానసిక వికాసానికి, శారీరక ధృడత్వానికి క్రీడలు ఎంతగానో దోహద పడతాయన్నారు. క్రీడారంగా అభివృద్ధికి బలోపతానికి రాష్ట్ర ప్రభుత్వ పెద్దపీట వేస్తుందని తెలిపారు. త్వరలో సూర్యాపేట జిల్లా కేంద్రంలో బాస్కెట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలను ఏర్పాటు చేయడంలో తనవంతు పాత్ర పోషిస్తానని తెలిపారు. విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో రాణించాలని తెలిపారు. అమెరికా వంటి అభివృద్ధిచెందిన దేశాల్లో బాస్కెట్ బాల్ ఎంతో ప్రాచుర్యం పొందిందని, దేశంలో కొంత ఆదరణ తక్కువగా ఉందని, క్రీడాకారులు బాస్కెట్‌బాల్ పోటీల్లో విశేషంగా రాణించాలని తెలిపారు.

## ప్రజాస్వామ్యవాదులను గెలిపిద్దాం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్




**ప్రజాపక్షం/ మంచిర్యాల ప్రతినిధి :** పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజాస్వామ్య వాధుల్ని గెలిపించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ అన్నారు. సిపిఐ మంచిర్యాల జిల్లా సమితి సమావేశం అడేపు రాజమోగిలి అధ్యక్షతన ఆదివారం జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్, జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్‌లు మాట్లాడుతూ జిల్లా పార్టీ నిర్మాణాన్ని మరింత బలోపేతం చేసే విధంగా పార్టీ జిల్లా నాయకత్వం మరింత కృషి చేయాలని కోరారు. అదేవిధంగా పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజాస్వామ్య వాదుల్ని గెలిపించాలని అందుకు సిపిఐ కృషి చేస్తుందన్నారు. దేశంలో సహజ సంపదలను, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తూ, కార్మిక హక్కులను హరిస్తూ, చట్టాలను మార్చి ప్రజలను, కార్మికులను, కర్షకులను, నిరుద్యోగులను, విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్న బిజెపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఇండియన్ ఎయిర్ లైన్స్‌ని అధాని ఎయిర్ లైన్స్‌గా మార్చి దేశంలో ప్రైవేటు రంగాన్ని ప్రేరేపిస్తూ, ఆర్ఎస్ఎస్ భావజాలంతో నడుస్తున్న బిజెపిని ఓడించాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ నాయకులు అడెపు రాజమొగిలి, మేకల దాసు, ఖలిందర్ అలి ఖాన్, రేగుంట చెంద్రశేఖర్, మిట్టపల్లి వెంకటస్వామి, వీరభద్రయ్య, జోగుల మల్లయ్య, బోల్లం పూర్ణిమ, కారుకూరి నగేష్, మిట్టపల్లి శ్రీనివాస్, ఎస్‌కె బాజీ సైదా, ముస్కె సమ్మయ్య, మిట్టపల్లి పౌల్, కామెర దుర్గ రాజ్, దేవి పోచన్న, తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ మార్కెట్‌తో చిరు వ్యాపారస్తులకు ఉపాధి

ఎంఎల్ఎ యశస్వినీరెడ్డి



**ప్రజాపక్షం/తొర్రూరు :** మోడల్ మార్కెట్‌తో చిరు వ్యాపారస్తులకు ఎంతో ఉపాధి కలుగుతున్నదని పాలకుర్తి నియోజకవర్గ శాసనసభ్యురాలు యశస్వినీ రెడ్డి అన్నారు. ఆదివారం తొర్రూరు మున్సిపాలిటీలో ఉన్న మోడల్ మార్కెట్‌ను సందర్శించి కూరగాయల విక్రయదారులతో మాట్లాడి వారి వ్యాపార తీరుతెన్నులను అడిగి తెలుసుకున్నారు. అంతే కాకుండా విక్రయదారుల వద్ద స్వయంగా కూరగాయలను కొనుగోలు చేశారు. ఈసందర్భంగా వ్యాపారస్తులను ఎమైన సమస్యలు ఉన్నాయా అని అడుగగా ఆశించిన మేర గిట్టుబాటు కావడం లేదని తెలిపారు. అనంతరం ఎంఎల్‌ఎ యశస్వినీరెడ్డి మాట్లాడుతూ త్వరలోనే ఇక్కడ మాంసం విక్రయాలు జరిగేలా చర్యలు చేపడుతానన్నారు. మోడల్ మార్కెట్‌లో తాగునీరు, మూత్రశాలలు, విద్యుత్ దీపాలు తదితర సమస్యలను పరిష్కరిస్తానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మున్సిపాలిటీల అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నదని, ప్రతి మున్సిపాలిటీలో సమీకృత మార్కెట్ భవన సముదాయాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకవస్తున్నదని, మున్సిపాలిటీ ప్రజల సౌకర్యార్థం ఒకే దగ్గర అన్ని వసతులతో కూడిన మోడల్ మార్కెట్ ఉండటం ఇక్కడి ప్రజల అదృష్టమన్నారు. రూ. 3 కోట్లతో నిర్మించిన మోడల్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్‌తో పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. త్వరలోనే మార్కెట్‌కు ప్రహరీ గోడను నిర్మించే విధంగా చర్యలు చేపడుతానన్నారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, కాంగ్రెస్ తొర్రూరు పట్టణ అధ్యక్షులు సోమ రాజశేఖర్, కౌన్సిలర్లు తూనం రోజా ప్రభుదాస్, రేవతి శంకర్, శంకర్, పాల్గొన్నారు.

## అవినీతి, అక్రమాలను పారద్రోలడానికి యువత రాజకీయాలకు ఆకర్షితులవ్వాలి

ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర



**ప్రజాపక్షం/వలిగొండ :** అవినీతి, అక్రమాలను పారద్రోలడానికి యువత రాజకీయాలకు ఆకర్షితులు కావాలని, చెడు వ్యసనాలను దూరం చేసేందుకు, ఆరోగ్యవంతులుగా ఉండేందుకు క్రీడలు అవసరమని ఏఐవైఎఫ్ వలిగొండ మండల సమితి ఆధ్వర్యంలో భగత్ సింగ్ రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల 93వ వర్ధంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన క్రీడోత్సవాల ముగింపు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమం వలిగొండ మండలం ఆరూరు గ్రామంలో జరిగాయి. క్రికెట్ టోర్నమెంట్ ముగింపు సుద్దాల సాయికుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ ప్రదానోత్సవ కార్యక్రమానికి ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర, సిపిఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. క్రికెట్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. లింగరాజు పల్లి గ్రామానికి మొదటి బహుమతి, ఆరూరికి రెండవ బహుమతి, బహూకరించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.ధర్మేంద్ర మాట్లాడుతూ క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వ సహకారం పూర్తిగా అవసరమని, గ్రామీణ స్థాయి నుండే క్రీడలను ప్రోత్సహించి అధిక నిధులు కేటాయించాలన్నారు. ప్రస్తుత సమాజంలో యువత, విద్యార్థులు కేవలం పుస్తకాలకు మాత్రమే పరిమితమైన సమయంలో, యువతలో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఏఐవైఎఫ్ క్రీడలు నిర్వహించడం హర్షించదగ్గ విషయమని వారు అన్నారు. నేటి నవతరం రాజకీయాలకు ఆకర్షితులు కావాలని, రాజకీయాలంటే నిస్వార్థ సేవే లక్ష్యంగా ముందుకు సాగాలని వారు పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు మాట్లాడుతూ గుజరాత్, ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రాలలో బిజెపి ప్రజల మధ్య మత విద్వేషాలను రెచ్చగొడుతూ చీలికలు తెచ్చి అశాంతిని నెలకొల్పుతున్నదన్నారు. అదే విధానాలను తెలంగాణ లో కూడా అమలు చేయాలని ప్రజల మధ్య మతం రంగుతో అల్లర్లు నిర్వహించాలని బిజెపి కుట్రలు పన్నుతున్నదని ఈ దుష్ట చర్యలను రాష్ట్ర ప్రజలు తిప్పికొట్టాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎల్లంకి మహేష్, పెరబోయిన మహేందర్,సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు బబ్బురి శ్రీధర్, నాయకులు మేడి దేవేందర్, మారుపాక వెంకటేష్,ఎండి నయీమ్, బహుమతి దాత చిలకమర్రి నారాయణ, దుప్పల్లి జావిద్, జక్కడి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఎంఎల్‌సి ఎన్నికల కౌంటింగ్ పారదర్శకంగా నిర్వహించాలి

రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ రవినాయక్

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి:** ఏప్రిల్ 2న నిర్వహించే మహబూబ్ నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గ ఎంఎల్‌సి ఉప ఎన్నిక కౌంటింగ్‌ను పారదర్శకంగా నిబంధనల ప్రకారం చేపట్టాలని కౌంటింగ్‌ను పారదర్శకంగా, నిబంధనల ప్రకారం చేపట్టాలని రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ జి.రవినాయక్ అన్నారు. ఆదివారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎంఎల్‌సి ఎన్నిక కౌంటింగ్ సిబ్బందికి నిర్వహించిన శిక్షణ, కౌంటింగ్ రిహార్సల్స్‌కు ఆయన హజరై మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఏప్రిల్ 2న ఉదయం 8 గంటలకు మహబూబ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఎన్నికల కౌంటింగ్ ప్రారంభమవుతుందని అన్నారు. కౌంటింగ్ సిబ్బంది ఉదయం 6.30 కల్లా కౌంటింగ్ కేంద్రంలో రిపోర్టు చేయాలని అన్నారు. కౌంటింగ్ టేంటింగ్ కేటాయింపు చేసిన కౌంటింగ్ సిబ్బంది ఉదయం ఎనిమిది గంటలకు ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని ప్రారంభించాల్సి ఉంటుందని అన్నారు. ర్యాండమైజేషన్ ద్వారా కౌంటింగు సిబ్బందిని వద్దకు ఎంపిక చేస్తారని తెలిపారు. ఉదయం 7.30 గంటలకు స్ట్రాంగ్ రూమ్ తెరిచి బ్యాలెట్ బాక్సులు తీసుకురావాలని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రాధాన్యతా క్రమం ప్రకారం ఓటర్లు ఓటు వేస్తారని, కాబట్టి కౌంటింగులో భాగంగా మొదట ప్రారంభ లెక్కింపు చేపడతామన్నారు. ప్రారంభం లెక్కింపులో మొత్తం 10 పోలింగు కేంద్రాల్లో నమోదైన ఓట్లను లెక్కిస్తారని అన్నారు. ప్రారంభ లెక్కింపు అనంతరం మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు జరుగుతుందని, మొదటి ప్రాధాన్యత ప్రకారం ప్రతి అభ్యర్థి సాధించిన ఓట్లను లెక్కిస్తామని అన్నారు. మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు అనంతరం మొత్తం చెల్లుబాటు అయిన ఓట్ల సంఖ్య ఆధారంగా గెలుపు కోసం కావలసిన కోటాను నిర్ధారిస్తామని అన్నారు. ఎవరైనా అభ్యర్థి కోటాకు సరిపడు ఓట్లను సాధించినట్లుయితే అతనిని కావలసిన ఓట్లు రానట్లయితే తదుపరి ఎలిమినేషన్ ప్రక్రియను చేపట్టి తదుపరి ప్రాధాన్యత క్రమం ఆధారంగా ఓట్ల లెక్కింపు జరుపుతామని అన్నారు. ఈ ప్రక్రియ ఏదేని అభ్యర్థికి కోటా రానట్లయితే చివరికి మిగిలిన అభ్యర్థి గెలుపొందినట్లుగా ప్రకటిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు, డిఆర్‌ఓ కెవివి రవికుమార్, ఆర్‌డిఓ నవీన్, ఆర్‌డిఓ వి.మాధవ రావు షాద్‌నగర్, మాస్టర్ ట్రైనర్ తరాల పరమేశ్ పాల్గొన్నారు.



## కాలుష్యం వెదజల్లుతున్న మిల్లులను మూసివేయాలని ధర్నా

**ప్రజాపక్షం/నేరేడుచర్ల :** మున్సిపాలిటి పరిధిలోని జాన్‌పహాడ్ రోడ్డులో కాలుష్యం వెదజల్లుతున్న రాఘవేంద్ర, శ్రీ మల్లిఖార్జున రైస్ మిల్లులను తక్షణమే మూసివేయాలని మిల్లుల పక్కన ఉన్న కాలనీవాసులు డిమాండ్ చేశారు. మిల్లుల నుండి వెలువడే ధుమ్ము, ధూళి, పొగతో పాటు దుర్గంధపు వాసన ఇండ్లలోకి వస్తున్నందున భరించలేకుండా ఉన్నామని కాలనీవాసులు ఆదివారం రైస్ మిల్లుల ముందు ధర్నా నిర్వహించారు. రైస్‌మిల్లుల నుండి వచ్చే కాలుష్యంతో రోగాలు వచ్చి ఆస్పత్రి పాలవుతున్నామన్నారు. గతంలో ఈ రైస్ మిల్లుల ఉండి దుమ్ము,ధూళి, దుర్గంధం వస్తుందని మిల్లులపై చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు సంబంధిత ఉన్నతాధి కారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని వాపోయారు. ప్రజారోగ్యానికి నష్టం కలిగిస్తున్న రైస్ మిల్లులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. శ్రీ మల్లిఖార్జున రైస్‌మిల్లు జాన్‌పహాడ్ రోడ్డు పక్కన ఉండటం వలన మిల్లు నుండి వచ్చే ధుమ్ము,ధూళి రోడ్డుపై వాహనదారుల కళ్లలో పడి ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయన్నారు. ధర్నా చేస్తున్న మహిళలపై మిల్లుల యజమాన్యం దౌర్జన్యం చేయ డం దారుణమన్నారు. ధర్నా కార్యక్రమంలో ఆకారపు వెంకటేశ్వర్లు, చేపూరి మాలాద్రి, ప్రభాకర్‌రెడ్డి, గడ్డం సతీష్‌రెడ్డి. తాడోజు శ్రీనివాసులు, రమణమ్మ, సరిత,నందిని,గడ్డం మమత,సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్, జిల్లా కమిటీ సభ్యుడు వాస పల్లయ్య, ఐఎఫ్‌టియూ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్,పివైఎల్ జిల్లా నాయకులు కరుణాకర్ పాల్గొన్నారు.





## మాదిగలకు మొండిచేయి

ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకుడు మందక్రిష్ణ మాదిగ

**ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి :** లోక్‌సభ ఎన్నికలలో రాష్ట్రంలో ఎస్సీ జనాభాలో అత్యధికంగా ఉన్న మాదిగలకు ఒక్క టికెట్ కూడా ఇవ్వకుండా కాంగ్రెస పార్టీ మాదిగలకు మొండి చేయి చూపిందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందక్రిష్ణ మాదిగ అన్నారు. ఆదివారం హన్మకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మందక్రిష్ణ మాదిగ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీలలో 75 శాతం జనాభా మాదిగలే ఉన్నారని, కానీ మూడు లోక్‌సభా నియోజకవర్గాలలో కాంగ్రెస్ మాదిగలకు అవకాశం కల్పించలేదని అన్నారు.ఇప్పటికే నాగర్ కర్నూల్, పెద్దపల్లి నియోజకవర్గాలలో మాలలకు అవకాశం కల్పించిన కాంగ్రెస్ పార్టీ వరంగల్ నియోజకవర్గంలో బైండ్ల సామాజిక వర్గానికి చెందిన కడియం శ్రీహరిని పార్టీలోకి చేర్చుకుని ఆయన కూతురు కడియం కావ్యకు ఎంపి టికెట్ ఇస్తున్నారని అన్నారు. ఎంతో మంది కాంగ్రెస్ అర్హులైన వారు ఉన్నా మాదిగలకు అన్యాయం చేసిన కాంగ్రెస్‌కు రానున్న పార్లమెంట్ ఎన్నికలలో మాదిగలు గుణపాఠం చెబుతారని అన్నారు. రానున్న ఎన్నికలలో వరంగల్ ఎంపీ స్థానంలో కడియం కుటుంబాన్ని మాదిగలు ఓడించాలని కోరారు.ఈ విలేఖరుల సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర,జిల్లా నాయకులు పాల్గొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మాదిగ బిడ్డలైన డాక్టర్ టి.రాజయ్య, సిటింగ్ ఎంపి పసునూరి దయాకర్, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్‌లను రాజకీయంగా ఎదగనీయకుండా చేసిన కడియం శ్రీహరి చివరకు తన కూతురు గెలుపు కోసం కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లారని విమర్శించారు. రానున్న ఎన్నికలలో వరంగల్ ఎంపీ స్థానంలో కడియం కుటుంబాన్ని మాదిగలు ఓడించాలని కోరారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర,జిల్లా నాయకులు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com